ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



అధికార కేంద్రాలకు ప్రజాగళం వినిపిస్తాం

రేపు జంతర్ మంతర్ వద్ద సిజెపి నిరసన

మనుషులు, వన్యప్రాణుల సంఘర్షణ సమస్య పరిష్కారానికి యత్నాలు


సంపుటి 09, సంచిక: 207 | శనివారం | 27-06-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## అయోధ్య రామాలయ విరాళాలు దుర్వినియోగం



# 8 మంది అరెస్టు

### దర్యాప్తు వేగవంతం చేసిన సిట్

### ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, ట్రస్టీ రాజీనామా

**అయోధ్య :** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఉన్న రామమందిరానికి వచ్చిన విరాళాలను దుర్వినియోగం కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఎఫ్‌ఐఆర్‌లో పేర్లు ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఉన్నతాధికారులు శుక్రవారం తెలిపారు. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన ప్రాథమిక నివేదికలోని సిఫార్సుల ఆధారంగా, 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' సభ్యుడు కృష్ణ మోహన్ ఫిర్యాదు మేరకు ఈ ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న ఎనిమిది మందిని అరెస్టు తరువాయి 8లో

## సింగరేణిపై హరీశ్‌రావు

# దుష్ప్రచారం

### 40 లక్షల టన్నుల బొగ్గు మాయం ప్రచారం పూర్తిగా అసత్యం

- బిఆర్‌ఎస్ హయాంలో 75 లక్షల టన్నుల బొగ్గు మాయం ఆరోపణలకు సమాధానం చెప్పాలి
- రాజకీయ స్వార్థం కోసమే టిబిజికెఎస్ ఏర్పాటు
- బిఆర్‌ఎస్‌తోనే సింగరేణిలో రాజకీయ జోక్యం మొదలైంది
- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్

సింగరేణికి సంబంధించిన విషయాలపై బిఆర్‌ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు ఎఐటియుసి అనుబంధ కార్మిక యూనియన్‌పై, తనపై వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేస్తున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని హరీశ్‌రావు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని, ఒక్క బొగ్గు పెల్ల కూడా దొంగతనం జరిగే అవకాశం లేదన్నారు. సింగరేణి సంస్థ విధివిధానాలకు రుణాలు, రేటింగ్ లేదా ఇంకేదో దాని కోసం 40 లక్షల టన్నుల బొగ్గు లేనిది ఉన్నట్టు (ఇన్‌ఫ్లేట్) సింగరేణి చూపించినట్లు కనబడుతుందని, కానీ దొంగతనం జరిగినట్టు మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడడం అభ్యంతరకరమన్నారు. "సింగరేణిలో ఇప్పుడు స్కామ్ జరిగింది అంటే బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో 75 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఎక్కువ చూపించారు. అది కూడా స్కామ్ అని హరీశ్‌రావు ఎందుకు అనడం లేదు. ఇప్పుడు దొంగతనం జరిగింది అంటే అప్పుడు కూడా దొంగతనం చేసినట్టే కదా" అని సాంబశివరావు ప్రశ్నించారు. హరీశ్‌రావు ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరైందికాదని, ఆయన అసత్యాలు చెప్పడం మానేసి, బొగ్గు నిల్వలపై అనుమానం ఉంటే సిబిఐ విచారణ కొరవచ్చని సాంబశివరావు ఆయనకు సూచించారు. విచారణలో ఇప్పటి ప్రభుత్వం, బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాం నాటి బొగ్గు నిల్వలపై దర్యాప్తు చేయాలని కోరాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు తరువాయి 8లో

### సమస్యలు పరిష్కారం కాకపోతే


## ఆగస్టు 15 నుంచి సమ్మె

ప్రస్తుతం సింగరేణిలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 15 నుంచి సమ్మెకు పిలుపునిస్తామని సంస్థను హెచ్చరించినట్లు సాంబశివరావు వెల్లడించారు. హరీష్ రావు తనను సింగరేణి పక్షమా? స్కామ్‌ల పక్షమా? అని ప్రశ్నిస్తున్నారని, తాను ఎల్లప్పుడూ కార్మికుల పక్షమే అని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి పేరుతో రూ.26 వేల కోట్లు జెన్ కో వంటి సంస్థల పేరుతో బిఆర్‌ఎస్ ప్రభు త్వం అప్పులు చేసిందని, గత పదేళ్లు బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు.

### నిధుల కుంభకోణంపై

## 'సిట్'తో సరిపెట్టొద్దు

ఉన్నతస్థాయి స్వతంత్ర న్యాయవిచారణ జరిపించాలి
సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్



**న్యూఢిల్లీ:** అయోధ్య రామమందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి. రాజా డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేవలం ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్) విచారణతో సరిపెట్టకూడదని, పూర్తి నిజాలు తరువాయి 12లో

### సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో

## విచారణ జరిపించాలి

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను రద్దు చేయాలి : కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగంపై వివాదం నడుస్తున్న తరుణంలో సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను రద్దు చేయాలని కూడా పట్టుబట్టింది. అయోధ్య రామమందిరంలో విరాళాల చోరీ వ్యవహారం వెలుగులోకి రావడంతో 'హిందూమత స్వయం ప్రకటిత రక్షకులు'గా చెప్పుకునే బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ బండారం పూర్తిగా తరువాయి 12లో

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా

## సంజయ్ జాజు



- 30న పదవీవిరమణ చేయనున్న రామకృష్ణారావు
- సిఎం సలహాదారునిగా నియామకం
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఈనెల 30వతేదీతో పదవీవిరమణ చేయనున్నారు. దీంతో ఆయన స్థానంలో కేంద్ర సర్వీసులో పని చేస్తున్న సంజయ్ జాజును నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి రఘు నందన్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సంజయ్ జాజుకు రాష్ట్ర పరిపాలనలో కీలకమైన పరిశ్రమలు, ఐటీ శాఖలతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఇన్వెస్ట్‌మెంట్ సెల్ బాధ్యతలను అప్పగించింది. పరిశ్రమలు,వాణిజ్య శాఖ, ఐటి, ఎలక్ట్రానిక్స్,కమ్యూనికేషన్స్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. ముఖ్యమంత్రి తరువాయి 8లో

## భారీగా ఐఎఎస్‌ల బదిలీ


# డ్రగ్స్ రహితమే లక్ష్యం

- చిన్నారుల భవిష్యత్తే తెలంగాణ రాష్ట్ర ప్రగతి
- డ్రగ్స్ అమ్మకాలు, సరఫరాకు తావుండొద్దు
- ఆరోగ్యవంతమైన యువతను తయారుచేసే క్రమంలో ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- టాలీవుడ్ ప్రముఖులు 'సే నో టు డ్రగ్స్' సందేశాలివ్వాలని సూచన
- మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలి : మంత్రి పొన్నం



ప్రజాపక్షం/హైదరాబాద్/రంగారెడ్డి

"చిన్నారుల భవిష్యత్తే తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు. వారు ఎంతగా వృద్ధిలోకి వస్తే, తెలంగాణ రాష్ట్రం అంతగా అభివృద్ధి చెందుతుంది. డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, అక్రమ మానవ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మహిళా,శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్,రాష్ట్ర రవాణా అండ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్ సివి ఆనంద్,ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణలో ఏ ఒక్కరూ మాదక ద్రవ్యాలకు బానిస కాకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ అమ్మకాలు, సరఫరా అనే మాటలకు తావుండకూడదని తేల్చిచెప్పారు. ఆరోగ్యవంతమైన యువతను తయారుచేసే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని డిప్యూటీ సిఎం తెలిపారు. ఈ నార్కోటిక్స్‌కు వ్యతిరేకంగా ప్రత్యేకంగా 'ఈగిల్ ఫోర్స్' అనే విభాగాన్ని ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. ఈ విభాగం సంపూర్ణంగా పనిచేయడానికి అవసరమైన ఆర్థిక వనరులు, రవాణా వాహనాలు సమకూర్చామన్నారు. ప్రాణాలకు ప్రమాదం ఉన్నప్పటికీ సమాజాన్ని కాపాడేందుకు పనిచేస్తున్న ఈ పోలీస్ ఉద్యోగ వ్యవస్థకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ ఇచ్చే ప్రతిపాదనలను ప్రభుత్వం తక్షణమే ఆమోదించి వారిని ప్రోత్సహిస్తోందని అన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని, వారి ఆశలను, ప్రభుత్వ ఆకాంక్షలను నిజం చేయడం కోసం ప్రతి ఒక్కరు 'సే నో టు డ్రగ్స్' అని గళమెత్తాలని డిప్యూటీ సిఎం పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమాజ శ్రేయస్సే బాధ్యతగా పటిష్టమైన పోలీస్ యంత్రాంగం అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతోందని అన్నారు. పిల్లల భవిష్యత్తుకు ఆటంకం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని, కఠిన నిర్ణయాలు తరువాయి 8లో



## చురుగ్గా నైరుతి

- వారం రోజులు భారీ వర్షాలు
- తెలంగాణ, ఎపి, కేరళ, కర్నాటక, తమిళనాడులో విస్తారంగా వానలు
- ఉరుములు, మెరుపులతో గంటకు 30–50 కి.మీ వేగంతో ఈదురుగాలులు : ఐఎండి

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. జూన్ ప్రారంభంలో కొద్దిరోజులు మందగించిన రుతుపవనాలు తిరిగి వేగం పుంజుకోవడంతో దక్షిణాది రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా తరువాయి 12లో

### ఆజాంజాహీ మిల్లు భూములు

## వేలం వేయొద్దు

- అడ్డుకున్న కార్మికులు
- వేలం ఆపాలని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం
- తీవ్ర ఉద్రిక్తత
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

ప్రజాపక్షం/ఖిలా వరంగల్



వరంగల్‌లోని చారిత్రక ఆజాంజాహీ మిల్లు భూముల వేలం వ్యవహారం శుక్రవారం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ప్రభుత్వం చేపట్టిన భూముల వేలాన్ని అడ్డుకుంటూ మిల్లు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పెద్దయెత్తున నిరసన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ఉన్నప్పటికీ ప్రభుత్వం మొండిగా వేలం నిర్వహించడం అన్యాయమని తరువాయి 12లో

### హతమార్చింది

## ఒక్కడే

- అప్పులు..ఆస్తి ఆశ.. పాత కక్షలు..
- నల్లగొండలో నలుగురి హత్య కేసు ఛేదన

ప్రజాపక్షం/నల్లగొండ

పట్టణాన్ని ఉలిక్కిపడేలా చేసిన తెలంగాణ కాలనీ నాలుగు హత్యల కేసును పోలీసులు కేవలం మూడు రోజుల్లో ఛేదించారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని అత్యంత దారుణంగా హత్య చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. మృతురాలు హసీనా అక్క కూతురు తబస్సుం, ఆమె భర్త సయ్యద్ అస్లాం, అతని స్నేహితుడు తరువాయి 12లో



### వెనెజులాలో వేలాది మంది..

## శిథిలాల కిందే

- సాయం కోసం బాధితుల ఆర్తనాదాలు
- 235కి చేరిన భూకంప మృతుల సంఖ్య
- 4000 మందికిపైగా క్షతగాత్రులు
- వెనెజులాను వణికించిన భారీ భూ ప్రకంపనలు

**లా గుయైరా (వెనెజులా):** వెనెజులాను బుధవారం రాత్రి వరుసగా సంభవించిన రెండు శక్తివంతమైన భూకంపాలు తీవ్ర విషాదంలోకి నెట్టాయి. సహాయక చర్యలు వేగంగా జరుగుతుండగా, అధికారుల ప్రకటనను అనుసరించి, ఇప్పటి వరకూ మృతి చెందిన వారి సంఖ్య 235కి చేరింది. కనీసం 4,300 మంది గాయపడ్డారు. శిథిలాల కింద వేలాది మంది చిక్కుకుపోయారని, దీనితో దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. రాజధాని కారకాస్‌కు ఉత్తరాన ఉన్న తీర ప్రాంతం లా గుయైరా అత్యంత తీవ్రంగా ప్రభావితమైంది. అక్కడ అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. రహదారులు ధ్వంసమయ్యాయి, విమానాశ్రయం దెబ్బతినడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వం పంపిన సహాయక బృందాలు చేరుకునేలోపే స్థానిక ప్రజలు స్వయంగా శిథిలాలను తొలగిస్తూ చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు శ్రమిస్తున్నారు. శిథిలాల నుంచి బయటకు తీసుకొస్తున్న వారిలో చిన్నారులు, వృద్ధులతోపాటు పెంపుడు జంతువులు కూడా ఉన్నారు. ఒక మహిళ కాంక్రీట్ పలక కింద చిక్కుకుని, కేవలం ఆమె కాలు మాత్రమే బయటకు తరువాయి 8లో

# తుంగభద్ర–బృందగానం

కర్ణాటక రాష్ట్రంలో హోస్పేట వద్ద తుంగభద్ర నదిపై 75 సంవత్సరాల క్రితం నిర్మాణమైన కర్ణాటక–ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి ఇరిగేషన్ ప్రాజెక్టు స్పిల్‌వే గేట్ల పునరుద్ధరణ ఉత్సవం సందర్భంగా గురువారం కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ సమక్షంలో చర్చలు ఆ తదుపరి బహిరంగ సభలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వెలిబుచ్చిన అభిప్రాయాలు, ఆ ప్రాజెక్టు నుంచి నీటి వినియోగం విషయంలో ఏర్పడిన చిక్కులను పరిష్కరించగలిగితే తెలంగాణ రైతులకు మేలు జరుగుతుంది. దెబ్బతిన్న తుంగభద్ర 33 గేట్ల స్థానంలో రికార్డు సమయంలో నెలకొల్పిన కొత్త గేట్లు ప్రారంభోత్సవం పురస్కరించుకొని ముగ్గురు ముఖ్యమంత్రులు (డికె శివకుమార్, కర్ణాటక; ఎన్.చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్; రేవంత్ రెడ్డి, తెలంగాణ) కేంద్రమంత్రితో సమావేశమై తుంగభద్ర సమస్యలను చర్చించారు. పూడిక ప్రధాన సమస్య. ఆ కారణంగా ప్రాజెక్టులో నీటి నిల్వ తగ్గింది. పర్యవసానం తెలంగాణ వాటా 15.90 టిఎంసిల నీరు బదులు 5–6 టిఎంసిలే వస్తున్నది. అంతేగాక రాజోలిబండ నీటి మళ్లింపు పథకం వద్ద ఆంధ్ర రైతులు తూములు తెరిచి తెలంగాణకు రావలసిన నీటిని వాడుకుంటున్నారు. పూడికతీతకు నిర్ణయం జరిగినా పనులు నత్తనడకన సాగుతున్నాయి. కృష్ణా నదీ జలాల వినియోగంలో ఆంధ్ర– తెలంగాణ మధ్య ఎడతెగని వివాదంలో ఆర్‌డిఎస్ ఒక ప్రధాన సమస్య. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిగులు జలాల వినియోగానికై ముందుగా బనకచర్ల, ఆ తర్వాత నల్లమల్ల సాగర్ పథకాన్ని ప్రతిపాదించగా, తెలంగాణ ప్రభుత్వం గట్టిగా వ్యతిరేకించటానికి ప్రధాన కారణం కృష్ణాజలాల్లో తెలంగాణ నికరవాటా తేలకపోవటమే. కాబట్టి ఉభయకుశలోపరి మాటలకు, ఆచరణకు మధ్య అగాధం కొనసాగుతున్నది.

ఈ నేపథ్యంలో తుంగభద్ర ఆధునికీకరణపై కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ సమక్షంలో కర్ణాటకలో జరిగిన ముఖ్యమంత్రుల చర్చలు ఆహ్వానించదగినవి. తుంగభద్ర బేసిన్‌లోని రైతుల ప్రయోజనాలు కాపాడుతామని ముగ్గురు మంత్రులు ఏకాభిప్రాయం ప్రకటించారు. తుంగభద్రలో పేరుకుపోయిన పూడిక 33 టిఎంసి అడుగులు ఉంటుందని అంచనా. మేజర్ రిజర్వాయర్లలో పూడిక తీసే కేంద్ర ప్రభుత్వ విస్తృత ప్రణాళికలో భాగంగా ముందుకు తుంగభద్ర రిజర్వాయర్‌లో పూడిక తొలగింపు చేబడతామని పాటిల్ హామీఇవ్వడం శుభసూచకం. ఈ కార్యక్రమం కింద కేంద్రం సాంకేతిక తోడ్పాటు అందిస్తుందని, మూడు రాష్ట్రాల భాగస్వామ్యంతో సాధ్యమైనంత త్వరగా పూడిక తొలగిస్తామని మంత్రి చెప్పారు. పూడిక తొలగిస్తే రిజర్వాయర్‌లో నీటి నిల్వ పెరిగి రాష్ట్రాలకు తమ వాటా నీరు లభించే అవకాశం మెరుగవుతుంది. అప్పుడు కర్ణాటకలో కాల్వల మరమ్మతులు, నిర్వహణ, ఆర్‌డిఎస్ వద్ద కర్నూల్–మహబూబ్‌నగర్ రైతుల ఘర్షణల నివారణపై దృష్టి పెట్టడం సునాయాసమవుతుంది.

ముఖ్యమంత్రుల మధ్య అవగాహనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమీ సాధించకుండానే ఏదో సాధించినట్లు సంబరపడుతున్నారని బిఆర్‌ఎస్ నాయకుడు హరీష్ రావు ఆక్షేపించడంలో అర్థం లేదు. ఇష్టాగోష్టి సమావేశంలోనే సమస్యల పరిష్కారాన్ని ఎవరైనా ఊహించగలరా? అక్కడ వ్యక్తమైన శుభ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లే చిత్తశుద్ధి అవసరం. పొరుగు రాష్ట్రాలతో వివాదాలకు బదులు పరిష్కారాలకు తాను ప్రాధాన్యత ఇస్తానని రేవంత్ రెడ్డి చెప్పారు. తుంగభద్ర జలాల పంపిణీ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ వేస్తామన్న కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తూ తమ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. మూడు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యకు కేంద్రం శాశ్వత పరిష్కారం సాధించగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ఈ సమస్య పరిష్కారంలో ఆరంభ అడుగు మాత్రమే. అదే సమయంలో రాజోలిబండ డైవర్షన్ పథకం ద్వారా తెలంగాణకు రావలసిన 15.9 టిఎంసిల్లో మూడవ వంతు మాత్రమే వస్తుండటాన్ని ముఖ్యమంత్రి కేంద్రమంత్రి దృష్టికి తెచ్చారు. పర్యవసానంగా కరువు జిల్లా పాలమూరులో గద్వాల, అలంపూర్ తదితర ప్రాంతాల రైతులు ఎదుర్కొంటున్న దురవస్థను, వలసలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. బళ్ళారి, అనంతపురం, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల రైతుల ప్రయోజనాల రీత్యా పరిష్కారం కనుగొనేందుకు కలిసి పని చేద్దామని ముగ్గురు ముఖ్యమంత్రులు నిర్ణయించడం సంతోషించదగిన విషయమే అవుతుంది కదా!

అదే సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ, అంతర్రాష్ట్ర నదుల అనుసంధాన పథకంలో భాగంగా గోదావరి–కావేరి నదుల అనుసంధానం అవసరాన్ని వక్కాణించారు. కొన్ని ప్రాంతాల్లో వరదలు, మరికొన్ని ప్రాంతాల్లో దుర్భిక్షం వంటి సమస్యలకు నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ మధ్య కెన్–బెట్వా సంధానం, రాజస్థాన్, మధ్యప్రదేశ్ మధ్య పర్బతి–కాళీసింధి– చంబల్ సంధాన ప్రాజెక్టులు అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. అదేవిధంగా దక్షిణ భారత్‌లో గోదావరి–కావేరి అనుసంధానానికి జాతీయ దృక్పథం పాటించాలన్నారు. రాష్ట్రాల నీటి ప్రయోజనాలు, హక్కులను కాపాడుతూ నదుల సంధానం అమలు చేయడానికి కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. నీటి వివాదాలు తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ మధ్యనే గాక కర్ణాటక–తమిళనాడు–కేరళ మధ్య కూడా ఉన్నాయి. కాబట్టి ఆ వివాదాల పరిష్కారానికి కూడా నదుల అనుసంధాన ప్రక్రియ తోడ్పడుతుంది. అందువల్ల వివాదాలకు బదులు సామరస్యం, ప్రయోజనాల పట్ల పరస్పర అవగాహన, సర్దుబాటు వైఖరి ప్రదర్శిస్తే పరిష్కారాలు అసాధ్యం కాబోవు.



## గుర్తింపునకు ఏ పత్రం చూపాలి?

దశాబ్దాలుగా భారతీయులు పాస్‌పోర్ట్‌ను అత్యంత విశ్వసనీయ ప్రభుత్వ గుర్తింపు పత్రంగా భావిస్తున్నారు. పోలీసు ధ్రువీకరణ, పలు పత్రాల పరిశీలన తర్వాతే పాస్‌పోర్ట్ జారీ చేస్తారు. అలాంటి కఠిన ప్రక్రియ తర్వాత ఇచ్చే పత్రం పౌరసత్వాన్ని నిరూపించదని చెప్పడం చట్టపరమైన వైరుధ్యాన్ని సృష్టిస్తోంది. పాస్‌పోర్ట్ కూడా పౌరసత్వాన్ని నిరూపించకపోతే, మరి ఏ పత్రం చేస్తుంది? ప్రపంచస్థాయి బయోమెట్రిక్ వ్యవస్థతో కూడిన ఆధార్ ఉంది. ప్రభుత్వమే జారీ చేసిన పాస్‌పోర్ట్ కూడా ఉంది. కానీ ఆ రెండింటిలో ఏదీ పౌరసత్వానికి తుది ఆధారం కాదని చెప్పడం వల్ల సాధారణ ప్రజలు పరిపాలనా పరమైన అయోమయంలో పడుతున్నారు.

కాంగ్రెస్ ఎంపి శశి థరూర్

## హెల్త్‌కార్డుల జారీలో స్పష్టమైన ఉత్తర్వులేవి?

లేఖ

మహాశయా!

మెరుగైన వైద్యం కోసం ఉపాధ్యాయులు చకోర పక్షుల్లా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం అందించిన ఉచిత హెల్త్ కార్డులు అలంకారప్రాయంగా మారడంతో కాంగ్రెస్ సర్కారు జారీచేసే హెల్త్ కార్డులపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. కార్డులు అమలులోకి రాకముందే మే నెల వేతనంలో ప్రీమియం మినహాయించడంతో ఉపాధ్యాయ వర్గంలో ప్రభుత్వ వైఖరిపట్ల నిరసన జ్వాలలు ఉవ్వెత్తున్న ఎగిసిపడ్డాయి. అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం అందుతుందా? ఔట్ పేషెంట్‌కు హెల్త్ కార్డుల సౌకర్యం వర్తిస్తుందా? భార్య, భర్తలు ఇరువురు ఉద్యోగస్తులైతే ఒకరి నుండి ప్రీమియం మినహాయింపు అవకాశం ఇవ్వకుండా ఇరువురు నుండి ప్రీమియం మినహాయించడం పట్ల ఉపాధ్యాయులు ప్రభుత్వ వైఖరిపట్ల అసంతృప్తిగా ఉన్నారనేది నిర్వివాదాంశం. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున హెల్త్ కార్డులు ఇస్తానని ప్రకటించిన గౌరవ ముఖ్యమంత్రి. నేటికి హెల్త్ కార్డులు అందించక పోవడం శోచనీయం. ఇటీవలే ప్రభుత్వం హెల్త్ కేర్ టెస్టును ఏర్పాటు చేస్తూ జీవో.40ను విడుదలచేస్తూ టెస్టులో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్య సంఘాలకు చెందిన నాయకులకు చోటివ్వడం ముదావహం. అయితే సి.పి.యస్ ఉద్యోగ సంఘాలకు కూడా ట్రస్టులో అవకాశం కల్పిస్తే బాగుండేది అను అభిప్రాయాలు క్షేత్ర స్థాయిలో వినిపిస్తున్నాయి. వైద్యం అందించే ఆసుపత్రుల జాబితతో కూడిన విధివిధానాలను స్పష్టంగా విడుదల చేయాలని, అలాగే ప్రస్తుతానికి మహిళా ఉపాధ్యాయుల విషయంలో అత్త, మామలను ఆన్‌లైన్ నమోదులో డిపెండెంట్‌లుగా స్వీకరిస్తున్నప్పటికీ దీనిపై కూడా స్పష్టమయిన ఉత్తర్వులు విడుదలచేస్తూ, భార్యాభర్తలు ఇరువురు ఉద్యోగస్తులైతే ఒకరి నుండే ప్రీమియం మినహాయించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇక సిపిఎస్ ఉపాధ్యాయుల విషయానికి వస్తే సర్వీసులో ఉన్నప్పుడు వారి నుండి కూడా నెలవారి ప్రీమియం మినహాయిస్తూ వైద్యం అందిస్తున్న ప్రభుత్వం ఉద్యోగ విరమణ చెందిన తరువాత వైద్యం పరిస్థితి ఏమిటి అన్న ఆందోళనలో వారున్నారు. పెన్షన్ ఎంతొస్తుందో తెలియదు కావున వైద్యం అందించలేమనే ప్రభుత్వం యొక్క దాటవేత ధోరణి సరికాదనే వాదనలు వినిపిస్తున్నాయి. సర్వీసు, ఫ్యామిలీ పెన్షనర్లు వారిపై ఆధారపడే కుటుంబ సభ్యులకు కూడా మెరుగైన వైద్యం అందించాలని పెన్షనర్ల సంఘాలు కూడా కోరుతున్నాయి. సెకండ్ ఇన్నింగ్స్‌లోనే ఆరోగ్య సమస్యలు అధికం కావున ఔట్ పేషెంట్ సౌకర్యాన్ని కూడా అందించాలని వారు కోరుతున్నారు. ప్రస్తుత కాలంలో పెరిగిన వైద్య ఖర్చులను దృష్టిలో ఉంచుకొని గరిష్ట పరిమితి మొత్తాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. మెరుగైన వైద్యం అందితేనే ఉద్యోగులు ఆరోగ్యంగా ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయగలరు. కాలయాపన లేకుండా ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలతో కూడిన ఉత్తర్వులను విడుదల చేయాలి. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి. ఎయిడెడ్ మోడల్ స్కూల్, ఇతర మేనేజ్‌మెంట్‌లలో పని చేసే ఉపాధ్యాయులకు ఈ అవకాశాన్ని కల్పించాలి. ఉద్యోగికి అందే వైద్య మొత్తాన్ని రెండు లక్షలకు కాకుండా మరింత పెంచాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని కోరుతున్నాను.

**– సుధాకర్.ఏ.వి**
**రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు**
**స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)**
**9000674747**

# అమ్మకానికి అక్షరం.. నలిగిపోతున్న నవతరం


భారతదేశ విద్యావ్యవస్థ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా ఒక చీకటి అధ్యాయం లిఖించబడుతోంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది నిరుపేద, మధ్య తరగతి విద్యార్థుల కలలను, రాత్రింబవళ్లు పడిన శ్రమను కాసుల కక్కుర్తికి, అవినీతికి బలిపెడుతున్న తీరు హృదయవిదారకం. మే 3న జరిగిన నీట్ (NEET–UG 20 26) పరీక్షాపత్రాలు లీకైపోవడం, ఆ వివాదం ముదిరి 22 లక్షల మందికి పైగా విద్యార్థులు రాసిన ఈ దేశంలోనే అతిపెద్ద ప్రవేశ పరీక్షను జాతీయ పరీక్షల సంస్థ (NTA) రద్దు చేసి, మళ్లీ 'రీఎగ్జామ్' నిర్వహించాల్సి రావడం మన వ్యవస్థల దిగజారుడుతనానికి పరాకాష్ట. ఒక పరీక్షను పారదర్శకంగా నిర్వహించలేని చేతకానితనం ఇటు ఎన్‌టీఏది, అటు పాలకులది అయితే.. దానికి మూల్యం చెల్లిస్తూ, మానసిక క్షోభను భరించలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటం ఈ దేశ సామూహిక మనస్సాక్షికి తగిలిన పెద్ద గాయం.

ఇంతటి ఘోరకలి దేశంలో జరుగుతుంటే, కేంద్రంలో అధికార పీఠంలో ఉన్న నాయకులు, వారి అనుకూల వర్గాలు దీనిని కేవలం 'ప్రతిపక్షాల రాజకీయ స్టంట్' అని కొట్టిపారేయడం వారి అహంకారానికి, బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. పాలకులారా, ఒక్కసారి గుండె మీద చేయి వేసుకుని ఆలోచించండి! ఒక పరీక్ష కోసం ఏళ్ల తరబడి కంటిమీద కునుకు లేకుండా, తల్లిదండ్రులు తమ రక్తాన్ని, కూడబెట్టిన సొమ్మును కోచింగ్ సెంటర్లకు ధారపోసి చదివిన సగటు విద్యార్థి ఆవేదన మీకు 'స్టంట్' లా కనిపిస్తోందా? కన్నీరు మున్నీరవుతూ జంతర్ మంతర్ వద్ద న్యాయం కోసం పోరాడుతున్న నవతరం నిరసన మీకు రాజకీయ క్రీడలా తోస్తోందా? ఇది ఏ ఒక్క పార్టీకో, సిద్ధాంతానికో సంబంధించిన అంశం కాదు; ఈ దేశ భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత తీవ్రమైన సంక్షోభం.

ఈ అణచివేత, అవహేళనల నుంచే దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని ఒక అపూర్వ డిజిటల్ విప్లవం పుట్టుకొచ్చింది. దేశ అత్యున్నత న్యాయమూర్తి (CJI) దేశ యువతను ఉద్దేశించి 'పరపరాన్నజీవులు' (Parasites), 'బొద్దింకలు' (Cockroaches) అని సంబోధించడం విద్యార్థుల గుండెల్లో తూటాలా పేలింది. హక్కుల కోసం పోరాడే గొంతుకలను చీకటి గదుల్లో దాక్కునే కీటకాలతో పోల్చడాన్ని నిరసిస్తూ, నవతరం ఆ అవమానాన్నే ఒక ఆయుధంగా మార్చుకుంది. తాము నిజంగానే బొద్దింకలమైతే.. వ్యవస్థల్లోని కుళ్లును తుడిచేసే సైన్యమంటూ యువత సోషల్ మీడియా వేదికగా 'కాక్రోచ్ జనతా పార్టీ' (CJP)ని స్థాపించింది. ఇది కేవలం ఒక డిజిటల్ హ్యాష్‌ట్యాగ్ కాదు, అహంకార పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఒక సమాంతర సామాజిక శక్తి.

ఈ అపూర్వ సంఘటనతో ఉలిక్కిపడ్డ కేంద్ర ప్రభుత్వం తన పాత అణచివేత ధోరణినే నమ్ముకుంది. CJP సోషల్ మీడియా ఖాతాలను, గొంతుకలను దేశవ్యాప్తంగా నిషేధిస్తూ ఉక్కుపాదం మోపింది. అయితే, సాంకేతికతను బంధించినంత మాత్రాన అక్షరాల్లోని ఆవేదనను, ఆకలిని ఆపగలరా? సోషల్ మీడియాపై నిషేధాలు విధించగానే ఈ ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి నేరుగా ఢిల్లీ వీధుల్లోకి చేరింది. చలిని, ఎండను లెక్కచేయకుండా వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ ధర్నా వేదికగా ప్రత్యక్ష పోరాటానికి దిగారు. లీకుల మాఫియా అంతం కావాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని వారు చేస్తున్న డిమాండ్లకు ప్రముఖ పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ వంటి లబ్దప్రతిష్టులైన మేధావులు మద్దతుగా నిలవడం ఈ నిరసనలోని నైతిక బలాన్ని చాటుతోంది.

సమాజంలో జరుగుతున్న ఈ అన్యాయాన్ని ఎండగట్టి, విద్యార్థుల పక్షాన నిలబడాల్సిన ఫోర్త్ ఎస్టేట్–మన ప్రధాన స్రవంతి మీడియా (Mainstream Media) – నేడు పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారి, నిస్సిగ్గుగా




ఈ తిరుగుబాటును కించపరుస్తోంది. అర్నాబ్ గోస్వామి లాంటి ప్రముఖ జర్నలిస్టులు సైతం జర్నలిజం విలువలని గంగలో కలిపి, కాక్రోచ్ జనతా పార్టీ (CJP) ఉద్యమాన్ని 'బాట్ అండ్ పెయిడ్ క్యాంపెయిన్' (డబ్బులు ఇచ్చి కొనుక్కున్న ఫాలోవర్లు) అని కొట్టిపారేయడం అత్యంత దారుణం. కానీ సత్యం ఎప్పుడూ దాగదు! సదరు CJP అకౌంట్ యొక్క అసలైన ఇన్‌స్టాగ్రామ్ అనలిటిక్స్ పరిశీలిస్తే, ఆ అకౌంట్‌ను ఫాలో అవుతున్న వారిలో 94.7% మంది స్వచ్ఛమైన భారతదేశ పౌరులే అని తేటతెల్లమైంది. అయినా సరే, అబద్ధాలనే పరమసత్యాలుగా ప్రచారం చేసే అర్నాబ్ లాంటి జర్నలిస్టుల అహంకారం ఇక్కడితో ఆగలేదు. సోషల్ మీడియాలో దాదాపు 22 కోట్ల రీచ్, ఫాలోవర్లను సంపాదిస్తున్న CJP పిలుపు మేరకు నీట్ పేపర్ లీకేజీ ప్రొటెస్ట్‌కు కేవలం 2, 3 వేల మందే వచ్చారంటూ టీవీ స్టూడియోల్లో కూర్చుని వెటకారంగా హేళన చేశారు.

ఇక్కడ దేశ ప్రజలంతా గమనించాల్సిన ఒక ప్రాథమిక సత్యం ఉంది. న్యాయం కోసం, ధర్మం కోసం జరిగే పోరాటంలో నిలబడేది ఎంతమంది అన్నది ముఖ్యం కాదు; అక్కడ నిలబడింది న్యాయమా కాదా అన్నదే ముఖ్యం! ఒక మహోన్నత ఆశయం కోసం జరిగే నిరసనలోకి ఒక్కరు వచ్చినా అది ధర్మమే అవుతుంది కానీ, దానిని లెక్కలతో తక్కువ చేసి చూపడం ఏ రకమైన జర్నలిజం? ఈ రకమైన అబద్ధాల, వక్రీకరణల వార్తల వల్ల ఎవరికి లాభం చేకూరుతోంది? ఖచ్చితంగా విద్యార్థులకు కాదు, వారి భవిష్యత్తును అమ్మేసుకున్న లీకుల మాఫియాకు, వారిని వెనకేసుకొస్తున్న పాలకులకే ఈ మీడియా సంస్థలు లాభం చేకూరుస్తున్నాయి. సత్యం వైపు నిలబడాల్సిన కలం, కాసులకు దాసోహమై పాలకుల భజన చేయడం ప్రజాస్వామ్యానికే ఒక శాపం!

విషాదం ఇక్కడితో ఆగలేదు: పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ సిబిఎస్ఈ (CBSE) 12వ తరగతి మూల్యాంకనంలో జరిగిన అవకతవకలు భయాందోళనలను కలిగిస్తున్నాయి. ఈ ఏడాది ప్రవేశపెట్టిన 'ఆన్‌స్క్రీన్ మార్కింగ్' (OSM) విధానం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడింది. జవాబు పత్రాలు సరిగ్గా స్కాన్ కాకపోవడం, మసకబారిన కాపీలను అప్‌లోడ్ చేయడం, ఒకరి ఓఎంఆర్ షీట్లు మరొకరికి మార్చడం వంటి ఘోర తప్పిదాల వల్ల అర్హులైన విద్యార్థులకు అత్యంత తక్కువ మార్కులు వచ్చాయి. ఈ టెక్నాలజీ టెండర్ ప్రక్రియ వెనుక దాగున్న అవినీతిని జార్ఖండ్‌కు చెందిన ఒక 17 ఏళ్ల విద్యార్థి ఫోరెన్సిక్ విశ్లేషణతో బట్టబయలు చేయడం గమనార్హం. గతంలోనే పలు విద్యాసంస్థల పరీక్షల నిర్వహణలో విఫలమై, బ్లాక్‌లిస్ట్ అంచున ఉన్న 'కోఎమ్ప్ట్ ఎడ్యుటెక్' (Coempt EduTeck) అనే వివాదాస్పద ప్రైవేట్ సంస్థకు నిబంధనలు మార్చి మరీ వందల కోట్ల కాంట్రాక్ట్ కట్టబెట్టడం వెనుక ఉన్న రహస్యమేమిటి?

కేంద్ర ప్రభుత్వం ఈ సత్యాలను అంగీకరించి తప్పులను సరిదిద్దాల్సింది పోయి, కేవలం డిజిటల్ డేటాను ప్రభుత్వ సర్వర్లకు మార్చడం, కంటితుడుపు జరిమానాలు విధించడం వంటి చర్యలతో చేతులు దులుపుకుంటోంది. గతంలో జరిగిన అనేక బోర్డు పేపర్ లీకులు, ప్రస్తుత నీట్, సిబిఎస్ఈ సంక్షోభాలు విద్యాశాఖ పతనానికి ప్రత్యక్షసాక్ష్యాలు. ఒకవైపు లీకుల మాఫియా దేశాన్ని గుల్ల చేస్తుంటే, బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయకపోగా, ప్రశ్నించిన యువతపై సోషల్ మీడియా నిషేధాలు విధించడం ఎంతవరకు న్యాయం? ఈ దేశాన్ని నిర్మించే మేధో సంపత్తిని ఇలా బజారున పడేస్తే రేపు దేశానికి వైద్యులు, శాస్త్రవేత్తలు ఎక్కడి నుంచి వస్తారు?

ఈ లీకుల మాఫియా, వ్యవస్థల వైఫల్యం దేశవ్యాప్తంగా తెచ్చిపెట్టిన మానసిక సంక్షోభం మాటలకు అందనంత భయానకమైనది. ఒక గదికే పరిమితమై, సుదూర స్వప్నాల్ని గుండెల్లో దాచుకుని, పగలు రాత్రి తేడా లేకుండా పుస్తకాలతో కుస్తీ పట్టి... నేడు నిలువునా కుప్పకూలిపోతున్నారు. పట్టుమని ఇరవై ఏళ్లు కూడా నిండని వయసులో, వ్యవస్థలు చేసిన పాపానికి తమను తాము దోషులుగా భావిస్తూ ఆత్మహత్యల్ని ఆశ్రయిస్తున్నారు. ఇది కేవలం పేపర్ లీక్ కాదు, ఈ దేశ భవిష్యత్తు లీక్. కార్పొరేట్ శక్తులకు, అవినీతి కాంట్రాక్టర్లకు విద్యావ్యవస్థను తాకట్టు పెట్టే ఈ దోపిడీ విధానాలు మారాలి. అబద్ధపు ప్రచారాలతో, 'పొలిటికల్ స్టంట్లు' అనే నెపాలతో, గోబెల్స్ తరహా మీడియా ప్రచారాలతో నిజాన్ని సమాధి చేయాలనుకుంటే నవతరం ఊరుకోదు.

ఇకనైనా పాలకపక్షం తన రాజకీయ కళ్లద్దాలను పక్కన పెట్టి, నిగూఢంగా ఉన్న ఈ వ్యవస్థాగత అవినీతిని అంగీకరించాలి. ఈ పెను తిరుగుబాటును 'స్టంట్' అని కొట్టిపారేసే అహంకారాన్ని వీడాలి. అదే సమయంలో, ఈ దేశంలోని ద్వంద్వ ప్రమాణాలను చూస్తుంటే అసహ్యం వేస్తోంది. ఒక నిరుపేద విద్యార్థి ట్రాఫిక్ జామ్ వల్లో, బస్సు దొరకకో కేవలం ఒక్క నిమిషం ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి వస్తే.. నిబంధనల పేరుతో లోపలికి రానివ్వకుండా గేట్లు మూసేసి, వారి కన్నీళ్లను కూడా చూడకుండా కఠినంగా వ్యవహరిస్తారు. ఆ ఒక్క నిమిషం ఆలస్యానికి ఆ విద్యార్థి చదివిన చదువు, పడిన కష్టం, ఒక అమూల్యమైన విద్యా సంవత్సరం నిలువునా బూడిదైపోతుంది. ఒక నిమిషం ఆలస్యాన్ని క్షమించని ఈ నిరంకుశ విద్యావ్యవస్థ.. మరి లక్షలాది మంది జీవితాలను బుగ్గిపాలు చేస్తూ ఇంతటి భారీ పేపర్ లీక్ కుంభకోణానికి పాల్పడితే ఎందుకు నోరు మెదపడం లేదు? ఇంత పెద్ద తప్పు జరిగినా, ఇంత మంది విద్యార్థులు రోడ్లెక్కినా, వ్యవస్థలన్నీ కుప్పకూలుతున్నా ఇంకా ఎందుకు 'సప్పుడు' లేకుండా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారు?

**– దిడ్డి శ్రీకాంత్, జర్నలిస్ట్**
**8686865759**

# అధికారం — ఆస్తి — అవినీతి : అంతర్ సంబంధం

మధ్యప్రదేశ్ రాజకీయాల్లో అప్పుడప్పుడు బయటపడుతున్న వివాదాలు అధికారం–ఆస్తి మధ్య గల సంబంధంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ కుటుంబం, ఆయన దగ్గర బంధువులు, వారికి సంబంధం ఉన్న కంపెనీలు గత రెండు సంవత్సరాల్లో ఉజ్జయినిలో, చుట్టుపక్కల పెద్దఎత్తున భూములు కొనుగోలు చేసినట్లు జాతీయ దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఇటీవల వివరణాత్మకమైన పరిశోధనాత్మక వార్తాకథనం ప్రచురించింది. ఎక్కడైతే రహదారి ప్రాజెక్టులు, కారిడార్లు, బైపాస్‌లు రాబోతున్నాయో, ఎక్కడైతే భూవినియోగం మార్పు చెందుతుందో, లేదా ఇతర అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయో అట్టి ప్రాంతాలలోనే ఈ భూమి కొనుగోళ్లలో చాలాభాగం జరిగిన వాస్తవాన్ని ఆ వార్తాకథనం కళ్లకు కట్టింది. మరోవిధంగా చెప్పాలంటే, ఈ కొనుగోళ్లలో ఒక స్పష్టమైన పద్ధతి కనిపిస్తుంది. ఆ కథనం వెలువడినాక, కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాలు ఈ విషయంలో స్వతంత్ర దర్యాప్తు డిమాండ్ చేశాయి. కాగా బిజెపి స్పందన ముఖ్యమంత్రిని సమర్థించింది. ముఖ్యమంత్రి బంధువులు స్వతంత్రమైన వ్యాపారులు, వారి ప్రైవేటు లావాదేవీలను ముఖ్యమంత్రితో ముడిపెట్టటం సరికాదన్నది వారి వ్యాఖ్య. దాదాపు రెండు దశాబ్దాల క్రితం, శివరాజ్‌సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రి అయినాక డంపర్ వివాదం బయటపడింది. అదీ ఇలాంటిదే. దానిపై జరిగిన వాదోపవాదాల్లో అందులో ఏదైనా తప్పు జరిగినట్లు నిర్ధారణపూర్వకంగా నిరూపణ కాలేదు. అయినా ఆరోపణల తీవ్రత దృష్ట్యా ఆ వివాదం కోర్టులకు చేరింది. దర్యాప్తులు జరిగాయి. అది రాష్ట్రంలో అనేక సంవత్సరాల పాటు రాజకీయ ఆరోపణల్లో వివాదాంశంగా కొనసాగింది.

డాక్టర్ మోహన్ యాదవ్ చాలాకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చురుకుగా ఉన్నారు. ఉజ్జయిని ఆయన సొంత నగరం. రానున్న సింహాస్థ ఉత్సవం దృష్ట్యా అభివృద్ధిపనులు కొనసాగుతున్నాయి. అటువంటి పరిస్థితిలో ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, బంధువులు భూమి కొనుగోలు చేస్తే అందులో ఏదో దగాకోరుతనం ఉందని నిందించటం సబబు కాదు. అయితే అది పద్ధతి ప్రకారం జరుగుతున్నట్లు ఎందుకు కనిపిస్తోంది? భూమి రికార్డులు, మాస్టర్ ప్రణాళిక, రోడ్డు ప్రాజెక్టులు, భూమి కొనుగోలు మధ్య సంబంధాన్ని వార్తాపత్రిక నొక్కిచెప్పినందున దాన్ని రాజకీయ ఆరోపణగా కొట్టివేయలేము. ప్రజాస్వామ్యంలో ఏదో ఒక లావాదేవీ నుంచి ప్రశ్నలు తలెత్తవు. అనేక సంఘటనలో ఒక వరుస ధోరణి కనిపించినపుడు అది అనుమానాలకు తావిస్తుంది. ఉజ్జయిని భూవివాదం అటువంటి పరిస్థితిలో ఒకటిగా కనిపిస్తున్నది.

2028లో జరిగే సింహస్థకు సన్నాహక చర్యలు జరుగుతుండగా, ఉజ్జయినిలోపల, చుట్టుపట్ల భూమికి ప్రాధాన్యత వచ్చే సంవత్సరాల్లో పెరుగుతుంది. రోడ్లు, బైపాస్‌లు , కారిడార్‌లు, నివాస–వాణిజ్య సముదాయాల విస్తరణ గూర్చిన ప్రకటనలు ఏ నగరంలో అయినా భూమి మార్కెట్‌ను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయి. 2028 సింహస్థ కోసం ఉజ్జయినిలో, పరిసరాల్లో వేలకోట్ల రూపాయల మౌలిక వసతుల ప్రాజెక్టులు అమలుచేయబడుతున్నాయి. 2025 మార్చి నాటికి వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా రూ.2329కోట్ల ప్రాజెక్టు అమలులో ఉన్నాయి. వీటికి తోడు రూ.2533 కోట్లతో రెండు నీటి సరఫరా ప్రాజెక్టులు, రూ.329కోట్లతో ఆరు ఇంధన ప్రాజెక్టులు, రూ. 9650 కోట్లతో రెండు వరసల, నాలుగు వరసల రహదారి ప్రాజెక్టులు, రూ.382 కోట్లతో టూరిజం ప్రాజెక్టులు, రూ.259కోట్లతో సాంస్కృతిక ప్రాజెక్టులు ప్రతిపాదించబడ్డాయి, లేదా అమలులో ఉన్నాయి. ఒక మెడిసిటీ, ఒక మెడికల్ కాలేజీ ఈ అభివృద్ధి ప్రాజెక్టులో ఉన్నాయి. సింహస్థ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి రూ.20వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజి కోరింది. అటువంటి పరిస్థితుల్లో, అధికారానికీ వారితో సంబంధం ఉన్న వ్యాపార గ్రూపులకు సన్నిహితంగా ఉన్న కుటుంబాలు అదే ప్రాంతంలో క్రియాశీలంగా కనిపించటం ప్రశ్నలకు తావివ్వటం సహజం. ఒక పరిశోధనాత్మక వార్తాకథనం అభివృద్ధి ప్రాజెక్టులకు, భూమిపై పెట్టుబడులకు మధ్య సంబంధాన్ని స్పష్టంగా వెల్లడించినపుడు , ఆ సమస్య ఇంకెంత మాత్రమూ కేవలం భూముల కొనుగోలుకే పరిమితం కాదు. అది అభివృద్ధి దిశ, భూములపై పెట్టుబడి, ప్రభుత్వ పదవిలోని వారి నైతిక జవాబుదారీతనం సమస్య అవుతుంది. అందువల్ల స్వతంత్ర దర్యాప్తునకై డిమాండ్ అసహేతుకం కాదు. తాము ముఖ్యమంత్రి కులం లేదా సామాజిక నేపథ్యంను ప్రశ్నించటంలేదని, భూమి కొనుగోళ్లు– అభివృద్ధి ప్రాజెక్టుల మధ్య సంబంధాన్ని లేవనెత్తుతున్నామని కాంగ్రెస్ అంటోంది. కాగా బిజెపి దీన్ని వెనుకబడిన తరగతుల నాయకత్వాన్ని అప్రతిష్ట పాల్జేసే ప్రయత్నమంటూ కులాన్ని ముందుకు నెట్టి అవినీతి, బంధుప్రీతి సమస్యను మరుగుపరిచే ప్రయత్నం చేస్తోంది. డాక్టర్ మోహన్ యాదవ్ ముఖ్యమంత్రి అయినాక బయటికొచ్చిన మొదటి ప్రధాన వివాదం ఇది. ప్రతిపక్షాలు జులైలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో దీన్ని పెద్ద సమస్య చేయటం ఖాయం. అందువల్ల పాలక బిజెపి రాజకీయ వాగాడంబరం కట్టిపెట్టి స్వతంత్ర దర్యాప్తు జరిపించటం మంచిది. ఏమీ లేకపోతే అదురుబెదురు అవసరం లేదు.

**– రాజుకుమార్, భోపాల్**

## సూక్ష్మ , చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో

# గ్రామీణ పారిశ్రామికీకరణ

### 'నేడు' ప్రపంచ ఎంఎస్‌ఎంఈ దినోత్సవం



సూక్ష్మ , చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ) ఏ దేశ ఆర్థిక వ్యవస్థకు, దాని సమగ్ర అభివృద్ధికి వెన్నెముక వంటివి. ఇవి స్థానిక, జాతీయ ఆర్థిక వ్యవస్థలకు, ముఖ్యంగా శ్రామిక పేదలు, మహిళలు, యువత, బలహీన వర్గాల వారి సుస్థిర జీవనోపాధులకు దోహదపడతాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మొత్తం వ్యాపారాలలో 90 శాతం, ఉపాధిలో 60 70 శాతం, ప్రపంచ జీడీపీలో 50 శాతం వాటా ఎంఎస్‌ఎంఈల ఆర్థిక వ్యవస్థలను పరివర్తన చెందిస్తున్నాయి, ఉద్యోగ కల్పన, ఆదాయాన్ని ప్రోత్సహించడం, సమానమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ఎంఎస్‌ఎంఈల పాత్రపై అవగాహన పెంచేందుకు, 2017 నుండి ప్రతి ఏటా జూన్ 27వ తేదీని 'ప్రపంచ ఎంఎస్‌ఎంఈల దినోత్సవం'గా ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ప్రకటించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు, స్థానిక ఉపాధి కల్పనకు, గ్రామీణ లేదా వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికీకరణకు ఎంఎస్‌ఎంఈలు మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి. సూక్ష్మ , చిన్న, మధ్యతరహా పరిశ్రమల వర్గీకరణ వాటి ఉత్పత్తి, పెట్టుబడి, వార్షిక టర్నోవర్‌లపై ఆధారపడి ఉంటాయి. సూక్ష్మ లేదా మైక్రో ఎంటర్‌ప్రైజ్/పరిశ్రమ అనగా ఒక కోటి లోపు పెట్టుబడితో 5 కోట్ల లోపు వార్షిక టర్నోవర్ నమోదు చేయబడుతుంది. చిన్న లేదా స్మాల్ ఎంటర్‌ప్రైజ్ విభాగంలో పెట్టుబడి 10 కోట్ల వరకు ఉంటూ వార్షిక టర్నోవర్ 50 కోట్ల వరకు ఉంటుంది. మధ్య తరహా లేదా మీడియం పరిశ్రమలో 50 కోట్ల వరకు పెట్టుబడులు, 250 కోట్ల వరకు వార్షిక టర్నోవర్ ఉంటుంది. ఎంఎస్‌ఎంఈలు ఆవిష్కరణ, ఉద్యోగ కల్పన మరియు సుస్థిర అభివృద్ధికి శక్తివంతమైన చోదక శక్తులుగా ఉపకరిస్తున్నాయి. ఎంఎస్‌ఎంఈలు సాంకేతికత, డిజిటల్ మౌలిక సదుపాయాలు, సరసమైన ఆర్థిక సహాయం, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వాలు, భాగస్వామ్యాలకు ప్రాప్యతను విస్తరించడం ద్వారా సమ్మిళిత వృద్ధిని నడిపిస్తాయి, స్థితిస్థాపకతను బలోపేతం చేస్తాయి మరియు పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయి. డిజిటల్ టెక్నాలజీలు, ఏఐ మరియు గ్రీన్ ఇన్నోవేషన్‌లో వేగవంతమైన పురోగతులు, ఎంఎస్‌ఎంఈలకు ఉత్పాదకతను పెంచుకోవడానికి అపూర్వమైన అవకాశాలను అందిస్తున్నాయి. ప్రపంచ ఎంఎస్‌ఎంఈల దినోత్సవం2026 యొక్క ఇతివృత్తం ఆవిష్కరణ, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ఎంఎస్‌ఎంఈలకు సాధికారత కల్పించడం, ఏఐ ఆధారిత భవిష్యత్తులో మానవకేంద్రీకృత వ్యవస్థాపకత. ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా ఉన్న హ్యూమన్‌సెంటర్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫోరమ్ ఎంఎస్‌ఎంఈల భవిష్యత్ తరం అనే సమాంతర ఇతివృత్తంతో నడుస్తోంది. భారతదేశంలో 7.4 కోట్లకు పైగా ఎంఎస్‌ఎంఈలు ఉన్నాయి, ఇవి 32 కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తూ, జాతీయ జీడీపీకి సుమారు 31.1 శాతం వాటాను అందిస్తున్నాయి. ఈ సంస్థలు మొత్తం ఎగుమతులలో సుమారు 48.6 శాతం వాటాను కూడా అందిస్తున్నాయి.

# నిరాశ్రయులైన విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ అండ

**కూల్చిన చోటనే పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలి**

**ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



**ప్రజాపక్షం/హనుమకొండ :** విద్యార్థుల హక్కులు, సంక్షేమం కోసమే అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) పనిచేస్తోందని, గుండ్లసింగారంలో ఇండ్ల కూల్చివేతతో నిరాశ్రయులైన విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ అండగా ఉంటుందని, కూల్చిన ఇండ్ల చోటనే పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం హనుమకొండ మండలం గుండ్లసింగారంలోని సురవరం సుధాకర్‌రెడ్డినగర్‌లో ఇటీవలి కాలంలో ఇండ్ల కూల్చివేతతో నిరాశ్రయులైనా కుటుంబాల విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు 500 నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్, విద్యావసరాల వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు, అతిథులుగా ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, మాజీ రాష్ట్ర నాయకుడు కర్రె బిక్షపతిలు హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ అధ్యక్షతన జరిగిన సభలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుండ్లసింగారంలో గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలు వేసుకొని నివసిస్తున్న 360మంది పేదల ఇళ్ళను కూల్చివేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వం పేదల గుడిసెలు కూల్చివేసే ముందు సర్వే నిర్వహించాలని, అనర్హులు ఉంటే తొలగించాలని, కానీ ఏమాత్రం సమాచారం లేకుండా ఒక్కసారిగా పేదల గుడిసెలపై బుల్డోజర్‌లతో దాడిచేయడం ప్రభుత్వానికి తగదని అన్నారు. రోజు రోజుకు నగరం విస్తీర్ణం పెరుగుతున్న క్రమంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చి కూలీ, నాలీ చేసుకుని జీవించే వారు ఇండ్లలో కిరాయిలు కట్టలేని పరిస్థితిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుండి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నప్పటికీ ప్రస్తుతం ఈ ప్రభుత్వం పేదలను లక్ష్యంగా చేసుకున్నదని, పేదల జీవించే హక్కును కాలరాస్తున్నదని అన్నారు. సొంత ఇంటి కలను దూరం చేయడమే ఈ ప్రభుత్వానికి సరికాదని అన్నారు.



గుండ్లసింగారంలో నిరాశ్రయులైనా కుటుంబాల విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, విద్యావసరాల వస్తువులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. అదేవిధంగా ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ నిరాశ్రయులైన విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు కర్రె బిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల పట్ల ప్రభుత్వం తీరు సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికల రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొంతుకు ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు వుట్కూరి ప్రణీత్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదళ్ల శరత్, ములుగు జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్, రాష్ట్ర నాయకులు అన్వర్, హరీష్, సిపిఐ హనుమకొండ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కోడపాక బాబు, మామునూరి దామోదర్, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాడికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, నలువాల సంధ్య, బైసా మౌనిక, తాటికంటి మమత, గుంటి రజిత, కాలనీవాసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**కేంద్ర ప్రభుత్వ పురస్కార గ్రహీత ఎద్దుల సూర్యనారాయణరెడ్డికి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి**

# డి.రాజా ఘన సన్మానం



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వ పురస్కారం అందుకున్న అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గ్రామానికి చెందిన స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు, ప్రముఖ సిపిఐ నాయకులు ఎద్దుల సూర్యనారాయణ రెడ్డి గారిని ఢిల్లీలోని ఇంద్రజిత్ గుప్త మార్గ్లో ఉన్న అజయ్ భవన్లో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ, 92 ఏళ్ల వయస్సులో కూడా సూర్యనారాయణ రెడ్డి గారు ఎంతో చురుకుగా ఉండటం ఆనందదాయకమని అన్నారు. సిపిఐ పార్టీకి ఎనలేని సేవలు అందించడంతో పాటు సమాజ సేవలో నిరంతరం పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అందించిన పురస్కారం ఆయన జీవితకాల సేవలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కె. రామకృష్ణ, అఖిల భారత స్వాతంత్ర సమరయోధుల వారసుల సంఘం జాతీయ కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాశ్, గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయభాస్కర్, ఢిల్లీ సామాజిక కార్యకర్త గురుదేవ్ తదితరులు పాల్గొని ఎద్దుల సూర్యనారాయణ రెడ్డి గారికి అభినందనలు తెలియజేశారు.

## కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న ప్రభుత్వం

**మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ప్రభుత్వం అసహనంతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియ సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధంగా ప్రవీణ్ కుమార్‌కు సెక్యూరిటీ తీసేశారన్నారు.

## నదీజలాల సద్వినియోగంలోనూ చొరవ

**చంద్రబాబు, రేవంత్, డికెలకు రామకృష్ణ విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ :** తుంగభద్ర డ్యామ్‌లో కొత్త గేట్ల ప్రారంభోత్సవానికి హాజరైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రదర్శించిన ఐక్యతను కష్ణా, గోదావరి జలాల సద్వినియోగంలోనూ కొనసాగించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే రామకష్ణ సూచించారు. ఏటా కష్ణా, గోదావరి నదుల నుంచి వేల టీఎంసీల నీరు సముద్రంలో వథాగా కలుస్తోందని....మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే సాగునీరు, తాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి జలాల సద్వినియోగానికి సంయుక్త కార్యాచరణ చేపట్టాలని, ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇక కష్ణలంక లాకప్ డెత్ ఘటనపై స్పందించిన రామకష్ణ... ఒక వ్యక్తి పోలీస్ కస్టడీలో మతి చెందడం, అనంతరం కుటుంబ సభ్యులకు మతదేహాన్ని అప్పగించకుండా వ్యవహరించడం అత్యంత ఆందోళనకరమని విమర్శించారు. మతుడి తల్లి పదేపదే కనీసం తన కుమారుడి అస్థికలైనా ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు.

## 2026–27 టీమ్ క్రికెట్ కాలెండర్‌కు బిసిసిఐ ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ క్రికెట్ అభిమానులకు శుభవార్త. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) ప్రతిపాదించిన 2026–27 టీమూ క్రికెట్ కాలెండర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 210 అంతర్‌జిల్లా లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు టిసిఎ ప్రధాన కార్యదర్శి ధారం గురువారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 13 సీనియర్ జిల్లా జట్లతో పాటు మహిళలు, అండర్23, అండర్19, అండర్16 విభాగాల్లోనూ పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ ప్రతిభను వెలికితీయడం, యువ క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ కాలెండర్‌ను రూపొందించినట్లు గురువారెడ్డి తెలిపారు. టీమూ ట్రోఫీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టిపిఎల్) జట్లలో చోటు కల్పిస్తామని వెల్లడించారు. అలాగే టిసిఎ తరఫున ఎంపికైన ప్రతిభావంతులకు బిసిసిఐ నిర్వహించే దేశీయ టోర్నీల్లో పాల్గొనే అవకాశాలు కూడా లభిస్తాయని చెప్పారు. అంపైర్లు, స్కోరర్లు, మ్యాచ్ అధికారులు, గ్రౌండ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు జిల్లాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని టీసీఏ స్పష్టం చేసింది. రాష్ట్రంలో క్రికెట్‌ను గ్రామీణ స్థాయి వరకు విస్తరించి, తెలంగాణను దేశంలో అగ్రశ్రేణి క్రికెట్ కేంద్రంగా తీర్చిదిద్దడమే ఈ కాలెండర్ ప్రధాన ఉద్దేశమని ధర్మ గురువారెడ్డి పేర్కొన్నారు.

## విద్యుత్ భద్రతపై అప్రమత్తతే అగ్నిప్రమాదాల నివారణకు మార్గం

**డిజి విక్రమ్ సింగ్ మాన్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ భద్రత విషయంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, విద్యుత్ నిపుణులు, ప్రజల సమన్వయంతో పనిచేస్తే విద్యుత్ సంబంధిత అగ్ని ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు, సివిల్ డిఫెన్స్ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ అన్నారు.జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలు (జూన్ 26 నుంచి జూలై 2 వరకు) ప్రారంభమైన సందర్భంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా లో ఫైర్ అ్ండ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్, ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో 'ఎలక్ట్రికల్ సేఫ్టీ ఎక్సలెన్స్ – బియా్ండ కంప్లయన్స్' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిజి విక్రమ్ సింగ్ మాన్ ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రూపొందించిన 'సురక్షా టిప్స్ ఆన్ ఎలక్ట్రికల్ సేఫ్టీ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ భద్రతపై నిరంతర అవగాహన, క్రమం తప్పని సేఫ్టీ ఆడిట్లు, భద్రతా ప్రమాణాల కచ్చితమైన అమలు, సురక్షిత విద్యుత్ వినియోగ పద్ధతులను పాటించడం అత్యంత అవసరమని సూచించారు. విద్యుత్ లోపాల వల్ల సంభవించే అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చే జిఒ 9ని వెంటనే రద్దుచేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థులకు చెందిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలను ఒప్పించుకోలేకపోతే ఎలా అని బిఆర్ఎస్ మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చేందుకు ప్రవేశపెట్టిన జిఒ 9ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్ఎ పి .శశిధర్ రెడ్డితో కలిసి జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ కాలపరిమితి సగం ముగిసిపోయిందని, రేవంత్ రెడ్డికి అర్ధ ఆయుష్షు మాత్రమే మిగిలిందన్నారు. దివంగత సిఎం రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమును కెసిఆర్ కొనసాగించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ నిదులను విడుదల చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాతా మూడవ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నప్పటికీ ఒక్క గురుకుల పాఠశాలను కూడా నిర్మించలేదని, 'యంగ్ ఇండియా ఇంటిగ్రేడెట్ స్కూల్స్' పేరుతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బిసి రెసిడెన్షిల్ స్కూల్స్‌ను యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ అని ప్రభుత్వం చెబుతుందని ఆయన చెప్పారు. రేవంత్ రెడ్డి రాజీవ్ గాంధీ పేరును చులకన చేస్తున్నారన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం బడ్జెట్ లో రూ 6 వేల కోట్లను కేటాయించి, రూ 6 లు కూడా ఖర్చు చేయలేదని జీవన్ రెడ్డి ఆరోపించారు.



**అంగన్‌వాడీ టీచర్లను గ్రేడ్- 3, గ్రేడ్ -4**

# ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**డాక్టర్ బి.వి. విజయలక్ష్మి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత 50 సంవత్సరాలుగా ఐసిడిఎస్ పథకంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను గ్రేడ్3, గ్రేడ్4 ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆల్ ఇండియా అంగన్‌వాడీ ఫెడరేషన్ నాయకురాలు డాక్టర్ బి.వి. విజయలక్ష్మి డిమాండ్ చేశారు. 2013లో జరిగిన 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల మేరకు స్కీమ్ వర్కర్లందరికీ కార్మిక హోదా, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర సమితి సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రఅధ్యక్షురాలు ఎన్.సాయీశ్వరీ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.వి.విజయలక్ష్మి హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడం కార్మికులకు నష్టదాయకమైందని విమర్శించారు.



కేంద్ర ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల గౌరవ వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి కరుణకుమారి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు అంగన్‌వాడీ టీచర్లకు రూ.18 వేల గౌరవ వేతనం అమలు చేయలేదని, ప్రస్తుతం రెండు నెలలకు ఒకసారి మాత్రమే వేతనాలు చెల్లించడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. 65 ఏళ్లు పూర్తి చేసి పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఇప్పటికీ రిటైర్మెంట్ ప్రయోజనాలు అందడం లేదని, ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సిబ్బందిని బిఎల్ఒ విధుల నుంచి మినహాయించాలని, రాష్ట్రంలోని ఐసిడిఎస్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర 3వ మహాసభలకు ముందు జిల్లాలు, ప్రాజెక్టు స్థాయిలో మహాసభలు నిర్వహించి, జూలై మొదటి వారంలో భద్రాచలంలో జరిగే పాదయాత్రను, జూలై 26న జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్‌పావని, ఉప ప్రధాన కార్యదర్శి సీతామహాలక్ష్మి, ప్యారీజాన్, చంద్రకళ, పద్మకుమారి, సరస్వతిసరస్వతి, తులసి, దయావతి తదితరులు పాల్గొన్నారు.

# భారీగా ఐఎఎస్ అధికారుల బదిలీలు

**సిఎంఒ నుంచి కీలక శాఖల వరకూ విస్తృత మార్పులు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేస్తూ భారీ ఎత్తున ఐఎఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లను ప్రభుత్వం చేపట్టింది. కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకంతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం, రెవెన్యూ, పరిశ్రమలు, అటవీ, పర్యాటకం, హ్యాండ్లూమ్స్, విపత్తు నిర్వహణ, మున్సిపల్ పరిపాలన వంటి కీలక శాఖల్లో అధికారుల మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మేరకు పలువురు ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి క.రామకృష్ణా రావు శుక్రవారం ఉత్తర్వులు (జిఓఆర్‌టి నెం.914) జారీ చేశారు.

**బదిలీలు, పోస్టింగ్‌ల వివరాలు :** ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఐఎఎస్ అధికారి ఎన్.శ్రీధర్ నియమితులయ్యారు. ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న బి.అజిత్ రెడ్డిని 'ఇన్వెస్ట్ తెలంగాణ' చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించారు. ఎండోమెంట్స్ శాఖ నుంచి పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను బదిలీ చేశారు. జిఎడి (పొలిటికల్)శాఖ ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్‌ను నియమించడంతో పాటు ఆయనకు మైనారిటీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండి క్రాఫ్ట్స్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, టిజి హ్యాండి క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విసి అండ్ ఎండి టిజిసిఒ ఎండి తదితర అదనపు బాధ్యతలు సబ్యసాచి ఘోష్‌కు ఇచ్చారు. సెలవు నుంచి తిరిగి వచ్చిన రాహుల్ బొజ్జాను విపత్తు నిర్వహణ శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో పాటు బిసి సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు కొనసాగించారు. గనులు, భూగర్భ శాఖ కార్యదర్శిగా ఎం.రఘునందన్ రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. టిజిఆర్ఈడిసిఓ వైస్ చైర్మన్, ఎండిగా ఎం.డి. ముషారఫ్ అలీ ఫారూఖీకి అదనపు బాధ్యతలు ఇచ్చారు. హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్, హ్యాండిక్రాఫ్ట్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పి. కాత్యాయనీ దేవిని బదిలీ చేశారు. రోడ్లు,భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా కె.గంగాధర్‌ను, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా టి. వెంకన్నను నియమించారు. సిఎస్ కార్యాలయంలో ఓఎస్‌డిగా పనిచేస్తున్న కె. విద్యాసాగర్‌ను టూరిజం డైరెక్టర్‌గా నియమించి, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. హెచ్ఎండిఎ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ (కోర్ అర్బన్ రీజియన్, ల్యాండ్ పూలింగ్, మెట్రో రైల్)గా కె.చంద్రకళకు అదనపు బాధ్యతలు అప్పగించారు.



## తుంగభద్ర జలాలపై సిఎం స్పష్టత ఇవ్వాలి

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రయోజనాలపై సిఎం ఏం చర్చించారో ప్రజలకు వెల్లడించాలన్నారు. కర్ణాటకలో ప్రతిపాదించిన నవేలి రిజర్వాయర్, ఆంధ్రప్రదేశ్‌లోని గుండ్రేవల ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు రావాల్సిన 15.9 టిఎంసిల నీటి వాటా దెబ్బతిని, కేవలం 5 టిఎంసిలకే పరిమితమయ్యే ప్రమాదం ఉందన్నారు. గతంలో కృష్ణా, గోదావరి బేసిన్‌ల విషయంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశాయని విమర్శించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు తెలంగాణలో విస్తృతంగా పర్యటించనున్నట్లు రాంచందర్ రావు తెలిపారు. ఈ పర్యటన పూర్తిగా పార్టీ సంస్థాగత బలోపేతానికేనన్నారు. పాస్‌పోర్ట్ పౌరసత్వానికి తుది ఆధారం కాదు ఎన్ఆర్‌సి, సిఎఎ అంశాలపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని రాంచందర్ రావు అన్నారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.వీరేందర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు వాసుదేవరావు, ఎన్.వి.సుభాష్, తాడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బాల్క సుమన్ రాష్ట్రానికి ప్రమాదకరంగా మారారు: బోయ నగేష్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ నేత బాల్క సుమన్ రాష్ట్రానికి, దేశానికి ప్రమాదకరంగా మారారని బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్ తీవ్ర విమర్శలు చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారంం ర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్క సుమన్ మాదకద్రవ్యాల మత్తులో ఉన్నట్లు మాట్లాడుతున్నారని అన్నారు. తెలంగాణ శాంతి, సుభిక్షాలకు విఘాతం కలిగించేలా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా బాల్క సుమన్‌లో ఎలాంటి మార్పు రాలేదని, రెచ్చగొట్టే ప్రసంగాలను కొనసాగిస్తున్నారని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు కొనసాగిస్తే ఆయన సొంత నియోజకవర్గ ప్రజలే బహిష్కరిస్తారని, మరో పదేళ్ల పాటు ఇంటికే పరిమితమయ్యే పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. మంచి పాలన అందించి ఉంటే చెన్నూరు ప్రజలు ఎందుకు ఓడించారని ప్రశ్నించారు. ఓయు విద్యార్థులను గతంలో కెసిఆర్, కెటిఆర్ ఎప్పుడైనా కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారా అని నిలదీశారు.

**అంగన్‌వాడీ నియామకాలపై ..**

# బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం

**ఇందిరాశోభన్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంగన్‌వాడీ నియామకాలలో ఇంటర్వ్యూల విధానంపై బిఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, నియామక ప్రక్రియను అడ్డుకోవాలనే రాజకీయ కుట్రలో భాగంగానే అసత్య ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్ మండిపడ్డారు. మంత్రి సీతక్కపై వ్యక్తిగత విమర్శలు, తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఆమె ఘాటు హెచ్చరిక చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఇందిరాశోభన్.. అంగన్‌వాడీ ఉద్యోగం కేవలం ఉపాధి కాదని, చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమంతో ముడిపడిన బాధ్యతాయుతమైన సేవ అని అన్నారు. అభ్యర్థుల వ్యక్తిత్వం, పిల్లల పట్ల సున్నితత్వం, వ్యవహారశైలిని అంచనా వేయడానికే జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంటర్వ్యూల ఆధారంగానే నియామకాలు జరుగుతాయన్న బీఆర్ఎస్ ప్రచారం అవాస్తవమని స్పష్టం చేసిన ఆమె, మొత్తం మార్కుల్లో 90 శాతం విద్యార్హతలు, ఇతర అర్హతల ఆధారంగా, కేవలం 10 శాతం మాత్రమే ఇంటర్వ్యూల ద్వారా కేటాయిస్తారని వివరించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ పూర్తిగా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తుందని తెలిపారు. అభ్యర్థుల ప్రతిభను గుర్తించే ప్రయత్నాన్ని కూడా బిఆర్ఎస్ వ్యతిరేకించడం వెనుక నియామకాలు జరగకుండా అడ్డుకోవాలనే ఉద్దేశమే ఉందని ఇందిరాశోభన్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో నోటిఫికేషన్లు ఇచ్చి, అనంతరం సాంకేతిక సమస్యలు, కోర్టు కేసులతో వాటిని రద్దు చేసిన చరిత్రను ప్రజలు మర్చిపోలేదని విమర్శించారు. అర్హత ఉన్న ప్రతి అభ్యర్థికి పక్షపాతం లేకుండా అవకాశం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన సేవలు అందించేందుకు సమర్థులైన అభ్యర్థులను మాత్రమే పారదర్శకంగా ఎంపిక చేస్తామని ఆమె స్పష్టం చేశారు. నిరుద్యోగుల ఉపాధి అవకాశాలను అడ్డుకునే రాజకీయాలు బిఆర్ఎస్ మానుకోవాలని, లేకపోతే ప్రజలు మరోసారి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# పంచాయతీరాజ్‌లో డ్యాష్‌బోర్డు,పిఎంయు ఏర్పాటు

**మంత్రి సీతక్క ఆదేశాలతో కీలక నిర్ణయం**

**సర్క్యులర్ జారీ చేసిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్**

**గ్రామం యూనిట్‌గా అభివృద్ధి ప్రణాళికలు**

**ప్రతి జిపికి ప్రత్యేక బుక్‌లెట్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రత్యేక డ్యాష్‌బోర్డుతో పాటు ప్రోగ్రామ్ మానిటరింగ్ యూనిట్ (పిఎంయు)ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.దానకిషోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న డ్యాష్‌బోర్డు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతున్న ప్రతి పథకం పురోగతిని జిల్లా, మండలం, గ్రామపంచాయతీ స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. ఏ ప్రాంతంలో పనులు మందగించినా వెంటనే గుర్తించి సంబంధిత అధికారులతో చర్యలు చేపట్టేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు. ప్రోగ్రామ్ మానిటరింగ్ యూనిట్‌లో ఐటీ, డేటా విశ్లేషణ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందం పనిచేయనుంది. ఈ బృందం ప్రతిరోజూ పథకాల అమలును సమీక్షించి, అవసరమైన సమాచారాన్ని అధికారులకు అందించనుంది.

దీంతో ప్రభుత్వ కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం పెరగడంతో పాటు సమస్యల పరిష్కారం వేగవంతమై ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని అధికారులు చెప్పారు. అదేవిధంగా గ్రామసభల్లో ప్రజలు లేవనెత్తిన సమస్యల పరిష్కారం, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలును రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది. ఇక గ్రామాన్ని అభివృద్ధి యూనిట్‌గా తీసుకుని ప్రణాళికాబద్ధ అభివృద్ధికి ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక బుక్‌లెట్ రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. గ్రామాల్లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, ప్రజలకు అందుతున్న సేవల వివరాలను సమగ్రంగా ఒకేచోట పొందుపరిచేలా ఈ బుక్‌లెట్‌ను రూపొందించనున్నారు. బుక్‌లెట్ రూపకల్పన, శిక్షణ కార్యక్రమాలు, ఐటీ వ్యవస్థ అభివృద్ధి కోసం రాష్ట్ర స్థాయిలో సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు.

అలాగే ఫార్మాట్ ప్రిపరేషన్ కమిటీ, ట్రైనింగ్ కమిటీ, ఐటీ కమిటీలను కూడా నియమించారు. అన్ని శాఖల సమన్వయంతో బుక్‌లెట్ ముసాయిదాను సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదానికి సమర్పించాలని సంబంధిత అధికారులను దానకిషోర్ ఆదేశించారు.

# జగిత్యాలలో ఇందిరమ్మ గృహ విప్లవం

**10,860 ఇళ్ల మంజూరు**
**కోరుట్లలో అత్యధిక గృహ ప్రవేశాలు, జగిత్యాలలో అత్యధిక ఇళ్ల మంజూరు**





**ప్రజాపక్షం/జగిత్యాల:** జిల్లా లోని పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించి, వారు ఆత్మ గౌరవము తో జీవించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం జగిత్యాల జిల్లాలో గృహ విప్లవానికి నాంది పలుకుతోంది. గుడిసెలు, అద్దె ఇళ్లు, శిథిలావస్థలో ఉన్న నివాసాల్లో జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత గృహ భద్రత కల్పించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం జిల్లాలో ఆశాజనక ఫలితాలను అందిస్తోంది. వేలాది కుటుంబాల సొంతింటి కలను నిజం చేస్తూ ఇందిరమ్మ ఇండ్లు పేదల జీవితాల్లో కొత్త ఆశలను నింపుతున్నాయి.జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మొత్తం 10,860 ఇళ్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జిల్లాలో గృహ అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. మంజూరైన ఇళ్లలో ఇప్పటికే 9,020 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మరో 1,840 ఇళ్లను త్వరలోనే గ్రౌండింగ్ చేసి నిర్మాణాలు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోంది.జిల్లాలో ప్రస్తుతం 7,885 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో కొనసాగుతున్నాయి. వీటిలో 1,311 ఇళ్లు బేస్‌మెంట్ దశలో ఉండగా, 820 ఇళ్లలో గోడల నిర్మాణం పూర్తయింది. 4,186 ఇళ్లలో ఆర్‌సిసి స్లాబ్ పనులు పూర్తయ్యాయి. మరో 1,568 ఇళ్లు నిర్మాణపరంగా పూర్తయ్యాయి. ప్రతి గ్రామంలో నిర్మాణాలు వేగంగా కొనసాగుతుండగా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు.ధర్మపురి నియోజకవర్గంలో మొత్తం 2,756 ఇళ్లకు మంజూరు లభించింది. వీటిలో 2,464 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 354 ఇళ్లు బేస్‌మెంట్ దశలో ఉండగా, 214 ఇళ్లు రూఫ్ లెవెల్ దశలో ఉన్నాయి. 1,214 ఇళ్లలో ఆర్‌సీసీ స్లాబ్ పనులు పూర్తయ్యాయి. 442 ఇళ్లు నిర్మాణపరంగా పూర్తయ్యాయి. మొత్తం 2,224 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికే 748 కుటుంబాలు గృహ ప్రవేశాలు నిర్వహించాయి. నియోజకవర్గంలో మరిన్ని కుటుంబాలు త్వరలోనే సొంతింటి కలను సాకారం చేసుకునే దిశగా ముందుకు సాగుతున్నాయి.జిల్లాలోనే అత్యధికంగా జగిత్యాల నియోజకవర్గంలో 3,494 ఇళ్లకు మంజూరు లభించింది. వీటిలో 2,705 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 480 ఇళ్లు బేస్‌మెంట్ దశలో, 332 ఇళ్లు రూఫ్ లెవెల్ దశలో ఉన్నాయి. 1,238 ఇళ్లలో ఆర్‌సిసి స్లాబ్ పూర్తికా గా, 289 ఇళ్లు నిర్మాణపరంగా పూర్తయ్యాయి. మొత్తం 2,339 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికే 489 కుటుంబాలు గృహ ప్రవేశాలు నిర్వహించాయి. జిల్లా కేంద్రం కావడంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారు. కోరుట్ల నియోజకవర్గంలో 3,204 ఇళ్లకు మంజూరు లభించింది. వీటిలో 2,538 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 361 ఇళ్లు బేస్‌మెంట్ దశలో, 209 ఇళ్లు రూఫ్ లెవెల్ దశలో ఉన్నాయి. 1,097 ఇళ్లలో ఆర్‌సిసి స్లాబ్ పనులు పూర్తయ్యాయి. 481 ఇళ్లు నిర్మాణపరంగా పూర్తయ్యాయి. మొత్తం 2,148 ఇళ్లు నిర్మాణ పురోగతిలో ఉన్నాయి. ఇప్పటికే 755 గృహ ప్రవేశాలు నిర్వహించడం ద్వారా జిల్లాలోనే గృహ ప్రవేశాల సం ఖ్యలో కోరుట్ల అగ్రస్థానంలో నిలిచింది.సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు భరోసా కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి కొత్త దిశను చూపిస్తోంది.

### గృహ విప్లవానికి జగిత్యాల చిరునామా

జిల్లాలో ఇప్పటికే 2,512 గృహ ప్రవేశాలు నిర్వహించగా, 7,885 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో కొనసాగుతున్నాయి. 10,860 ఇళ్ల మంజూరు, 9,020 ఇళ్ల గ్రౌండింగ్, వేలాది కుటుంబాలకు కల్పిస్తున్న గృహ భద్రత జగిత్యాల జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం విజయవంతమైన అమలుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పేద ప్రజల జీవితాల్లో సుస్థిరమైన మార్పుకు మార్గం సుగమం చేస్తూ, సొంతింటి కలను సాకారం చేస్తూ, జగిత్యాల జిల్లా రాష్ట్రంలో గృహ విప్లవానికి జగిత్యాల జిల్లా ఆదర్శంగా నిలుస్తోంది.

### పేదల సొంత ఇంటి కలను నిజం చేయడమే లక్ష్యం :

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్..జగిత్యాల జిల్లాలో పేదల సొంత ఇంటి కలను సహకారం చేసే విధంగా ముందుకు వెళుతున్నాము..జిల్లాలో ఇప్పటికే 10 వేలకు పైగా ఇళ్లను మంజూరు చేయడం జరిగింది. 9 వేలకు పైగా లబ్ధిదారులు నూతన గృహ ప్రవేశాలు చేశారు. అధికారులు ప్రత్యేక పర్యవేక్షణలో మరిన్ని నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు చేబడుతున్నాం.

## యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండల వ్యాప్తంగా అక్రమంగా జరుగుతున్న ఇసుక రవాణా సంబంధిత అధికారులకు వరంగా మారితే ఇసుక మాఫియాకు మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా మారింది.నిత్యం పదుల సంఖ్యలో వందలాది ట్రిప్పుల ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా తరలి వెళ్తున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. అంతేకాకుండా గోదావరి తీర ప్రాంత గ్రామాల్లో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను డంపులుగా పోస్తున్నారు.ఇలా కుప్పలుగా పోసిన ఇసుకను భారీ వాహనాలైన లారీలలో నిజామాబాద్ నిర్మల్ ఆర్మూర్ వంటి పట్టణాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నియంత్రించాల్సిన అధికారులే పట్టింపు లేనట్లే ఉండడంతో వీరి దందాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. మండల వ్యాప్తంగా నడుస్తున్న ఇసుక అక్రమ రవాణాకు అందుతున్న ముడుపులే ప్రధాన కారణం అయి ఉండొచ్చని ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు చేస్తున్న వ్యక్తులు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు.

## జులై 4 లోపు 'రైతు భరోసా' దరఖాస్తులు : ఎఒ



**ప్రజాపక్షం / పెగడపల్లి :** రైతుభరోసా పథకానికి సంబంధించి పెగడపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ ఏడాది జూన్ 15 తేదీ నాటికి కొత్తగా పట్టాదార్ పాస్‌బుక్ పొందిన రైతులందరూ ఈ పథకానికి అర్హులుగా పరిగణించబడతారని ఆయన స్పష్టం చేశారు.అర్హత కలిగిన రైతులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.దరఖాస్తుతో పాటు కావలసిన పత్రాలు కొత్త పట్టాదార్ పాస్‌బుక్,ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా (పాస్‌బుక్) జిరాక్స్ ప్రతులను జూలై 4 లోపు తమ పరిధిలోని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఎఇఒ) లకు స్వయంగా సమర్పించాలని ఏవో కోరారు.గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులు స్వీకరించబడవు కాబట్టి రైతులు గడువులోపు సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు



**ప్రజాపక్షం / హుస్నాబాద్:** ఈ నెల 25 నుండి ప్రారంభమైన ఎస్ ఐ ఆర్ ఓటరు నమోదు ప్రక్రియ వచ్చే నెల 25 వరకు కొనసాగుతుందని ఓటు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును మీ వద్దకు వచ్చె ఆధికారుల దగ్గర మీ ఓటు సరిగా ఉందో లేదో చూసుకొవాలని ఆలాగే 18 ఏళ్లు నిండిన ప్రతి యువతి యువకులు తమ ఓటును నమోదు చేసేకొవాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య పట్టణ ప్రజలకు కొరారు. శుక్రవారం పట్టణంలోని 11 వార్డులో వార్డు కౌన్సిలరు పూదరి వరప్రసాదు ఆధ్యక్షతన జరిగిన ఓటరు ఎస్ ఐ ఆర్ ప్రక్రీయ కార్యక్రమంలో ఆమె పాల్గోని మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ ఓటరు నమోదులో భాగంగా నేడు వార్డుల్లో కి వచ్చె అధికారులకు సహకరించి వారికి మీ వివరాలు ఇవ్వాలని సూచించారు. మీ ఇచ్చిన వివరాలు సరిగా ఉన్నయో లేయో చూసుకుని మీ ఓటును కాపాడుకొవాలని ఆన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిత్తారి పద్మరవిందర్, పట్టణ కాంగ్రెస్ ఆధ్యక్షుడు వి వి రమణ, మండల ఆధ్యక్షుడు వెన్నరాజు, కౌన్సిలర్లు పల్లి తిరుపతి, రమేశ్, స్వరూప, రేణుక, బత్తుల స్వరూప, తో పాటు వార్డు ప్రజలు పాల్గోన్నారు.

## చినుకు పడితే రహదారి చిత్తడే!



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మెట్పల్లి ఖానాపూర్ వెళ్లే మార్గమధ్యలోని మొగిలిపేట గ్రామంలో ప్రధాన రహదారి పూర్తిగా గుంతల మయం అవ్వడంతో అటుగా ప్రయాణించే వాహన చోదకులకు ప్రయాణం పెను భారంగా మారింది. గ్రామం నడి ఒడ్డున పెద్ద మొత్తంలో రహదారిపై గుంతలు ఏర్పడడంతో చినుకు పడితే గుంతలలో నీరు నిలిచి ఉండడంతో ప్రయాణికులు వాహన చోదకులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో గత రెండు, మూడు సంవత్సరాలుగా ఇదే గుంతల రోడ్డుపై ప్రయత్నిస్తూ నానా అవస్థలు పడుతున్నారు వాహన చోదకులు. నిత్యం వందలాది భారీ వాహనాలు నడిచే రహదారి పరిస్థితి ఇలా ఉంటే గ్రామాలలో లింకు రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో మరి.

## చిన్నగుండవెల్లిలో హరినామ క్షేత్రం నిర్మాణానికి సన్నాహాలు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** శ్రీవెంకటేశ్వరస్వామి మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి గ్రామంలో ఏడెకరాల విస్తీర్ణంలో తిరుమల వెంకటేశ్వరుని హరినామ క్షేత్రాన్ని నిర్మిస్తున్నట్లు టిటిడి మాజీఇఒ కెవి రమణాచారి తెలిపారు. జూలైన 2న శ్రీదేవనాథ్ చిన్న జీయర్‌స్వామి పర్యావేక్షణ, మంగళశాసనాలతో తిరుమల శ్రీవైష్ణవులతో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ప్రెస్‌క్లబ్‌లో నిర్వాహకులు పుల్లగుర్ల సాయిరెడ్డితో కలసి మీడియాతో మాట్లాడారు. కలియుగంలో హరినామ స్మరణతో ఎంతో ముఖ్యమైందన్నారు. అయా భక్త బృందాలతో 24 గంటలు నిరంతరాయంగా హరినామ స్మరణ జరుగాలని వెంకటేశ్వడికి అభిమతానికి అనుగుణంగా మా ప్రయత్నం ఉంటుందన్నారు. ఆసక్తి గల భ క్తులు ఈ మహాత్మర్యంలో భాగస్వాములు ఆశీస్సులు అందించాలని కోరారు.

## ధాన్యం నిల్వలపై ఉన్నతాధికారులతో దర్యాప్తు

**మల్కపేట ఐకెపి కేంద్రం నిర్వహణపై విచారణ జరపాల్సిందే: వేములవాడలో బిఆర్‌ఎస్ నేతల డిమాండ్**



**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మరియు మల్కపేట ఐకెపి సెంటర్ నిర్వహణపై ప్రతిపక్ష బిఆర్‌ఎస్ నాయకులు పలు కీలక అంశాలను లేవనెత్తారు. వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో కోనరావుపేట, వేములవాడ, రుద్రంగి మండలాలకు చెందిన బిఆర్‌ఎస్ ముఖ్య నాయకులు ఒక సంయుక్త విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరిగిన ధాన్యం కొనుగోళ్లలో రూ.91 లక్షలు మాత్రమే కాకుండా, దాదాపు రూ.3 నుంచి రూ.4 కోట్ల మేర వ్యత్యాసాలు మరియు అక్రమాలు జరిగాయని, దీనిపై నిష్పాక్షికమైన విచారణ జరగాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. మల్కపేట గ్రామంలోని ఐకెపి సెంటర్ పరిధిలో ధాన్యం బస్తాల రవాణా, నిల్వల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని నాయకులు పేర్కొన్నారు. రాత్రి సమయాల్లో ధాన్యం బస్తాల తరలింపునకు సంబంధించిన అంశాలను, ట్రక్ షీట్ల నిర్వహణలో జరిగిన లోపాలను వారు ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఐకెపి సెంటర్ పరిధిలో తలెత్తిన ఈ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పరిష్కరించే ప్రయత్నం చేయాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో చోటు చేసుకున్న పరిణామాలు అనుమానాలకు తావిస్తున్నాయని వివరించారు. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించిన కొన్ని దృశ్యాలు (వీడియోలు) కూడా బయటకు వచ్చాయని వారు తెలిపారు. కొనుగోలు కేంద్రాల బాధ్యతల్లో ఉన్న వ్యక్తులకు అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలతో ఉన్న సంబంధాల వల్లే ఇలాంటి లోపాలు జరుగుతున్నాయని, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారని విమర్శించారు. ఈ ధాన్యం కొనుగోళ్ల వివాదాన్ని పక్కదారి పట్టించేందుకు, స్థానిక ప్రజాప్రతినిధులపై ,చల్మెడ లక్ష్మీ నరసింహారావుపై కొందరు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని, వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని హితవు పలికారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నష్టం కలగకుండా పారదర్శకంగా పనులు జరగాలని, ఎక్కడైనా అక్రమాలు జరిగితే వాటిని దాచకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వ్యవహారంలో ఉన్న నిజానిజాలను నిరూపించుకోవడానికి,రైతాంగానికి నమ్మకం కలిగించడానికి ప్రభుత్వం తక్షణమే ఒక ఉన్నత స్థాయి కమిటీతో పూర్తిస్థాయి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి చంద్రయ్య గౌడ్, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, రుద్రంగి నాయకులు చెప్యాల గణేష్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, రుద్రంగి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం, కొనరావుపేట మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు పట్టణ మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, మారం కుమార్, మరియు పార్టీ ముఖ్య నాయకులు అంజద్ పాషా, సుంకపాక రాజు, సందీప్, కనకయ్య, పబ్బ మహేష్, ప్రేమ్ చారి, సంజీవ్, ఉప్పులుటి గణేష్ తదితర కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## పెద్దపల్లిలో పల్స్ పోలియో



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** పెద్దపల్లి జిల్లా లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి,కార్యక్రమాన్ని విజయవంతం చేయాల ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 28న బూత్ డే నిర్వహిస్తున్నట్లు,ఆ తర్వాత 29, 30 తేదీలలో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు జిల్లా వ్యాప్తంగా 62,902 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, పోలియో చుక్కల పంపిణీ కోసం జిల్లాలో 381 బూత్‌లు,25 మొబైల్ టీమ్స్, 24 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు,అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆశా వర్కర్లు,పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి చిన్న పిల్లల వివరాలను సేకరించాలని, ముఖ్యంగా వలస కూలీలు,ఇటుక బట్టీలు, నిర్మాణ రంగంలో పనిచేసే వారి పిల్లలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండే అవకాశం ఉన్నందున, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్ల వంటి రద్దీ ప్రదేశాలలో ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రయాణికులకు కూడా సేవలందించాలని, ఈ ప్రక్రియలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారుల సమన్వయం తప్పనిసరి అని, ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదని,అధికారులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన జువ్వాడి



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని 6వ వార్డులో షేక్ మొహరా బేగం సదుల్లా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు.పేదల గృహ నిర్మాణానికి ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించడం గతంలో ఏ ప్రభుత్వం చేయలేదని పేర్కొన్నారు.సొంత స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ సహాయంతో తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కౌన్సిలర్లు బత్తుల నరేష్,గుడికందుల అజయ్, మాసుల ప్రవీణ్,ఆర్యవైశ్య సంఘం మెట్పల్లి పట్టణ అధ్యక్షుడు మైలారపు రాంబాబు,కాలనీ వాసులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య



**ప్రజాపక్షం/కొండపాక :** భూ వివాదంలో వేధింపులు తాళలేక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాక మండలం దుద్దెడలో శుక్రవారం చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు మృతుడు రాసిన సూసైడ్ నోట్ భార్య సంధ్యారాణి ఫిర్యాదు, స్థానికులు అందించిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. దుద్దెడ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ప్రస్తుత వార్డు సభ్యుడు గుండెల్లి ఆంజనేయులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. గత కొన్ని రోజుల నుంచి గ్రామంలో విక్రయించిన భూమి విషయంలో వివాదం త లెత్తింది. ఇటీవల ఆయనతోపాటు ప లువురు కలిసి అమ్మిన భూమి విషయం లో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఈనెల ఆరున 9 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ క్ర మంలో ఇంటికి వచ్చిన ఆంజనేయులు శుక్రవారం ఉదయం తన వద్ద ఉన్న ఫోన్లను ఇంటి వద్దనే ఉంచి మోటార్ సై కిల్‌పై వెళ్లిపోయాడు. భార్య , కూతురు చూసేసరికి ఆంజనేయులు కనపడకపోవడంతో ఆందోళన గుర్రై తెలిసిన వారిని అడిగారు. కొద్దిసేపటికి ఆంజనేయులు తన ఫామ్ హౌస్ లో ఫ్యాన్ కు ఉరి వేసుకుని చనిపోయాడని సమాచారం అందింది. దాంతో భార్య సంధ్యారాణి కూతు రు ప్రసన్న లక్ష్మి కుటుంబ సభ్యులంతా వెళ్లి చేసేసరికి అప్పటికే చనిపోయాడు. అక్కడ ఉన్న పై సూసైడ్ నోటు రాసినట్టు భార్య సంధ్యారాణి ఫిర్యాదులో పేర్కొం ది. సంఘటన స్థలానికి త్రీటౌన్ పోలీసు లు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆంజనేయులు మృతితో గ్రామంలో విషాదం ఏర్పడింది. పెద్ద ఎ త్తున 3 టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలి వె ళ్లారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు 3 టౌన్ పోలీసులు తెలిపారు.

**వేధింపులే తన భర్త చావుకు కారణం**

భూ వివాదంలో తన భర్తను ఉద్దేశపూర్వకంగా నేరస్తుడిని చేసి వేధింపులకు గురిచేశారని ఆంజనేయులు భార్య సంధ్యారాణి తన ఫిర్యాదులో పేర్కొంది. భూ సమస్య విషయంలో కొందరు రాజీ సమయంలో కొందరు రెచ్చగొట్టి ఇబ్బందులకు గురి చేశారని అందులో పేర్కొంది. ఈ విషయాన్ని తనతో చెప్పి బాధపడ్డాడని తె లిపింది. దానికి భూమి మొత్తం అమ్మి స రిపోకపోతే తన బంగారాన్ని అమ్మి ఎ లాంటి గొడవ లేకుండా చేసుకొని ప్రశాంతంగా ఉందామని కూడా తాను చెప్పిన ట్టు ఆమె పేర్కొంది. ఉద్దేశపూర్వకంగా త న భర్త చావుకు కారణమైన వ్యక్తులపై చ ట్టరీత్యా చర్యలు తీసుకోవాలని న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొంది.

## 'డ్రగ్స్ రహిత తెలంగాణ' దిశగా ప్రజాప్రభుత్వం

**తమ భవిష్యత్ ప్రణాళిక వైపు పయనించాలి*ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్*సిరిసిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ**




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై జిల్లావ్యాప్తంగా వివిధ విద్యాలయాల్లో వారం రోజులుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు ఎస్‌పి చంద్రయ్యతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుంచి పద్మనాయక కల్యాణ మండపం వరకు నిర్వహించారు. డగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన చేశారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా డ్రగ్స్ ను నిర్మూలించేందుకు రాష్ట్రంలో ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసి విస్తృతంగా దాడులు చేస్తుందని తెలిపారు. యువత, విద్యార్థులకు డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. పోలీస్ శాఖ శాంతి భద్రతల తో పాటు పోలీసులు రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారని, హెల్మెట్ ధరించాలని కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని, సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక చర్యలు తీసుకుంటున్నారని అభినందించారు.

**డ్రగ్స్ రహిత జిల్లా కోసం కార్యాచరణ**

యువత, విద్యార్థులు తమకు నచ్చిన అంశాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. అందరికీ శారీరక, మానసిక ఆరోగ్యం చాలా అవసరమని వివరించారు. దేశంలో యువత ఎక్కువగా ఉన్నారని వారు అందరూ దేశ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని పిలుపు నిచ్చారు. డ్రగ్స్ కు బానిస కావద్దని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు ఖాళీగా ఉండవద్దని, తమకు నచ్చిన అంశాల్లో సమయం కేటాయించాలని సూచించారు. విద్యార్థులు చదువులో.. యువత తాము ఎంచుకున్న రంగం లేదా ఉద్యోగంలో ఉండాలని సూచించారు. ఎవరైనా మానసికంగా ఇబ్బంది పడితే సైకాలజిస్ట్‌ను సంప్రదించాలని తెలిపారు. డ్రగ్స్ కు బానిస అయిన వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం కు తరలించాలని సూచించారు. ఈగల్ ఫోర్స్ టోల్ ఫ్రీ నంబర్ 1908, కంట్రోల్ రూం నంబర్ 8712671111, 112 నంబర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, ఎస్ బీ డీఎస్ పీ వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇక్కడ ఏమి చేసినా చెల్లుబాటే!



**దారి తప్పిన వారిపై చర్యలు శూన్యం**
**పెరుగుతున్న అవినీతి దందా**

**ప్రజాపక్షం/ ఖమ్మం:** ప్రభుత్వ అధికారులపై ఆరోపణలు వచ్చినప్పుడు విచారణ జరిపి ఆరోపణలు రుజువైనప్పుడు చర్యలు తీసుకోవడం సహజమే. కానీ ఉమ్మడి ఖమ్మంజిల్లాలో విచారణలతోనే సరిపెడుతున్నారు తప్ప ఎటువంటి చర్యలు లేకపోవడంతో ఇక్కడ ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందిలే అన్న భావన బలపడింది. ఈ శాఖ ఆ శాఖ అనేది లేకుండా ఏ శాఖలోనైనా పరిస్థితి ఈవిధంగానే ఉంది. దీనితో ఎవరికి అందిన కాడికి వారు పోగేసుకునే పనిలో ఉన్నారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు అందినా మీడియాలో ఆధారాలతో కూడిన వార్తలు ప్రచురించినా, ప్రసారం జరిగినా పట్టించుకున్న నాధుడే కనిపించడం లేదు. గతంలో ఆరోపణలు వచ్చినప్పుడు విచారణ అధికారులను నియమించి వాస్తవాలు అని తేలితే వెంటనే చర్యలు తీసుకునే వారు. కానీ ఇప్పుడు గడిచిన మూడేళ్లలో ఖమ్మం జిల్లాకు సంబంధించి ఏ అధికారి పైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు. చర్యలు తీసుకోకపోవడంతో వివిధ శాఖల్లో కొందరు అధికారులు తాము చెప్పిందే శాసనం అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. ఖమ్మం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి సంబంధించి పలు ఆరోపణలు వచ్చాయి. ఖమ్మం ఆసుపత్రి కేంద్రంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మందికి అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నా దివ్యాంగులుగా ధృవీకరిస్తూ ధృవపత్రాలు జారీ చేశారు. యథేచ్ఛగా వికలాంగుల కోటాలో పింఛన్లు పొందుతున్నారు. దీనికి సంబంధించి లక్షలాది రూపాయలు చేతులు మారినా దీనికి సంబంధించి పలు ఫిర్యాదులు అందినా పట్టించుకున్న నాధుడు లేడు. ఇప్పటికీ నకిలీ ధృవీకరణ పత్రాలు జారీ అవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులకు ఇది ఊతంగా మారింది. మరో పక్క నిర్లక్ష్య వైద్యంతో వికలాంగులను చేయడం, అనేక మందిని ఇబ్బందులు పెట్టి జీవిత కాలం కోలుకోలేకుండా చేసినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. పిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రుల్లో పరిస్థితి ఇంత కంటే భిన్నంగా లేదు. రెవెన్యూ శాఖలో క్రింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ఇదే పరిస్థితి. కాసులు లేనిదే ఫైలు కదలడం లేదు. పనికో రేటు నిర్ణయించి వసూళ్లు చేస్తున్నారు. కొందరు రెవెన్యూ అధికారులు అవినీతి నిరోధక శాఖాధికారులకు జంకి మీ సేవ కేంద్రాలకు డబ్బులు ఇచ్చిన తర్వాత వారి దగ్గర నుంచి వసూలు చేసుకుంటున్నారు. మరి కొందరైతే మరో అడుగు ముందుకేసి బంధువుల ఫోన్ నెంబర్లు ఇస్తున్నారు. ఖమ్మం జిల్లా విద్యాశాఖ పరిస్థితి ఘోరాతిఘోరం. ఖమ్మం జిల్లా కేంద్రంలోనే అనుమతి లేని పాఠశాలలు పెద్ద సంఖ్యలో నడుస్తున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా పాఠశాలలను నడుపుతూ బస్సులను తిప్పుతూ అడ్మిషన్ల కోసం బహిరంగ ప్రచారం చేస్తున్నా ఏ విద్యాశాఖాధికారి అటు వైపు చూడటం లేదు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకునే స్థితిలో ప్రైవేటు విద్యా సంస్థలు లేవు. ప్రభుత్వం ప్రైవేటు విద్యా సంస్థలకు సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాలలో ఏ ఒక్కటి అమలు చేయని పాఠశాలలపై సైతం అధికారులు కనీస చర్యలు తీసుకోడం లేదంటే విద్యాశాఖాధికారులు ఏ స్థాయికి దిగజారిపోయారో అవగతమవుతుంది. ఇక రవాణా, పోలీస్, వ్యవసాయ శాఖల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. వ్యవసాయ శాఖకు సంబంధించి గతేడాది అతివృష్టికి సంబంధించి అంచనాలను రూపొందించేటప్పుడు అసలు పంటలు వేయని బీడు భూముల్లో పంటలు నష్టపోయినట్లు క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులు రికార్డుల్లో నమోదు చేసినా కనీస చర్యలు తీసుకోలేదు. ఇక ఖమ్మం కార్పోరేషన్ పాలనపై కమిషనర్‌కు పూర్తిగా పట్టు తప్పింది. కార్పోరేషన్ పరిధిలో ఎవరి ఇష్టానుసారంగా వారు వ్యవహరిస్తున్నారు. మూడేళ్ల కాలంలో ఒక్క అవినీతి అధికారి పైన చర్యలు తీసుకోలేదు. నిర్మాణాలకు అనుమతులు, పన్నుల వసూళ్లు మొదలు ఏ ఒక్క శాఖ పైన పట్టు లేకపోవడంతో కార్పోరేషన్ పరిధిలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆరేండ్ల పాటు ఎటువంటి అనుమతులు లేకుండా ప్రధాన రహదారి పైన నెలకు లక్షలాది రూపాయల లావాదేవీలు కలిగిన వ్యాపారాన్ని నిర్వహించారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించుకోవచ్చు. భవన నిర్మాణాలకు సంబంధించి పైరవీ ఉన్న వారికి నిబంధనలు పట్టింపు కాదన్నట్లు కార్పోరేషన్ల పరిస్థితి ఉంది. ఖమ్మం జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు ఎటువంటి అవినీతికి పాల్పడినా ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధుల నుంచి ఎటువంటి ముప్పు లేదన్న భావనలో ఉన్నారు. బాధితులు లంచాలు చెల్లించలేక అవినీతి నిరోధక శాఖాధికారులను ఆశ్రయిస్తే తప్ప అవినీతి అధికారులకు బ్రేకులు పడటం లేదు. దీనికి సంబంధించి కూడా కొణిజర్లలో రెవెన్యూ శాఖలో పనిచేస్తూ అవినీతి నిరోధక శాఖాధికారులకు చిక్కిన ఓ అధికారి తదనంతరం తిరిగి ఉద్యోగంలో చేరి ఇల్లందులోనూ మళ్లీ అవినీతి నిరోధక శాఖాధికారులకు చిక్కి ఒక వార్తాంశంగా మారాడు. అవినీతి అధికారులపైన చట్టవిరుద్ధంగా వసూళ్లకు పాల్పడుతున్న వారిపైనా ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడంతో సామాన్యులకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

## కళాకారుల ఆటపాటలతో విస్తృత ప్రచారం




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** చింతకాని మండలం మత్కేపల్లి నామవరం వద్ద ఈనెల 30న నిర్వహించే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరుతూ కళాకారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని రేగులచలక, కోయచలక, కోటపాడు, రఘునాథపాలెం గ్రామాల్లో కళాకారులు ఆటపాటలతో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశానుసారం సమాచార శాఖాధికారి గౌస్ సౌజన్యంతో తెలంగాణ సాంస్కృతిక సారధి పాగి వెంకన్న కళాకారుల బృందం రైతన్నకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో చేపడుతున్న పథకాల గురించి కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పమ్మి రవి, అలవాల నందు, యంగల సుధా కుమారి, గోవింద గురవయ్య, బొమ్మెర ముత్యం, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు రాజుగా ఉండాలి: తెల్లం



**ప్రజాపక్షం/భద్రాచలం:** రైతు రాజుగా ఉండాలని కోరుతూ భద్రాద్రి దివ్య క్షేత్రంలోని కల్పవృక్ష నారసింహస్వామి వారి ఆలయంలో రైతు శ్రేయస్సు కోసం భువరహా యాగం రెండో రోజు శాస్త్రోక్తంగా సాగింది. ఈ యాగానికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రైతులతో పాటు భద్రాచలం,ఇల్లందు శాసన సభ్యులు డా. తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్యలు ప్రత్యేక హోమంలో పాల్గొన్నారు. గత కొంతకాలంగా ఎంతో మంది రైతులు ఈ మృత్తికా ప్రసాదాన్ని స్వీకరించి పంట పొలాల్లో చల్లుకుని వ్యవసాయ పనులు ప్రారంభించుకోవాలని తెలిపారు. అనంతరం ఎంఎల్ఏలు తెల్లం, కోరం మాట్లాడుతూ అన్నదాతలు సుభిక్షంగా ఉంటేనే దేశం బాగుంటుందన్నారు. భద్రాద్రి దివ్యక్షేత్రంలో రైతు శ్రేయస్సుకోసం ఇలాంటి యజ్ఞానాలు చేయడం శుభ పరిణామని నిర్వాహికులకు అభినందించారు. రైతులు చక్కటి పంటలను పండించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగసీతారాములు, వేదపండితులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం : ఎస్.కె సాబీర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** మన ప్రాచీన సంప్రదాయాలను, ఆచారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. జిల్లాలోని లక్ష్మీ దేవిపల్లి మండలం పరిధిలో గల అనిశెట్టిపెల్లి గ్రామంలో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించిన బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి పునఃప్రతిష్ట మహోత్సవానికి ఆయన ముఖ్యాతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి శుభ కార్యాలు భక్తిభావంతో కూడిన ఆధ్యాత్మి వాతావరణాన్ని పెంపొందిస్తాయని భవిష్యత్ తరాల వారికి మన మూలాలను అందిస్తాయని చెప్పారు. అన్నదానం వంటి సత్కార్యాలు సమాజంలో సేవా భావాన్ని, సమానత్వాన్ని చాటుతూ ప్రజల మధ్య ఐఖ్యతను పెంపొందిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు వెంకట నర్సయ్య, రమణయ్య, వీరబాబు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీనివాసరావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతు మేళాను రైతులు వినియోగించుకోవాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలం జగన్నాథపురం వద్ద ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న రైతు మేళాను రైతులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. రైతు మేళాతో పాటు 30న నిర్వహించే ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టాళ్లు, ప్రధనా వేదిక, భోజన శాలలు, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాక పోకల మార్గాలు, పారిశుధ్య ఏర్పాట్లు, తాగునీటి వసతులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించే రైతు మేళాలో 150కు పైగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్థక, మత్స్య, పాల ఉత్పత్తి, సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాగు పద్దతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రభుత్వ సంక్షేమపథకాలు వంటి విభిన్న రంగాలకు సంబంధించిన ప్రదర్శనలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## సిఎం పర్యటనకు భద్రత ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ డిసిపి

**ప్రజాపక్షం/ చింతకాని :** చింతకాని మండలం జగన్నాథపురంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను అడిషనల్ డిసిపి రామానుజం పరిశీలించారు. శుక్రవారం సభా ప్రాంగణాన్ని అడిషనల్ డిసిపి పరిశీలించారు. సిఎం పర్యటించే మార్గాలు, సభ ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రత ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను అడిషనల్ డిసిపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. వివిపి కాన్వాయ్ ప్రయాణించే రూట్లలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## రైతు ఆశీర్వాద సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఈనెల 30న జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్‌గౌడ్ కోరారు. శుక్రవారం రఘునాథపాలెం మండలం కోటపాడులో జరిగిన మండల కిసాన్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతు ఆశీర్వాద సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు హాజరవుతారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎక్కడ జరగనంతగా ఈ సభ జరుగుతుందన్నారు. సభ జరగడానికి ముందు రెండు రోజులు రైతు మేళా జరుగుతుందని తెలిపారు. ఈ మేళాలో 150 స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు వివిధ రకాల యంత్రాలు, విత్తనాల మీద వ్యవసాయ రంగానికి సంబంధించి శాస్త్ర, సాంకేతిక విషయాలపై శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని వ్యవసాయ సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. బిఆర్ఎస్ హయాంలో పుట్టలు గుట్టలు పనికిరాని భూములకు రైతు భరోసాలో డబ్బులు ఇచ్చి దుర్వినియోగం చేయకుండా అన్యాయానికి, అక్రమాలకు తావులేకుండా చేసి సన్న, చిన్నకారు రైతులకు మరింత మేలు చేస్తుందన్నారు. బోనస్ విషయంలో కౌలు రైతులకు కూడా మేలు జరుగుతుందని తెలిపారు. తొమ్మిది రోజుల్లో 73 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.9వేల కోట్లు రైతు భరోసా డబ్బులు పడబోతున్నాయని తెలిపారు. మొక్కజొన్నల కొనుగోలు విషయంలో అనేక రకాల ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా కొనుగోలు చేసిందన్నారు. రైతులు యూరియా విషయంలో అపోహలు పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొంటెముక్కుల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బాతుల సుధాకర్, మండల కిసాన్ కాంగ్రెస్ నాయకులు కొంటెముక్కుల కృష్ణయ్య, చర్ల పుల్లయ్య, షేక్ జానిపాషా, షేక్ సాజిద్, షేక్ పెంటు సాహెబ్, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.25 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం పగిడెరు గ్రామంలో శాంతినగర్ నుండి కొడిసెలకుంట వరకు రూ.1 కోటి 25 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ (బ్లాక్ టాప్) రహదారి పనులకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నాణ్యమైన రహదారుల నిర్మాణం అత్యంత అవసరమని అన్నారు. ఈ మార్గం ఎన్నో సంవత్సరాలుగా దెబ్బతిన్న పరిస్థితిలో ఉండటంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.25 కోట్ల నిధులు మంజూరు చేయడం ద్వారా ఈ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత పగిడెరు శాంతినగర్, కొడిసెలకుంటతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు సులభంగా తరలించడంతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర వైద్య సేవలు పొందే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పినపాక నియోజకవర్గంలో కూడా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పథకాలు, విద్య, వైద్య రంగాలకు సంబంధించిన అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు .ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా నిరంతరం కృషి చేస్తూ, పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు, ఎంపీడీవో, సెక్రటరీ, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, జిల్లా జనరల్ సెక్రెటరీ పోలమూరి రాజు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సత్తుపల్లి అభివృద్ధికి జీవితాంతం కృషి చేస్తా: మంత్రి తుమ్మల

- కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీని పరిశీలించిన మంత్రి
- ఆగస్టులో ప్రారంభమే లక్ష్యంగా పనులు చేయాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నియోజకవర్గ ప్రజలు తనపై చూపుతున్న ఆదరణను జీవితాంతం మరువలేనని, ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వేంసూరు మండలం కల్లూరుగూడెంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ ఫెడ్ పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ పనులను శుక్రవారం ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తో కలిసి పరిశీలించారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూతనకు అవకాశం వచ్చిన ప్రతిసారి సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చానని మంత్రి స్పష్టం చేశారు. అప్పుడు తీవ్ర కరువు ప్రాంతాలుగా ఉన్న వేంసూరు, సత్తుపల్లి మండలాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు మంత్రి గుర్తుచేశారు. తమ్మిలేరు జలాలను తీసుకురావడంతో పాటు నాగార్జునసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి సమస్యను అధిగమించామని, భవిష్యత్తులో గోదావరి జలాలను పూర్తిస్థాయిలో అందించి ఈ ప్రాంతాన్ని మరింత సస్యశ్యామలం చేయడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. అలాగే నీలాద్రి శివాలయం అభివృద్ధి, రహదారుల నిర్మాణం వంటి అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. స్థానిక యువతకే ఉపాధి అవకాశాలుఈ పామాయిల్ ఫ్యాక్టరీని పట్టుబట్టి సత్తుపల్లిలోనే ఏర్పాటు చేయించానని మంత్రి వెల్లడించారు. ఈ పరిశ్రమ ద్వారా స్థానిక యువతకు పెద్దపీట వేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. తొలుత స్థానిక మండలం, ఆ తర్వాత సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో 14 ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.,అశ్వారావుపేటలో ఇప్పటికే పరిశ్రమలు విజయవంతంగా నడుస్తున్నాయని, సత్తుపల్లి ప్రాంత రైతులకు రవాణా భారం, సమయం తగ్గించేందుకే కల్లూరుగూడెంలో ఈ కొత్త ఫ్యాక్టరీని తీసుకొచ్చినట్లు వివరించారు.

**కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన మద్దతు ధర...**

పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కనీస మద్దతు ధర (MSP) రూ. 25,000 గా నిర్ణయించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసినట్లు మంత్రి తెలిపారు. త్వరలోనే దక్షిణ భారత రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో కలిసి ప్రధానమంత్రిని కలిసి ఈ విషయమై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ పామాయిల్ సాగు రైతులకు లాభదాయకమని, ఎకరానికి రూ.1 లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందని, ఒకసారి నాటితే సుమారు 30 ఏళ్ల పాటు ఆదాయం వచ్చే పంటగా పామాయిల్‌ను అభివర్ణించారు. రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పామాయిల్‌కు కనీస మద్దతు ధర రూ.25 వేలుగా నిర్ణయించాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. మార్చి 30న ప్రారంభమైన కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ఆగస్టు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఫ్యాక్టరీ ప్రారంభంతో సత్తుపల్లి, కల్లూరు ప్రాంత రైతులకు రవాణా భారం తగ్గడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసిపి వసుంధర యాదవ్, వేంసూర్ తహశీల్దార్ మాణిక్యరావు, ఎంపీడీవో కావ్య, ఆయిల్ ఫెడ్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట




### విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, అశ్వారావుపేట రూపు రేకలు మార్చే దిశగా అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో నియోజవర్గానికి వరాలజల్లు కురిపించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తరుచూ విద్యుత్ అంతరాయాలు, లో ఓల్టేజీ సమస్యల కారణంగా రైతులు, గృహ వినియోగదారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

## మాదక ద్రవ్యాలు సమాజానికి దూరం చేయాలి

**మత్తు పానీయాలు సేవించడం వ్యాధి కంటే ప్రమాదకరం : కలెక్టర్ దివాకర టిఎస్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఖమ్మం నగరం మమత రోడ్డులోని వివిసి టాటా సర్వీస్ సెంటర్ నుంచి లకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు, యువత, పోలీస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి రన్‌లో కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లు పాల్గొని స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర చాలా కీలకమని, యువతకు ఉపాధి కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే అప్రమత్తం కావాలన్నారు. యువత డ్రగ్స్ బారీనపడకుండా కాపాడుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాలు సేవించడం వ్యాధి కంటే ప్రమాదకరమని వివరించారు. డ్రగ్స్ వాడకం వల్ల ఒకరి జీవితం మాత్రమే ప్రభావితం కాదని కుటుంబం, సమాజాన్ని నాశనం చేస్తుందన్నారు. తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలన్నారు. యువత దృష్టి అంతా జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌లకు అలవాటు పడితే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు, సేవిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1908కు సమాచారం అందించాలన్నారు. అనంతరం ప్రజలు, యువత, విద్యార్థులు, అధికారులతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంపై ప్రతిజ్ఞ చేశారు.'ఐయామ్ యాంటీ డ్రగ్స్ సోల్జర్స్' అంటూ సెల్ఫ్ పాయింట్ వద్ద ఫోటోలు దిగడంతో పాటు సైన్ బోర్డు వద్ద సంతకాలు చేసి మాదక ద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసిపి పిరమణమూర్తి, ఎస్బి ఏసిపి మహేష్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, అధికారులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో ఎమ్మెల్యేకు దంత చికిత్స



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఎన్నో కార్పొరేట్ వైద్యశాలలు ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో నిపుణులైన వైద్యులు ఉన్నారని మెరుగైన చికిత్సలు రోగులకు అందుతున్నాయని అందుకే నేను సైతం పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి చికిత్స చేయించుకున్నాను అని అన్నారు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి. శుక్రవారం ఎమ్మెల్యే పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలలో దంత చికిత్స చేయించుకున్నారు. గత కొన్ని రోజులుగా దంత సమస్యతో బాధపడుతున్న ఆమె, ఎలాంటి హడావుడి లేకుండా సాధారణ రోగిలా ఆస్పత్రికి వచ్చి ప్రభుత్వ దంత వైద్యురాలు డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో చికిత్స పొందారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవలపై తనకు పూర్తి విశ్వాసం ఉందనే సందేశాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఇచ్చారు. గత కొద్ది రోజులుగా దంత సమస్యతో ఇబ్బంది పడుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చికిత్స కోసం పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించారు. ప్రభుత్వ దంత వైద్యురాలు డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు అవసరమైన దంత చికిత్స నిర్వహించారు. చికిత్స అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రోటోకాల్‌కు అతీతంగా సాధారణ రోగిలా ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవడం అక్కడున్న రోగులు, సిబ్బంది దృష్టిని ఆకర్షించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పోరేట్ స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాగమయి సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలపై విశ్వాసం ఉంచి స్వయంగా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల మరింత నమ్మకాన్ని పెంచే ప్రయత్నం చేసారు. అనంతరం వైద్యశాల లోని అన్ని వార్డులు పరిశీలించారు. చిన్నారులను ఉంచిన ఇంక్యూబెటర్ ను, వార్డుల్లో ఉన్న రోగులను వారి ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుకున్నారు. నూతన భవనం లోకి వైద్యశాల ను తరలించి తదుపరి పాత భవనాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే విషయం పై వైద్యులకు సూచించారు. ఇంకా మిగిలిన సమస్యల పట్ల మంత్రుల ద్రుష్టి కి తీసుకెళ్లి సమస్యలు పరిస్కారం చూపుతానన్నారు. రోగులు ప్రవేటు వైద్యశాల కు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ వైద్య శాలలో చికిత్సలు పొందాలని, అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు.

## అధికార కేంద్రాలకు ప్రజాగళం వినిపిస్తాం

- అన్ని సందర్భాల్లోనూ అండగా నిలిచా : రాహుల్‌గాంధీ
- ప్రతిపక్షనేతగా రెండేళ్లు పూర్తి



**న్యూఢిల్లీ :** దేశ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానని, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా వారి గళాన్ని అధికార కేంద్రాలకు వినిపిస్తానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. ఈ కీలక పార్లమెంటరీ పదవిలో రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, పార్ల మెంటు లోపల, బయట తాను లేవనెత్తిన అంశాలను వివరిస్తూ రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా ఒక చిన్న వీడియోను పంచుకున్నారు. 'నేను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టి నేటికి రెండేళ్లు పూర్తయ్యాయి. ఈ రెండేళ్లలో ప్రతి రోజూ ఒకే ఒక్క లక్ష్యానికి అంకితమయ్యాను, అదే ప్రతి భారతీయుడి గళాన్ని అధికార కేంద్రాలకు చేరవేయడం అని అన్నారు. 'నీట్ అభ్యర్థుల కోసం పోరాటం కావచ్చు, ఎన్నికల అక్రమాలను బయటపెట్టడం కావచ్చు లేదా రాజ్యాంగాన్ని కాపాడటం కావచ్చు... ప్రతి సందర్భంలోనూ నేను మీకు అండగా నిలిచాను. ఈ రోజు కూడా మీకు అండగా ఉన్నాను, భవిష్యత్తులోనూ ఎప్పుడూ అలాగే ఉంటాను' అని ఆయన హిందీలో పేర్కొన్నారు.

వీధుల నుంచి పార్లమెంటు వరకు ప్రజల నమ్మకమే తన అతిపెద్ద బలమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఈ ప్రయాణం సుదీర్ఘమైనది, కానీ నా సంకల్పం మాత్రం మారలేదు — మీ కోసం ప్రతి పోరాటాన్ని కొనసాగిస్తాను. జై హింద్. జై రాజ్యాంగం' అని రాహుల్‌గాంధీ అన్నారు. ఈ సందర్భంగా గత రెండేళ్లలో తాను చేసిన ప్రసంగాలతో కూడిన మూడున్నర నిమిషాల వీడియోను ఆయన పంచుకున్నారు. రాహుల్‌గాంధీ ఐదుసార్లు ఎంపిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గానికి గతంలో ఆయన తల్లి సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించారు. ఆయన జూన్ 2024లో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిగా నియమితులయ్యారు.

### మనుషులు, వన్యప్రాణుల సంఘర్షణ
## సమస్య పరిష్కారానికి యత్నాలు


కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా



**మలప్పురం :** కేరళలో మనుషులు, వన్యప్రాణుల మధ్య సంఘర్షణ సంక్లిష్టమైన సమస్య అని, దీనిని పరిష్కరించేందుకు అటవీ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. వయనాడ్ ఎంపి అయిన ప్రియాంక 25 నుండి 28 వరకు తన నియోజకవర్గంలో మూడు రోజుల పాటు పర్యటిస్తున్నారు. పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. శుక్రవారం మలప్పురం నిలంబూర్‌లో అటవీ శాఖకు చెందిన 'రాపిడ్ రెస్పాన్స్ టీమ్' (ఆర్ఆర్‌టి) వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'ఇక్కడ ఇది ఒక పెద్ద సమస్య. అలాగే ఇది సంక్లిష్టమైన సమస్య కూడా, కాబట్టి దీనిని పరిష్కరించడం అంత సులభం కాదు. కానీ మేము దీని పరిష్కారం దిశగా అనేక చర్యలు తీసుకుంటున్నాము. అటవీ శాఖతో కలిసి కూడా పనిచేస్తున్నాము' అని ఆమె అన్నారు. డ్రోన్లు, ఇతర ఆధునిక పరికరాలతో సహా మరిన్ని వనరులను అటవీ శాఖకు సమకూర్చాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. 'దీనిలో అనేక వర్గాలు భాగస్వాములుగా ఉన్నాయి. పరిష్కారం కోసం అందరూ కలిసి పనిచేయాలి. ఇది నెమ్మదిగా సాగే ప్రక్రియ అయినప్పటికీ, అందరూ కలిసి పనిచేయడం ముఖ్యం. అందుకే మేము అటువంటి ఏకాభిప్రాయాన్ని సాధించడానికి ప్రయత్నిస్తున్నాము, అలాగే అమలు చేయడానికి మా ఆలోచనలో అనేక అంశాలు ఉన్నాయి' అని ఆమె చెప్పారు. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ అధికారంలో ఉన్నందున, మనుషులువన్యప్రాణుల సంఘర్షణ సమస్యను పరిష్కరించడానికి మరింత కృషి చేయవచ్చని ప్రియాంక విశ్వాసం వ్యక్తం చేశారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మనుషులు–వన్యప్రాణుల సంఘర్షణ అనేది కీలకమైన అంశాలలో ఒకటిగా నిలిచింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలపై వన్యప్రాణుల దాడులు, పంటలను నాశనం చేయడం వంటి ఘటనలు తరచుగా నమోదయ్యాయి. ఎన్నికల ప్రచారంలో యుడిఎఫ్ ఈ సమస్యను ప్రముఖంగా ప్రస్తావించింది. తాము అధికారంలోకి వస్తే శాశ్వత పరిష్కారం కనుగొంటామని హామీ ఇచ్చింది.

## కేంద్రం ఎన్‌డిపిఎస్ చట్టాన్ని పున: సమీక్షిస్తోంది

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెల్లడి



**న్యూఢిల్లీ :** మాదకద్రవ్యాల సిండికేట్లు దుర్వినియోగం చేస్తున్న లొసుగులను గుర్తించేందుకు ఎన్‌డిపిఎస్ చట్టాన్ని కేంద్రం పున: సమీక్షిస్తోందని, మాదకద్రవ్యాల విక్రయదారులు, సరఫరాదారుల పట్ల కఠినవైఖరిని అవలంభించాల్సిన అవసరం ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. శుక్రవారం నార్కో కో–ఆర్డినేషన్ సెంటర్ 10వ ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. చట్టాన్ని సవరించే విషయమై తమ సూచనలను కేంద్రానికి తెలియజేయాలని అమిత్‌షా రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. దేశంలో మాదకద్రవ్యాల ముప్పును ఎదుర్కోవడంలో ఏజెన్సీలు సాధించిన విజయం గురించి కూడా అమిత్‌షా మాట్లాడారు. 2004 నుంచి 2014 వరకు కాలంలో 26లక్షల కిలోగ్రాముల సింథటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నాం. దీనికి విరుద్ధంగా 2014 నుంచి 2026 వరకు 1.18 కోట్ల కిలోగ్రాముల సింథటిక్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం.ఇది మా ప్రచారం విజయం వైపు స్థిరంగా పురోగమిస్తుందని చూపిస్తుంది అని హోం మంత్రి అమిత్‌షా చెప్పారు. 2004నుంచి పట్టుబడిన మాదకద్రవ్యాల విలువ సుమారు రూ.40,000కోట్లు కాగా, 2014 నుంచి 2026 మధ్యకాలంలో వాటి విలువ సుమారు రూ.1.84లక్షల కోట్లు అని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అమిత్‌షా మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా గుర్తించడం, అడ్డుకోవడం, నాశనం చేయడం అనే మూడంచెల విధానాన్ని ఆవిష్కరించారు.

# 'రేపు' జంతర్ మంతర్ వద్ద నిరసన

- విద్యార్థులు,రైతులు, పౌర సమాజ సమూహాలు నాతో చేరండి
- కాక్‌రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే పిలుపు
- దేశ వ్యాప్తంగా 'ప్రధాన్ గో బ్యాక్' ప్రచారం ప్రారంభమైందని ప్రకటన



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవరోధాలు కలిగించినా కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి) కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం మడమ తిప్పని అలుపెరుగని పోరాటాన్ని సాగిస్తోంది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా 'ప్రధాన్ గో బ్యాక్' ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే శుక్రవారం ప్రకటించారు. రేపు (జూన్ 28న) జంతర్‌మంతర్ వద్ద తనతో చేరాలని విద్యార్థులు, రైతులు, పౌర సమాజ సమూహాలకు అభిజీత్ దిప్కే పిలుపునిచ్చారు. ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో దిప్కే మాట్లాడుతూ హక్కుల కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా ఆదివారం జంతర్ మంతర్ వద్ద 'ప్రధాన్ గో బ్యాక్' ప్రచారంలో చేరి నిరవధిక నిరాహారదీక్షను ప్రారంభిస్తారని చెప్పారు. అందులో ఏమేమి ఉంటాయో, ఆ ప్రచారం ఏమి చేస్తుందో ఆయన వివరించలేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేలా చూడాలని, అలా చేయడంలో విఫలమైతే అసమర్థ ప్రధానిగా మిగిలిపోతారని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ప్రధానమంత్రి నరేంద్రమోదీని కోరారు. డిజిటల్ వ్యంగ్య వ్యవస్థగా ప్రారంభమైన కాక్‌రోచ్ జనతా పార్టీ, పరీక్షలలో జరిగిన అవకతవకలు, నీట్ పేపర్ లీక్ వివాదంపై ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 20నుండి జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తోంది. 'వారం గడిచినా పేపర్‌లీక్‌లకు ధర్మేంద్ర ప్రధాన్ ఎలాంటి బాధ్యత తీసుకోకపోవడం శోచనీయం' అని దిప్కే అన్నారు. సోనమ్ వాంగ్ చుక్ ఆదివారం నుంచి నిరసనలలో పాల్గొననున్నారని, విద్యార్థుల ఆత్మహత్యలకు ఎవరినీ జవాబుదారీగా నిలబెట్టకపోవడం దురదృష్టకరమని, పైగా ఇప్పటికే 20మంది విద్యార్థులు మరణించగా, హక్కుల కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ వంటి వారు నిరాహార దీక్ష చేపట్టాల్సి వచ్చిందని అభిజీత్ దిప్కే పేర్కొన్నారు. 'ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. ఆ విద్యార్థుల రక్తం అతడి చేతులపై అంటుకుని ఉంది. అందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. అతను మమ్మల్ని ఉగ్రవాదులని పిలిచాడు. కానీ అసలైన ఉగ్రవాది అతనే. ఎందుకంటే ఈ విద్యార్థుల మరణానికి అతనే కారణం' అని దిప్కే విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై విమర్శల అస్త్రాలను ఎక్కుపెట్టారు.'ప్రధాన్ గో బ్యాక్' నిరసనపై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జవాబుదారీతనం కోరుతూ దేశ వ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభించాలని కాక్‌రోచ్ జనతా పార్టీ కోరుకుంటోందన్నారు. దిప్కే మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, రైతు యూనియన్లు, పౌర సమాజం సమూహాలు ఆదివారం జంతర్‌మంతర్‌కు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అభిజీత్ దిప్కే మాట్లాడుతూ 'జవాబుదారీతనం లేకుండా ఈ దేశం ఇంకెంతకాలం పనిచేస్తుంది?. ఇది ఏమి ప్రజాస్వామ్యం? ఈ ప్రభుత్వంలో ఎవరూ రాజీనామా చేయకపోవడం మంచి విషయమైనా'? అని ప్రశ్నించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని సిజెపి వ్యవస్థాపకుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంఘటన వెనక ఉన్నవారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## ఆరు కోట్ల ఓటర్ల తొలగింపు
### 'సర్'కు ఏడాది పూర్తి



**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియ ప్రారంభమై ఏడాది పూర్తయింది. 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రక్షాళన కొనసాగుతుండగా, ఇప్పటివరకు దాదాపు ఆరు కోట్ల మంది ఓటర్లను తొలగించారు. ఈ ప్రక్రియ ప్రతిపక్షాలకు, ఎన్నికల కమిషన్‌కు మధ్య వివాదానికి దారితీసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, గత ఏడాది జూన్ 24న బిహార్‌లో ఈ పైలట్‌గా 'సర్' ప్రక్రియ ప్రారంభమైంది. బిహార్‌లో సర్ తర్వాత, అక్కడి ఓటర్ల జాబితా నుండి దాదాపు 65 లక్షల పేర్లను తొలగించారు. సరైన పత్రాలు లేవనే కారణంతో పౌరుల ఓటు హక్కును తొలగించేందుకు ఎన్నికల యంత్రాంగం బిజెపి ఆదేశాల మేరకు పనిచేస్తోందని ప్రతిపక్షాలు, కార్యకర్తలు ఆరోపించినప్పటికీ ఈ చర్యలు జరుగుతూనే ఉన్నాయి. సర్ ప్రక్రియను చేపట్టాలన్న ఎన్నికల కమిషన్ నిర్ణయం రాజ్యాంగబద్ధతను మార్చి నెలలో సుప్రీంకోర్టు ఏకగ్రీవంగా సమర్థించింది. సర్ సమయంలో పేర్లు తొలగించబడిన వ్యక్తులు పశ్చిమ బెంగాల్, బిహార్‌లలో రాష్ట్ర సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత, ఓటర్ల జాబితా ప్రక్షాళన డేటాను సామాజిక భద్రతా పథకాలతో అనుసంధానిస్తున్నట్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. అర్హులైన పౌరులెవరూ జాబితాలో లేకుండా పోకూడదని, అనర్హులెవరూ అందులో చేరకూడదని నిర్ధారించే ప్రక్రియగా పేర్కొంటూ సర్ ఇప్పుడు ఎన్‌సిఇఆర్‌టి సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో కూడా ఒక భాగంగా చేర్చబడింది. గత ఏడాది అక్టోబర్ 27న ప్రకటించిన ఈ ప్రక్రియ రెండవ దశలో— ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ అండ్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాల్లో మొత్తం ఓటర్ల జాబితా 10.2 శాతం తగ్గింది. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ముందు ఓటర్ల సంఖ్య 50.99 కోట్లకు పైగా ఉండేది. ఈ ప్రక్రియ తర్వాత, ఓటర్ల సంఖ్య 45.81 కోట్లకు చేరింది. అంటే 5.18 కోట్లకు పైగా తగ్గుదల నమోదైంది. శాతం పరంగా చూస్తే, ఓటర్ల జాబితా 10.2 శాతం తగ్గింది. మరణించిన మొత్తం 66,88,636 మంది ఓటర్ల పేర్లు జాబితాల నుండి తొలగించబడ్డాయి. అందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్ నుండి 25.47 లక్షల మంది, ఆ తర్వాతి స్థానంలో ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్ నుండి 24.16 లక్షల మంది ఉన్నారు. అదనంగా, సర్ ప్రక్రియలో అభ్యంతరాలు, వాటి పరిష్కారాల అనంతరం మరో 63.16 లక్షల పేర్లు తొలగించారు. 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాలు వేర్వేరు తేదీల్లో విడుదలయ్యాయి. వీటిలో ఉత్తరప్రదేశ్ చివరగా ఈ వివరాలను విడుదల చేసింది. 36.73 కోట్ల మంది ఓటర్లతో కూడిన సర్ (ప్రత్యేక సారాంశ సవరణ) ప్రక్రియ మూడవ దశ— ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్ ఒడిశా, పంజాబ్, సిక్కిం, త్రిపుర, తెలంగాణ, ఉత్తఖండ్ 16 రాష్ట్రాలు, ఢిల్లీ రాజధాని ప్రాంతం, చండీగఢ్, దాద్రా అండ్ నగర్ హవేలీ అండ్ డామన్ అండ్ డయ్యూ అనే కేంద్ర పాలిత ప్రాంతాలలో మే 14న ప్రారంభమైంది.

## శిథిలాల మధ్య ముమ్మర గాలింపు

గిడ్డంగి కూలిన ఘటనలో 15కు చేరిన మృతుల సంఖ్య

**కోల్‌కతా:** దక్షిణ కోల్‌కతాలోని తారతలాలో గిడ్డంగి కూలిపోయిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. శుక్రవారం నాటికి ఆ సంఖ్య 15కి చేరింది. ఆర్మీ సిబ్బందితో సహా వివిధ ఏజెన్సీల బృందాలు మరో రెండు మృతదేహాలను వెలికితీయగా, చికిత్స పొందుతున్న మరో ఇద్దరు గాయాల కారణంగా మరణించారని ఒక అధికారి తెలిపారు. గిడ్డంగి పైకప్పు కూలిపోయిన రెండు రోజుల తర్వాత కూడా సహాయక బృందాలు శిథిలాల మధ్య ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని ఆయన చెప్పారు. గురువారం రాత్రి రెండు మృతదేహాలను వెలికితీశారు, అయితే వారి వివరాలు ఇంకా తెలియరాలేదని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం, మన్ను కుమార్, సాహిల్ సర్దార్ అనే ఇద్దరు కార్మికులు ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎస్ఎస్‌కెఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో మృతుల సంఖ్య 15కి చేరిందని ఆ అధికారి తెలిపారు. 'బిహార్‌లోని ముంగేర్ జిల్లాకు చెందిన 19 ఏళ్ల మన్ను కుమార్‌ను 24న శిథిలాల నుండి రక్షించారు మరియు గురువారం రాత్రి అతనికి శస్త్రచికిత్స జరిగింది. వైద్యులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ, శుక్రవారం తెల్లవారుజామున అతను మరణించాడు' అని అధికారి చెప్పారు. ఈ ప్రమాదంలో అతని సోదరుడు ఛి కుమార్ మరణించగా, వారి తండ్రి కూడా గిడ్డంగి కూలిపోవడంతో గాయపడి చికిత్స పొందుతున్నారని ఆయన తెలిపారు. ఆర్మీ, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) సిబ్బంది పని చేస్తున్నారని, శిథిలాలను పూర్తిగా తొలగించే వరకు సహాయక చర్యలు కొనసాగుతాయని ముఖ్యమంత్రి సువేందు అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా, కోల్‌కతా పోలీసులు, సైన్యం, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందంతో సహా పలు ఏజెన్సీల సిబ్బంది బుధవారం నుంచి రేయింబవళ్లు పనిచేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇనుప దూలాలను కత్తిరించడం, భారీ కాంక్రీట్ స్లాబులను తొలగించడం వంటి పనులు చేస్తున్నారు. అదే సమయంలో, శిథిలాల కింద పనిచేస్తున్న ఫోన్లు ఉన్న వ్యక్తుల ఆచూకీని కనుగొనడానికి మొబైల్ ఫోన్ టవర్ డేటాను ఉపయోగిస్తున్నారు.



## చీలినా.. పార్టీ బలంగానే ఉంది

ఆదిత్య థాక్రేకు శివసేన (యుబిటి)ని నడిపించే సామర్థ్యం ఉంది : రౌత్



**ముంబయి :** మహారాష్ట్రలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇటీవల శివసేన (యుబిటి)లో చీలక ఏర్పడింది. అయితే పార్టీ చీలికలకు గురైనప్పటికీ బలంగానే ఉందని ఎంపి సంజయ్ రౌత్ అన్నారు. ఆదిత్య థాక్రేకు పార్టీని నడిపించే సామర్థ్యం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని సేనలో చేరిన ఆరుగురు ఎంపిల నియోజకవర్గాల్లో పార్టీ అధినేత ఉద్ధవ్ థాక్రే చేపట్టనున్న పర్యటనకు ముందు రౌత్ పిటిఐతో మాట్లాడారు. ఆ ఎంపిలు కేవలం డబ్బు, అధికారం, రక్షణ కోసమే పార్టీ మారారని ఆరోపించారు. సేన (యుబిటి) ఎమ్మెల్యే ఆదిత్య థాక్రే పార్టీలో పోషించాల్సిన పాత్ర గురించి ప్రశ్నించగా, తదుపరి తరం క్రమంగా ఎక్కువ బాధ్యతలు స్వీకరించాలని, తాము ఇంకెన్నాళ్లు పనిచేస్తామని ప్రశ్నించారు. 40 ఏళ్లుగా పనిచేస్తున్నామని, యువ నాయకులు పార్టీ పగ్గాలు చేపట్టాలని సూచించారు. ఆదిత్య ఇప్పటికే పార్టీని కొంత నడిపిస్తున్నారని, ఆయన అధికారికంగా కూడా ఆ బాధ్యతను చేపడతారని చెప్పారు. ఆయనకు ఆ సామర్థ్యం ఉందని, తానిని తాము స్వాగతిస్తామని చెప్పారు. ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని పార్టీని వీడిన నాయకులను తిరుగుబాటుదారులు అని అనవద్దని రౌత్ అన్నారు. భగత్ సింగ్, సుఖ్‌దేవ్ వంటి స్వాతంత్ర్య సమర యోధులకు మాత్రమే ఆ పదాన్ని పరిమితం చేయాలని, డబ్బు, అధికారం కోసం పార్టీ మారే రాజకీయ నాయకులకు ఆ పదాన్ని వాడకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్టీని వీడిన ఎంపిల నియోజకవర్గాల్లోని ఓటర్లు, కార్యకర్తలకు పార్టీ వైఖరిని నేరుగా వివరించేందుకు ఉద్ధవ్ థాక్రే ఈ పర్యటన చేపడుతున్నారని రౌత్ తెలిపారు. ఆ ఎంపిలు కోట్ల రూపాయలకు అమ్ముడుపోయారని పేర్కొన్న ఆయన, సేన కార్యకర్తలు మాత్రం ఉద్ధవ్ థాక్రే వెంటే ఉన్నారని చెప్పారు. బాలాసాహెబ్ పార్టీని విచ్ఛిన్నం చేసే పాపం చేయవద్దని హెచ్చరించానని, ఏక్‌నాథ్ షిండేతో సహా గతంలో జరిగిన పార్టీ ఫిరాయింపులను ఆపడానికి తీవ్రంగా ప్రయత్నించానని చెప్పారు. డబ్బు ఆశ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) వంటి దర్యాప్తు సంస్థల పట్ల ఉండే భయం రాజకీయ చీలికలకు కారణమని ఆ రాజ్యసభ సభ్యుడు అన్నారు. మాకు కేవలం ఒక గంట పాటు ఇడి, సిబిఐ అధికారాలను అప్పగించండి, అప్పుడు వారికి మా సత్తా చూపిస్తాం అని ఆయన అన్నారు.


## 7–9 తరగతుల విద్యార్థులకు ద్విభాషా విధానమే...




**న్యూఢిల్లీ :** త్రిభాషా విధానం కింద రెండు విదేశీ భాషలను ఎంచుకుని, ప్రస్తుతం 7 నుండి 9వ తరగతుల్లో చదువుతున్న లక్షలాది మంది సిబిఎస్ఇ విద్యార్థులకు శుభవార్త. వారు 10వ తరగతి వరకు అదే భాషా విధానాన్ని కొనసాగించడానికి అనుమతించబడతారని అధికారులు శుక్రవారం తెలిపారు. జూలై 1 నుండి 9వ తరగతి విద్యార్థులకు కనీసం రెండు భారతీయ భాషలతో సహా మూడు భాషలను అభ్యసించడం తప్పనిసరి అని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) ప్రకటించిన ఒక నెల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ సిబిఎస్ఇ ఉత్తర్వుకు వ్యతిరేకంగా పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించారు. 'కొత్త భాషా విధానం ప్రకారం కనీసం రెండు భారతీయ భాషలను అభ్యసించాలనే నిబంధన 6వ తరగతి నుండి భవిష్యత్తులో అమలు చేయబడుతుంది; ఇది ఇప్పటికే 7 నుండి 9వ తరగతుల్లో చదువుతున్న విద్యార్థులకు వర్తించదు' అని బోర్డుకు చెందిన ఒక సీనియర్ అధికారి తెలిపారు. దీనికి సంబంధించి స్పష్టతనిచ్చే అధికారిక ప్రకటన త్వరలో విడుదల చేస్తామని ఆ అధికారి పేర్కొన్నారు. ప్రత్యేక 'ఆర్3' పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వచ్చే వరకు, 9వ తరగతి విద్యార్థులు తాము ఎంచుకున్న భాషకు సంబంధించిన 6వ తరగతి 'ఆర్3' పాఠ్యపుస్తకాలను (2026–27 ఎడిషన్) ఉపయోగించాలని బోర్డు మే నెలలో తెలిపింది. జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) 2020, పాఠశాల విద్య కోసం జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం (ఎన్‌సిఎఫ్ఎస్ఇ) 2023కి అనుగుణంగా తన విద్యా విధానాన్ని మార్చుకునే క్రమంలో సిబిఎస్ఇ ఈ చర్య తీసుకుంది. మే 15న జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం, విదేశీ భాషను ఎంచుకునే విద్యార్థులు రెండు భారతీయ భాషలను అభ్యసించిన తర్వాత దానిని మూడవ భాషగా లేదా అదనపు నాలుగవ భాషగా మాత్రమే ఎంచుకోవచ్చు. ఏప్రిల్‌లో 6వ తరగతి నుండి మూడు భాషల విధానాన్ని దశలవారీగా అమలు చేయడం, 2026–27 విద్యా సంవత్సరం నుండి 9వ తరగతికి గణితం, సైన్స్ సబ్జెక్టులలో రెండు స్థాయిల విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు సిబిఎస్ఇ ప్రకటించింది.

6వ తరగతి నుంచి త్రిభాషా విధానం భవిష్యత్తులో అమలు : సిబిఎస్ఇ

### ఎన్‌సిఇఆర్‌టి 9వ తరగతి
## పాఠ్యాంశంగా 'సర్'




**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) ప్రక్రియ ఇప్పుడు ఎన్‌సిఇఆర్‌టి 9వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో భాగమైంది. అర్హులైన పౌరులెవరూ జాబితాలో చేరకుండా ఉండిపోకుండా, అనర్హులెవరూ అందులో చేరకుండా చూసే ప్రక్రియగా దీనిని అందులో వివరించారు. ఓటర్ల జాబితాల నుండి ఇప్పటివరకు దాదాపు 6 కోట్ల పేర్ల తొలగింపునకు దారితీయడంతో పాటు ప్రతిపక్ష పార్టీలు, ఇసిఐకి మధ్య వివాదాలకు కారణమైంది. 'సర్ ప్రక్రియ ద్వారా ఓటర్లందరినీ, ముఖ్యంగా అవగాహన లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల జాబితా నుండి తప్పిపోయే అవకాశం ఉన్న, ఇప్పుడే 18 ఏళ్లు నిండిన యువ ఓటర్లను చేర్చడం జరుగుతుంది' అని 'అండర్–స్టాండింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్ అనే పాఠ్యపుస్తకంలోని ఒక విభాగం పేర్కొంది. ఓటరు మరణం, నివాస మార్పు, నకిలీ నమోదు, శాశ్వతంగా ఆచూకీ తెలియకపోవడం వంటి కారణాల ఆధారంగా కూడా సర్ పేర్లను తొలగిస్తుందని అది పేర్కొంది. సవరించిన ఓటర్ల జాబితాపై ఫిర్యాదులు లేదా అభ్యంతరాలు తెలియజేయడానికి ఎన్నికల సంఘం సమయం ఇస్తుందని, తుది ఓటర్ల జాబితాను ప్రచురించే ముందు ఈ ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరిస్తుందని అది తెలిపింది. పాత 9వ తరగతి పాఠ్యపుస్తకంలోని ఎన్నికల రాజకీయాలపై ఉన్న ఒక అధ్యాయంలో, ఓటర్ల జాబితాలపై ఒక విభాగం ఉంది, అందులో జాబితా ఎప్పటికప్పుడు తాజాగా ఉండేలా చూసుకోవడానికి ప్రతి ఐదేళ్లకు ఒకసారి పూర్తి సవరణ జరుగుతుంది అని పేర్కొన్నారు. కొత్త జాతీయ పాఠ్యప్రణాళికకు అనుగుణంగా సవరించిన ఈ పాఠ్యపుస్తకం, భారత దేశ ఎన్నికల ప్రక్రియ విస్తృతిని, దేశవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణలో ఇసిఐ పాత్రను కూడా ప్రముఖంగా తెలియజేస్తుంది. 'విభిన్న ప్రాంతాలు, భూభాగాలలో విస్తరించి ఉన్న 96.8 కోట్లకు పైగా అర్హతగల ఓటర్లతో, భారతదేశ ఎన్నికల ప్రక్రియ ప్రపంచంలోని ఇతర ప్రాంతాల కంటే అసమానమైనది మరియు విభిన్నమైనది' అని ఆ అధ్యాయం పేర్కొంది.

### జార్ఖండ్‌లో రోడ్డు ప్రమాదం
## ఎనిమిది మంది మృతి

**రామ్‌గఢ్ :** జార్ఖండ్ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రామ్‌గఢ్ జిల్లాలో బొగ్గు లోడుతో వెళ్తున్న ట్రక్కు, బ్యాండ్ పార్టీ బృందాన్ని తీసుకెళ్తున్న వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించారు. ఈ ఘటనపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం అర్ధరాత్రి సమయంలో రాజ్రప్ప పోలీస్ స్టేషన్ పరిధిలోని బర్లాంగ్ బుధ్‌బజార్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని ఒక సీనియర్ అధికారి తెలిపారు. 'ప్రమాదంలో మొదట ఏడుగురు మరణించారు. చికిత్స కోసం రాంచీలోని రిమ్స్‌కు తరలించిన గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించడంతో, మొత్తం మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది' అని రాజ్రప్ప పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ కృష్ణ కుమార్ తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి పట్ల జార్ఖండ్ గవర్నర్ సంతోష్‌కుమార్ గంగ్వార్, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సంతాపం వ్యక్తం చేశారు. రామ్‌గఢ్–బొకారో రహదారిపై లారీబర్లాంగ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. బాధిత కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ దుఃఖ సమయంలో ఆ కుటుంబాలకు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నానని గంగ్వార్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. 'గురువారం రాత్రి రామ్‌గఢ్–బొకారో రోడ్డుపై లారీబర్లాంగ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించారన్న విషాద వార్త నన్ను కలచివేసింది' అని ముఖ్యమంత్రి సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించినట్లు ఎస్‌డిపిఓ తెలిపారు. అయితే, రామ్‌గఢ్ సివిల్ సర్జన్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, సదర్ ఆసుపత్రికి ఎనిమిది మందిని తీసుకువచ్చారని, వారిలో ఏడుగురు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారని చెప్పారు.

## 'ఆపరేషన్ సిందూర్'లో ఆరుగురు సైనికులు వీరమరణం

ఏడాది తరువాత అధికారికంగా జాబితా విడుదల చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాటికి ప్రతీకారంగా గత ఏడాది పాకిస్థాన్‌పై భారత్ 'ఆపరేషన్ సింధూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్ చేసి ఏడాది గడిచిన తరువాత ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు భారత సైనిక సిబ్బంది పేర్లను కేంద్ర ప్రభుత్వం జాతీయ యుద్ధ స్మారక చిహ్నం (ఎన్‌డబ్ల్యుఎం)లోని గౌరవ పట్టికలో (రోల్ ఆఫ్ ఆనర్) అధికారికంగా చేర్చింది. ఈ సంఘర్షణలో మరణించిన వారి పేర్లను అధికారికంగా వెల్లడించడం ఇదే మొదటిసారి. న్యూఢిల్లీలోని ఈ స్మారక చిహ్నం వద్ద ఉన్న త్యాగ చక్రం (త్యాగ వలయం)పై కూడా ఈ పేర్లను చెక్కారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి దేశ సేవలో ప్రాణాలు అర్పించిన సైనికుల పేర్లు, హోదాలు, యూనిట్లను తెలిపే 16 ఏకకేంద్రక గ్రానైట్ గోడలు ఈ స్మారక చిహ్నంలో ఉన్నాయి. 2025 గౌరవ పట్టిక (రోల్ ఆఫ్ ఆనర్) కింద, ఈ ఆరుగురి పేర్లను వాల్ 3డిలో నమోదు చేశారు. పేర్కొన్న వారిలో 10వ పదాతి దళ బ్రిగేడ్ ప్రధాన కార్యాలయానికి చెందిన సుబేదార్ మేజర్ పవన్ కుమార్, 4 జమ్ము కశ్మీర్ లైట్ ఇన్ఫాంట్రీకి చెందిన రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్, 5వ ఫీల్డ్ రెజిమెంట్‌కు చెందిన లాన్స్ నాయక్ దినేష్ కుమార్, 851వ లైట్ రెజిమెంట్‌కు చెందిన అగ్నివీర్ మూడ్ మురళీనాయక్, 237వ ఫీల్డ్ వర్క్‌షాప్ కంపెనీకి చెందిన హవిల్దార్ సునీల్ కుమార్ సింగ్, భారత వైమానిక దళానికి చెందిన నెం. 39 వింగ్‌కు చెందిన సార్జెంట్ సురేంద్ర కుమార్ ఉన్నారు. ఈ ఆరుగురిలో ఇద్దరికి శౌర్య పురస్కారాలు లభించాయి. రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్‌కు మరణానంతరం భారతదేశపు మూడవ అత్యున్నత యుద్ధ శౌర్య పురస్కారమైన వీర్ చక్రను ప్రదానం చేయగా, సార్జెంట్ సురేంద్ర కుమార్‌కు వాయుసేన పతకాన్ని ప్రదానం చేశారు. గత ఏడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పౌరులు, వారిలో ఎక్కువ మంది పర్యాటకులు మరణించారు. దానికి ప్రతిస్పందనగా, గత ఏడాది మే 7వ తేదీ తెల్లవారుజామున ఆపరేషన్ సింధూర్‌ను ప్రారంభించారు. భారత సాయుధ దళాలు పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లో జైష్–ఎ–మొహమ్మద్‌ష లష్కర్–ఎ–తైబాలకు సంబంధించిన తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడి చేశాయి.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS24T 2126 | Suprith Arelly | TATA ACE | 2017 |
| 2 | TS08KA3845 | Rajender Thota | SWIFT DZIRE VDI DIESEL 5 SEATER | 2013 |
| 3 | TS15UE4612 | Srikanth Bokks | MARUTI ERTIGA TOUR M BS6 PETROL-P | 2021 |
| 4 | AP36TB6772 | Suresh Bigulla | CHEVROLET TAVERA NEO-P | 2014 |
| 5 | TG037101 | Bhukya Mounika | ACE 6565 DI | 2020 |
| 6 | TS09UC6704 | Pulisheri Prashanth | TATA INTRA V10 | 2019 |
| 7 | AP31BR3177 | Sindhura Kukkamudi | ACE 12XW | 2011 |
| 8 | TS03EW5255 | Raju Banoth | FIGO ASPIRE TITANIUM 1.2L MT PETROL 5 SEATER | 2019 |

AUCTION DATE : 27-06-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H No : 55-1-191, 1st Floor , Above HDFC Bank, Karimnagar Road, Ramaram Complex, Hanamkonda 506015 Cell : 9666576664 & 9000444965

## వెనెజులాలో భూకంపం సృష్టించిన విధ్వంసం







# ట్రంప్ ఎన్నికల ఉత్తర్వుకు అమెరికా కోర్టు బ్రేక్

**బోస్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జారీ చేసిన కీలక ఎన్నికల కార్యనిర్వాహక ఉత్తర్వు అమలును ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ ఉత్తర్వు ద్వారా దేశవ్యాప్తంగా అర్హులైన ఓటర్లకు ఒక కేంద్ర జాబితా రూపొందించడం, అలాగే మెయిల్ బ్యాలెట్ పొందే అర్హతను అమెరికా పోస్టల్ సర్వీస్ ద్వారా నిర్ణయించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఈ చర్య అమెరికా రాజ్యాంగానికి విరుద్ధమని బోస్టన్‌లోని ఫెడరల్ జిల్లా న్యాయమూర్తి ఇందిరా తల్వానీ తీర్పు ఇచ్చారు. న్యాయస్థానం అభిప్రాయం ప్రకారం, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నియమాలను రూపొందించే అధికారం అధ్యక్షుడికి కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు, అలాగే కాంగ్రెస్‌కు ఉంటుంది. ట్రంప్ ఉత్తర్వు ఈ 'అధికారాల విభజన' అనే రాజ్యాంగ సూత్రాన్ని ఉల్లంఘించిందని కోర్టు స్పష్టం చేసింది. అందువల్ల ఈ ఏడాది జరగనున్న మధ్యంతర ఎన్నికలకు ఈ ఉత్తర్వు వర్తించదని పేర్కొంది. ఈ కేసును 22 రాష్ట్రాలతోపాటు, కొలంబియా జిల్లా కూడా కలిసి దాఖలు చేశాయి. అరిజోనా అటార్నీ జనరల్ క్రిస్ మేయెస్ ఈ తీర్పును



స్వాగతిస్తూ, తమ రాష్ట్రంలో దశాబ్దాలుగా మెయిల్ ఓటింగ్ విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు. ముఖ్యంగా సైనిక కుటుంబాలు, గ్రామీణ ప్రాంత ప్రజలు, గిరిజన ప్రాంతాల ఓటర్లకు మెయిల్ ఓటింగ్ అత్యంత కీలకమని ఆమె వివరించారు.

అయితే, వైట్ హౌస్ ఈ తీర్పుతో ఏకీభవించలేదు. ఎన్నికల భద్రతను కాపాడేందుకే ఈ ఉత్తర్వు జారీ చేశామని, దీనిపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేస్తామని ప్రకటించింది. ట్రంప్ ప్రభుత్వం ఓటర్ల పౌరసత్వాన్ని నిర్ధారించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక జాబితా రూపొందించాలని, ఆ జాబితాలో ఉన్నవారికే పోస్టల్ సర్వీస్ ద్వారా మెయిల్ బ్యాలెట్లు పంపించాలని ప్రతిపాదించింది. ఎన్నికల అధికారులు, పోస్టల్ సర్వీస్ ఉద్యోగులు ఈ విధానం అమలు చేయడం కష్టసాధ్యమని, దీంతో ఎన్నికల వ్యవస్థలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా పోస్టల్ సిబ్బందికి ఓటర్ల అర్హతను నిర్ణయించే బాధ్యత అప్పగించడం తగదని వారు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ట్రంప్ ఎన్నికలకు సంబంధించిన మరో కార్యనిర్వాహక ఉత్తర్వును కూడా ఇటీవల మరో ఫెడరల్ కోర్టు నిలిపివేసింది. ఓటరు నమోదు సమయంలో పౌరసత్వానికి సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా సమర్పించాలని పేర్కొన్న ఆ ఉత్తర్వుపైనా న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేసింది. మొత్తం మీద ఈ పరిణామాలు అమెరికాలో ఎన్నికల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వ అధికారాల పరిమితి, రాష్ట్రాల రాజ్యాంగబద్ధ హక్కులు, మెయిల్ ఓటింగ్ విధానం వంటి అంశాలపై చర్చను మరింత ఉధృతం చేస్తున్నాయి.

# హోర్ముజ్ జలసంధిలో నౌకల తరలింపును నిలిపివేసిన ఐఎంఒ

**దుబాయ్:** ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిలో భద్రతా పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి. ఒమాన్ తీరానికి సమీపంలో ఒక వాణిజ్య నౌకపై దాడి జరిగిన నేపథ్యంలో, అక్కడ చిక్కుకుపోయిన నౌకలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు చేపట్టిన చర్యలను ఐక్యరాజ్యసమితి (ఐరాస) అనుబంధ సంస్థ అంతర్జాతీయ సముద్ర సంస్థ (ఐఎంఒ) తాత్కాలికంగా నిలిపివేసింది. బ్రిటన్ సముద్ర భద్రతా సంస్థ విడుదల చేసిన ప్రకటనను అనుసరించి, ఒమాన్ తీరానికి సమీపంలో ప్రయాణిస్తున్న ఒక నౌకపై గుర్తు తెలియని క్షిపణి దాడి జరిగింది. అనంతరం అమెరికా అధికారులు ఈ దాడి ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ నిర్వహించిన డ్రోన్ ద్వారా జరిగిందని వెల్లడించారు. దాడికి గురైన 'ఎవర్ లఫ్ట్' అనే నౌక ఐఎంఒ తరలింపు కార్యక్రమంలో భాగం కాకపోయినా, ఈ సంఘటన భద్రతా ఆందోళనలను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో, హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకలను తరలించే ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఎంఒ ప్రధాన కార్యదర్శి అర్సెనియో డొమింగ్వెజ్ ప్రకటించారు. నౌకల భద్రతపై పూర్తి హామీ లభించిన



తర్వాతే ఈ కార్యక్రమాన్ని పునఃప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, తమ అనుమతి లేకుండా కొత్త సముద్ర మార్గాన్ని ఉపయోగించవద్దని ఇరాన్ ప్రభుత్వం హెచ్చరించింది. తాము ప్రకటించిన అధికారిక మార్గాల మీదుగానే నౌకలు ప్రయాణించాలని, ఇతర మార్గాల్లో వెళ్లే నౌకలకు భద్రతా హామీ ఉండదని స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించింది. ఇలావుంటే, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో మాత్రం కొత్త సముద్ర మార్గాన్ని కొనసాగించేందుకు అమెరికా కట్టుబడి ఉందని అన్నారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలు అంతరాయం లేకుండా సాగడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత ఈ మార్గంలో నౌకల రాకపోకలు క్రమంగా పెరుగుతున్నాయి. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఒక దశలో వారానికి కేవలం 33 నౌకలు మాత్రమే ప్రయాణించగా, గతవారం ఆ సంఖ్య 125 కు చేరుకుంది. అయినప్పటికీ, యుద్ధానికి ముందు రోజుకు సగటున 130కు పైగా నౌకలు ప్రయాణించేవి. హోర్ముజ్ జలసంధి ప్రపంచ చమురు, సహజవాయువు సరఫరాలో దాదాపు ఐదో వంతు రవాణా జరిగే అత్యంత కీలక సముద్ర మార్గం. అందువల్ల అక్కడ నెలకొనే ప్రతి ఉద్రిక్తత అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు, చమురు ధరలు, ప్రపంచ వాణిజ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న శాంతి చర్చలతో పాటు, ఇజ్రాయెల్–హిజ్బుల్లా మధ్య తాజా ఘర్షణలు కూడా ఈ ప్రాంత భద్రతా పరిస్థితులను మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి.

# ఉభయ కొరియాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు


**సియోల్ :** కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు మరోసారి పెరుగుతున్నాయి. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ అత్యాధునిక ఆయుధాల పరీక్షలను పరిశీలించిన అనంతరం సైన్యం 'విధ్వంసకర దాడి సామర్థ్యాన్ని' మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. శుక్రవారం ఉత్తర కొరియా అధికారిక మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది. గురువారం నిర్వహించిన పరీక్షల్లో ప్రత్యేక వార్‌హెడ్ కలిగిన టాక్టికల్ బాలిస్టిక్ క్షిపణి, ఆధునిక రాకెట్ వ్యవస్థ, దీర్ఘ శ్రేణి స్వయం చోదక హోవిట్జర్ ఫిరంగుల సామర్థ్యాన్ని పరీక్షించినట్లు తెలిపింది. దక్షిణ కొరియాలోని విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, విద్యుత్ కేంద్రాలు వంటి కీలక లక్ష్యాలను ధ్వంసం చేసే సామర్థ్యం ఈ ఆయుధాలకు ఉందని ఉత్తర కొరియా ప్రకటించింది. కాగా, దీనికి ప్రతిస్పందనగా దక్షిణ కొరియా ప్రభుత్వం తమ డ్రోన్ యుద్ధ సామర్థ్యాన్ని భారీగా పెంచనున్నట్లు ప్రకటించింది. 20 వేలకుపైగా నిఘా, దాడి డ్రోన్లను సమకూర్చుకోవడంతో పాటు, ఐదు లక్షల మంది సైనికులకు డ్రోన్ నిర్వహణలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. రష్యా నుంచి ఉత్తర కొరియాకు సైనిక సాంకేతిక సహకారం అందుతున్న నేపథ్యంలో ఈ చర్యలు అవసరమయ్యాయని రక్షణ మంత్రి ఆన్ గ్యూబాక్ తెలిపారు. 2019లో అమెరికాతో అణు చర్చలు విఫలమైన తర్వాత కిమ్ జోంగ్ ఉన్ అణ్వాయుధాలతో పాటు సంప్రదాయ ఆయుధ సంపత్తిని కూడా వేగంగా విస్తరిస్తున్నట్టు సమాచారం. ఈ పరిణామాలతో కొరియా ద్వీపకల్పంలో భద్రతా పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి

## ఎఐ సహకార ప్రకటనపై భారత్ సహా 35 దేశాల సంతకాలు

**వాషింగ్టన్ :** కృత్రిమ మేధస్సు (ఎఐ) సాంకేతికతలకు అవసరమైన విశ్వసనీయ, బలమైన సరఫరా వ్యవస్థల నిర్మాణానికి అమెరికా చేపట్టిన 'పాక్స్ సిలికా' కార్యక్రమానికి భారత్‌తో పాటు 35 దేశాలు మద్దతు ప్రకటించాయి. వాషింగ్టన్‌లో జరిగిన రెండో పాక్స్ సిలికా సదస్సులో 'ఎఐ అవకాశాలపై ఉమ్మడి ప్రకటన'పై ఆయా దేశాలు సంతకాలు చేశాయి. ఈ సదస్సులో భారత్ తరపున ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్, విదేశాంగ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నాగరాజ నాయుడు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. సెమీకండక్టర్లు, ఎఐ, సాంకేతిక సరఫరా వ్యవస్థల బలోపేతంపై ఇతర దేశాలతో చర్చలు జరిపారు.

# బంగ్లాదేశ్ కొత్త ప్రభుత్వానికి చైనా మద్దతు

**బీజింగ్ :** బంగ్లాదేశ్ కొత్త ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని చైనా అధ్యక్షుడు క్జీ జిన్‌పింగ్ స్పష్టం చేశారు. ఐదు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా బీజింగ్‌లో పర్యటిస్తున్న బంగ్లాదేశ్ ప్రధానమంత్రి తారిఖ్ రహ్మాన్‌తో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన ఈ హామీ ఇచ్చారు. బీజింగ్‌లోని 'గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్'లో జరిగిన ఈ భేటీలో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఇరువురు నేతలు చర్చించారు. 'బెల్ట్ అండ్ రోడ్' కార్యక్రమంలో నాణ్యమైన భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు చైనా సిద్ధంగా ఉందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. హరితాభివృద్ధి,



తక్కువ కార్బన్ ఉద్గార సాంకేతికత, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఎఐ) తదితర రంగాల్లో సహకారాన్ని పెంచాలని ప్రతిపాదించారు. అంతకుముందు రహ్మాన్ చైనా జాతీయ ప్రజా కాంగ్రెస్ స్థాయీ సంఘం ఛైర్మన్ జావో లెజీతో సమావేశమయ్యారు. గురువారం చైనా ప్రధాని లీ కియాంగ్‌తో జరిగిన చర్చల అనంతరం రెండు దేశాలు 13 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అలాగే తీస్తా సహా ఇతర నదుల నిర్వహణలో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని కూడా ఇరు దేశాలు అంగీకరించాయి.

## సంజయ్ జాజు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలోని ఇండస్ట్రీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి , సిఇఒగా, 'స్పీడ్' వ్యవస్థ పర్యవేక్షించనున్నారు. పారిశ్రామిక పెట్టుబడులు, ఐటీ రంగం, ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ప్రభుత్వ సేవల వేగవంతమైన అమలు వంటి కీలక అంశాలు ఇకపై ప్రధాన కార్యదర్శి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉండనున్నాయి. దీంతో రాష్ట్ర పరిపాలనలో సమన్వయం మరింత బలోపేతం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

**సంజయ్ వైపే మొగ్గుచూపిన ప్రభుత్వం:** కేంద్ర సర్వీసులో ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శిగా ఉన్న సంజయ్ జాజును తెలంగాణ రాష్ట్రానికి పంపుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్నది.కొత్త ప్రధాన కార్యదర్శి పోస్టుకు సంజయ్ జాజుతో పాటు సీనియర్ ఐఎఎస్ అధికారి జయేశ్ రంజన్ పేరును కూడా పరిశీలించినప్పటికీ సంజయ్ జాజుకే ప్రాధాన్యత ఇచ్చారు. 1992 బ్యాచ్ కు చెందిన ఐఎఎస్ అధికారి సంజయ్ జాజు కేంద్ర సర్వీసు నుంచి ఇటీవలే తెలంగాణ క్యాడర్‌కు తిరిగొచ్చారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ సబ్ కలెక్టర్‌గా, పశ్చిమ గోదావరి కలెక్టర్‌గా,హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా,కమిషనర్, ఎపి పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా, సహాయ పునరావాస నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి శాఖ కమిషనర్‌గా ఎపిఐఐసి విసి,అండ్ ఎండిగా,ఉమ్మడి రాష్ట్రంలో ఐటి ముఖ్య కార్యదర్శిగా కూడా పనిచేశారు. అనంతరం కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లారు. నేషనల్ హైవే అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా,కేంద్ర డిఫెన్స్ అడిషనల్ సెక్రెటరీగా పనిచేశారు. కాగా సంజయ్ జాజు 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో ఉండనున్నారు.

**ఢిల్లీ నుంచి తెలంగాణకు:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు వరకు మొత్తంగా ఏడు మంది ఐఎఎస్ అధికారులు కూడా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ శాఖల బాధ్యతలను నిర్వహించిన వారే ఉన్నారు. రాష్ట్రం ఏర్పడిన, బిఆర్ఎస్ (టిఆర్ఎస్) అధికారంలోనికి వచ్చినప్పుడు మొదటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రాజీవ్ శర్మ ఉన్నారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంలో వివిధ హోదాలల పనిచేసిన ఐఎఎస్ అధికారులు కెపి కె.ప్రదీప్‌చంద్ర, ఎస్.పి. సింగ్, డాక్టర్ ఎస్.కె. జోషి, సోమేశ్ కుమార్, ఎ.శాంతికుమారి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత కె.రామకృష్ణారావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయన తర్వాత కూడా జయేశ్ రంజన్ లేదా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ హోదాలలో ఉన్న సీనియర్ ఐఎఎస్ అధికారులకే ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా నియమించే అవకాశాలు ఉంటాయని భావించారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ ముఖ్యమైన శాఖలతో పాటు కేంద్ర సర్వీసులో పనిచేసిన జాజుకు ఉన్న అనుభవం తమకు ఉపయోగపడుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

### సిఎం సలహాదారునిగా రామకృష్ణారావు

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును రాష్ట్ర ప్రభుత్వం 'ముఖ్యమంత్రి సలహాదారు'గా నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ఎం. రఘునందన్ రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్న రామకృష్ణారావు, రిటైర్ అయిన వెంటనే ముఖ్యమంత్రికి సలహాదారుతో పాటు 'ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ'గా కొత్త బాధ్యతలను స్వీకరించనున్నారు. ఆయన నియామక కాలపరిమితి, జీతభత్యాలు, ఇతర సేవా నిబంధనలు, షరతులను విడిగా ఉత్తర్వులను జారీ చేయనున్నారు. రాష్ట్ర పరిపాలనలో సుదీర్ఘ అనుభవం కలిగిన కె. రామకృష్ణారావు ముఖ్యమంత్రి కార్యాలయానికి అనుబంధంగా కొనసాగడం ద్వారా ప్రభుత్వ కీలక విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో మరింత సమన్వయం సాధించే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## దుష్ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి కె.రాజ్‌కుమార్ ఇటీవలి కాలంలో సింగరేణిలో జరుగుతున్న పరిణామాలపై మాట్లాడారు. సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బొగ్గు నిల్వలపై ప్రతి ఆర్థిక సంవత్సరం ముగింపులో జరిగే అంశమని, దీనిపై సింగరేణి సంస్థను ఇప్పటికే హెచ్చరించామన్నారు. ఈ విషయాలతో తమకేమీ సంబంధంలేదని, హరీష్ రావుతో కూడా తనకు ఎలాంటి పంచాయతీ లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే టిజిబికెఎస్ యూనియన్ పంచాయతీ కోసం సింగరేణి సంస్థ ప్రతిష్టను దెబ్బతీయొద్దని, కార్మికులను అవమానించినట్టుగా మాట్లాడొద్దని ఆయన అన్నారు. ప్రస్తుతం బిఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ అప్పట్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న సమయంలో బిఆర్ఎస్ హయంలో సింగరేణి సంస్థలో 75 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని కేంద్ర విజిలెన్స్ కమిషనర్ కె.చౌదరికి లేఖ రాశారని, ఆ స్కామ్‌కు 'లైక్ సత్యం స్కామ్' అని ఆయన పేరు పెట్టారని, దీనిపై హరీష్‌రావు సమాధానం చెప్పాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

**రాజకీయ స్వార్థం కోసమే టిబిజికెఎస్ ఏర్పాటు**

తెలంగాణ ఉద్యమ సమయంలో కేవలం రాజకీయ లబ్ధి కోసమే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని (టిబిజికెఎస్)బిఆర్ఎస్ ఏర్పాటు చేసిందని, అనంతరం దానిని మూసివేశారని సాంబశివరావు గుర్తు చేశారు. కానీ1948లో ప్రారంభమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఇప్పటికీ కార్మికుల పక్షాన పోరాటం చేస్తూనే ఉందని, కార్మికులకు అండగా నిలబడుతున్నదని అన్నారు. కార్మికుల హక్కుల పోరాటంలో అనేక మంది నాయకులు, కార్మికులు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ఒకటి రెండు సార్లు మాత్రమే టిజిబికెఎస్ గెలిచిందని, మిగతా అన్ని సందర్భాల్లో తమ యూనియనే గెలిచిందన్నారు. ఓడిపోయిన టిజిబికెఎస్ నాయకులు వెంటనే ఇతర యూనియన్లకు వెళ్ళిపోయారని, కానీ ఎంత మంది చనిపోయినా, ఇబ్బందుకు ఎదురైనా తాము జెండా మార్చలేదని ఆయన వివరించారు.

**గనులు, కార్మికులు తగ్గడానికి బిఆర్ఎస్సే కారణం**

సింగరేణి సంస్థలో గనులు, కార్మికుల సంఖ్య తగ్గిపోవడానికి ముఖ్య కారణం గతంలోని బిఆర్ఎస్ ప్రభుత్వమేనని కూనంనేని సాంబశివరావు చెప్పారు. గతంలో దేశంలో ఎక్కడ గనులు ఉన్నా వాటిపై కేవలం సింగరేణి సంస్థకే అధికారం ఉండేదని, కానీ 2015లో గనుల వేలం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎంఎండిఆర్‌ఎ చట్టంతో పలు గనులపై ప్రైవేట్ సంస్థలకు అధికారం దక్కిందని, అందుకు అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా మద్దతు ప్రకటించిందనే విషయం బిఆర్ఎస్ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. ఫలితంగా సింగరేణి ఊపిరి తీసినట్టు అయ్యిందని, ఆ తర్వాత వేలంలో పాల్గొనవద్దని వదిలేశారని, అలా రెండు గనులను కోల్పోయామన్నారు. సింగరేణి ఉన్నా కొన్ని గనులను ప్రవేట్ సంస్థలకు ఇచ్చారన్నారు. ఇదిలా ఉండగా, రాజకీయాల కోసం నేతలు మాట్లాడుతుంటారని, ఏ ముఖ్యమంత్రి అయినా తన రాష్ట్ర నీటి వాటాలు వదులుకోవడానికి సిద్ధంగా ఉండరని సింబశివరావు ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. సీతారామయ్య మాట్లాడుతూ ప్రస్తుతం రాజకీయ పార్టీలు సింగరేణి సంస్థను రాజకీయ వేదికగా వాడుకుంటున్నారని విమర్శించారు. బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీలు సింగరేణిపై మొసలి కన్నీరు కారుస్తున్నాయని, అసలు సింగరేణి సంస్థకు ఈ పార్టీలు ఏం చేశాయో చెప్పాలని సవాల్ చేశారు. బిఆర్ఎస్ హయంలో సింగరేణి సంస్థకు రూ.26 వేల కోట్లు అప్పు పెట్టిపోతే, దానిపై ప్రస్తుత డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మంచిర్యాలలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి కెసిఆర్‌ను ప్రశ్నించారని, కానీ ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.26 వేల కోట్ల అప్పులను రూ.56 వేల కోట్లకు పెంచిందని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం సింగరేణి కార్మికుల, యాజమాన్యం ప్రతిష్టను దెబ్బతీయొద్దని హితవు పలికారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ 11 ఏరియాల్లో (జిల్లాల్లో) విస్తరించి ఉన్న సింగరేణి ప్రాంతంలో రాజకీయంగా లబ్ది పొందేందుకు హరీష్‌రావు వర్కర్స్ యూనియన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇకనైనా రాజకీయ నేతలు సింగరేణిలో రాజకీయ జోక్యం తగ్గించి, సింగరేణిని పరిరక్షించాలని కోరారు.

### బిఆర్ఎస్‌తోనే సింగరేణిలో రాజకీయ జోక్యం మొదలైంది

సింగరేణి సంస్థలో 2014 కంటే ముందు రాజకీయ జోక్యం లేదని, బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే సంస్థలో రాజకీయ జోక్యం మొదలైందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అది మరింతగా విస్తరించిందని సాంబశివరావు ఆగ్రహవ వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో కెసిఆర్ 11 గనులు ఉన్న సింగరేణి సంస్థను 30 గనులుగా అభివృద్ధి చేయడంతో పాటు 67 వేలు ఉన్న కార్మికుల సంఖ్యను 1 లక్షకు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల హయంలో గనుల సంఖ్యను పెంచకపోగా, కార్మికుల సంఖ్య 40 వేలకు తగ్గిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## శిథిలాల కిందే

(మొదటి పేజీ తరువాయి)

కనిపిస్తుండగా, సహాయక సిబ్బంది సజీవంగా బయటకు తీసుకువస్తున్న దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరోచోట శిథిలాల కింద చిక్కుకున్న యువకుడిని రక్షించగా, అక్కడున్న ప్రజలు చప్పట్లతో స్వాగతించారు. అయితే మరికొన్ని ప్రాంతాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల కోసం విలపించడం, కుటుంబ సభ్యుల మృతదేహాలను చూసి కుప్పకూలిపోవడం హృదయ విదారక దృశ్యాలుగా మారాయి. కారకాస్‌లో వందలాది కుటుంబాలు భయంతో రాత్రంతా పార్కులు, ఖాళీ ప్రదేశాల్లోనే గడిపాయి. మొబైల్, టెలిఫోన్ సేవలకు అంతరాయం ఏర్పడటంతో విదేశాల్లో ఉన్న వెనెజులా వాసులు తమ కుటుంబ సభ్యుల క్షేమ సమాచారం తెలుసుకోలేక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తప్పిపోయిన వారి ఫొటోలతో పోస్టర్లు, చేతితో రాసిన పేర్ల జాబితాలు నగర వీధుల్లో కనిపిస్తున్నాయి. తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. దెబ్బతిన్న ఆసుపత్రులు, గృహాల పునర్నిర్మాణం కోసం 200 మిలియన్ డాలర్ల ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. భారీ నిర్మాణ యంత్రాలను సహాయక చర్యలకు అందించాలని ప్రైవేట్ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. 'సాధ్యమైనంత ఎక్కువ మందిని ప్రాణాలతో రక్షించడమే మా ప్రధాన లక్ష్యం' అని మీడియాతో మాట్లాడుతూ ఆమె అన్నారు. భూకంపాల కేంద్రం కారకాస్‌కు పశ్చిమాన సుమారు 170 కిలోమీటర్ల దూరంలోని కరీబియన్ తీర ప్రాంతం సమీపంలో ఉన్నట్లు అమెరికా భూగర్భ సర్వే వెల్లడించింది. వరుసగా సంభవించిన రెండు భూకంపాలు, భూమికి సమీపంలోనే ప్రకంపనలు ఏర్పడటం వల్ల విధ్వంసం తీవ్రత, నష్ట పరిమాణం మరింత పెరిగాయని భూకంప నిపుణులు తెలిపారు. ఇదిలా ఉండగా అమెరికా, చిలీ, స్విట్జర్లాండ్, మెక్సికో, టర్కీ, బ్రెజిల్, కెనడా, స్పెయిన్, పోర్చుగల్, డొమినికన్ రిపబ్లిక్ తదితర దేశాలు సహాయక బృందాలు, వైద్య సిబ్బంది, అత్యవసర సామగ్రిని వెనెజులాకు పంపుతున్నట్లు ప్రకటించాయి. అంతర్జాతీయ సహకారంతో సహాయక చర్యలు వేగవంతమవుతున్నప్పటికీ, శిథిలాల కింద ఇంకా వేలాది మంది చిక్కుకుపోయి ఉండవచ్చన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

## డ్రగ్స్ రహితమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటామని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

**సమాజంలో మార్పు రావాలి**

కేవలం చట్టాలు చేసినంత మాత్రాన అన్నీ అమలు కావని, సమాజంలో మార్పు రావాలని డిప్యూటీ సిఎం అభిప్రాయపడ్డారు. గతంలో వచ్చిన వరకట్న నిషేధ చట్టాన్ని ఉదాహరణగా చెప్తూ, కుటుంబాలు సామాజికంగా దాన్ని అర్థం చేసుకున్నప్పుడే విజయవంతం అవుతుందన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో కౌన్సెలింగ్ ఇస్తూనే, సమాజాన్ని ప్రభావితం చేయగల నాయకులు, సెలబ్రిటీలు ఇచ్చే చిన్న సందేశం అనేకమంది యువతీయువకుల భవిష్యత్తును మారుస్తుందని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మాకూ బాధ్యత ఉందని భావించి, సినీ ప్రముఖులంతా 'సే నో టు డ్రగ్స్' పై వీడియో రికార్డెడ్ సందేశాలు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. అవసరమైతే ఇన్ఫర్మేషన్ డిపార్ట్మెంట్, సినిమాటోగ్రఫీ శాఖ అధికారులను మీ వద్దకు పంపి ఆ సందేశాలను రికార్డ్ చేయించి, రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయడానికి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. పోలీస్ యంత్రాంగం, మహిళా, శిశు సంక్షేమం, విద్యా శాఖలు ముఖ్యంగా 'ఈగిల్ ఫోర్స్'కు ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు.

**ప్రతి పౌరుడు భాగస్వామి : మంత్రి పొన్నం**

అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వం ఒక్కటే కాకుండా ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని అన్నారు. గ్రామాల నుంచి నగరాల వరకు యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక యంత్రాంగంతో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వ్యతిరేక వాలంటీర్లుగా మారాలని,ఎక్కడైనా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ప్రజాప్రతినిధులు,క్రీడాకారులు,సినీ ప్రముఖులు,అధికారులు,సామాజిక కార్యకర్తలు కలిసి యువతలో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు.చెడు మార్గం ఆకర్షణీయంగా కనిపించినా దాని ఫలితం వినాశనమేనని,మంచి మార్గంలో నడవడం ద్వారా మాత్రమే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజం సురక్షితంగా ఉంటాయని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో యువత సైనికుల్లా ముందుండి సమాజాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం ముగింపులో డ్రగ్స్ నిర్మూలన కోసం కృషి చేస్తున్న ఈగల్ ఫోర్స్,పోలీసు శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ తో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల సేవలను అభినందిస్తూ, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా సినీ నటుడు రామ్ పోతినేని,సినీ నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని, చదువులో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే విధంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి,ఇతర ఉన్నతాధికారులు,విద్యార్థులు,పలువురు పాల్గొన్నారు.

## 8 మంది అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

చేశామని, దర్యాప్తులో భాగంగా వారిని విచారిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. అయోధ్య ఎస్ఎస్‌పి గౌరవ్ గ్రోవర్ పిటిఐ మాట్లాడుతూ, నిందితులు అదుపులో ఉన్నారని, కేసు గురించి ప్రాథమిక విచారణ అనంతరం వారిని కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదైన వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామశంకర్ యాదవ్ (అలియాస్ తిన్ను) ఉన్నారు. వీరంతా ఆలయానికి వచ్చిన నగదు, విలువైన వస్తువులను లెక్కించే ప్రక్రియలో పాలుపంచుకున్నారని ఒక అధికారి తెలిపారు. నిందితులందరూ అయోధ్యలోనే ఉన్నారని, గురువారం అర్ధ రాత్రి వారిని విచారణ కోసం అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. కాగా, రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగంపై వివాదం ఈనెల 7న వెలుగులోకి వచ్చింది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అభ్యర్థన మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 13న ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఈ బృందం 23న ప్రభుత్వానికి తన ప్రాథమిక నివేదికను సమర్పించింది. సిట్ సిఫార్సుల ఆధారం గా ఈనెల 25 రాత్రి ఎఫ్ఐఆర్ నమోదైంది. నిందితుల అరెస్టును అయోధ్య పోలీసులు శుక్రవారం ధృవీకరించారు. 7న సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఈ విషయాన్ని లేవనెత్తినప్పటి నుండి, కొంతమంది నిందితుల పేర్లు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నాయి. ఆ తర్వాత ఇది ఒక పెద్ద రాజకీయ వివాదంగా మారడంతో, విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి), ఆమ్ ఆద్మీ పార్టీలు కూడా క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాయి.

**దోషులుగా తేలిన వారిని ఎవరినీ వదలం : సిఎం**

అయోధ్యలోని రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదిక సమర్పించిన వెంటనే నిందితులపై పోలీసు చర్యలు ప్రారంభమయ్యాయని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం తెలిపారు. ఎనిమిది మందిని యుపి పోలీసులు అరెస్టు చేసిన తర్వాత, డియోరియాలో జరిగిన ఒక సమావేశంలో సిఎం మాట్లాడుతూ దోషులుగా తేలిన వారిని ఎవరినీ వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ 'నిరాశ' కారణంగా రామ భక్తులను లక్ష్యంగా చేసుకోవడానికి, అయోధ్య ప్రతిష్టను దెబ్బతీయడానికి చేస్తున్న ప్రయత్నమే ఈ వివాదమని ఆదిత్యనాథ్ అభివర్ణించారు. 'వారికి ఇంకేమీ దొరకనప్పుడు, ప్రజల విశ్వాసంతో ఆటలాడటం మొదలుపెట్టారు. వారు రామ భక్తులపై ఆరోపణలు చేస్తూ, అయోధ్య ధామ్ ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారు' అని ఆయన అన్నారు. దర్యాప్తు ప్రక్రియ నిపుణుల పర్యవేక్షణలో జరుగుతోందని పేర్కొన్న ముఖ్యమంత్రి, దర్యాప్తు జరుగుతున్న సమయంలో రాజకీయ వాదోపవాదాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, ట్రస్టీ రాజీనామా

అయోధ్యలోని రామమందిరానికి వచ్చిన విరాళాలను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో, శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ మరియు ట్రస్టీ అనిల్ మిశ్రా నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత ఈ రాజీనామాలు జరిగాయని సంబంధిత వర్గాలు మీడియాకు తెలిపారు.

# శతక్కొట్టిన జురెల్.. పోరాడుతున్న శ్రీలంక–'ఎ'







అనధికారిక టెస్టులో భారత ఏ జట్టు కెప్టెన్ ధ్రువ్ జురెల్(141 నాటౌట్) శతకంతో రెచ్చిపోయాడు. సుదీర్ఘ ఫార్మాట్లో తనకున్న ఇష్టాన్ని పరుగుల రూపంలో చూపించగా.. శ్రీలంక ఏ బౌలర్లు కుదేలయ్యారు. భారీ స్కోర్ కొట్టిన టీమిండియా 452/6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడమే ఆలస్యం బౌలర్లు ప్రత్యర్థిని ఆదిలోనే దెబ్బతీశారు. నువనిందు ఫెర్నాండో(65 నాటౌట్) అర్ధ శతకంతో మెరవగా.. రెండు వికెట్ల నష్టానికి 113 రన్స్ కొట్టింది లంక ఏ. గాలే స్టేడియంలో జరుగుతున్న మొదటి అనధికారిక టెస్టులో భారత ఏ జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. కెప్టెన్ ధ్రువ్ జురెల్(141 నాటౌట్) శతకంతో రెండో రోజు టీ అనంతరం తొలిరోజు 452/6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన టీమిండియా.. ప్రత్యర్థిని దెబ్బకొట్టింది. ఓపెనర్ నిరోషన్ డిక్వెల్(10)ను ఔట్ చేసిన అన్షుల్ కంభోజ్ లంకకు షాకిచ్చాడు. మరో ఎండ్లో అకీబ్ నబీ కట్టడి చేయగా.. యశ్ ఠాకూర్ ఓవర్లో పవంత వీరసింఘే వెనుదిరిగాడు. 38కే రెండు వికెట్లు పడిన వేళ.. నువనిందు ఫెర్నాండో(65 నాటౌట్), అషెన్ బండార(18 నాటౌట్) క్రీజునంటుకుపోయారు.

**తొలి వికెట్‌కు 92 రన్స్...** ఓపెనర్ సాయి సుదర్శన్(132), ఆయుష్ పాండే(25)లు భారత ఏ జట్టుకు శుభారంభమిచ్చారు. తొలి వికెట్కు 92 రన్స్ జోడించిన సాయి.. ఆ తర్వాత దేవ్దత్ పడిక్కల్(12), రుతురాజ్ గైక్వాడ్(22)లతో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. అనంతరం షేక్ రషీద్(63), ధ్రువ్ జురెల్(141 నాటౌట్) మెరవగా.. తొలి రోజే 4 వికెట్ల నష్టానికి 333 రన్స్ కొట్టిన భారత్.. రెండో రోజూ జోరు చూపింది. హర్ష్ దూబే(30)తో కలిసి లంక బౌలర్లను విసిగించిన జురెల్ స్కోర్ నాలుగొందలు దాటించాడు. దూబేను గుణశేఖర( 384) ఔట్ చేశాక ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

# జర్మనీపై ఈక్వెడార్ స్టన్నింగ్ విక్టరీ




ఫిఫా వరల్డ్ కప్‌లో రౌండ్ 32 నాకౌట్లో చోటు సంపాదించింది ఈక్వెడార్. ఫిఫా వరల్డ్ కప్‌లో భాగంగా న్యూజెర్సీలో జర్మనీతో జరిగిన మ్యాచ్‌లో 2–1 గోల్స్ తేడాతో ఈక్వెడార్ స్టన్నింగ్ విక్టరీ కొట్టింది. అయితే మూడవ స్థానంలో ఉన్న టాప్ 8 జట్లు కూడా రౌండ్32కు అర్హత సాధించే విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రౌండ్32లో ఇంగ్లండ్‌తో ఈక్వెడార్ ఆడే అవకాశాలు ఉన్నాయి.

ఇక బలమైన జర్మనీ జట్టును అనూహ్య రీతిలో ఈక్వెడార్ ఓడించింది. జర్మనీ ఇప్పటికే రెండు విక్టరీలతో నాకౌట్ దశకు క్వాలిఫై అయ్యింది. గ్రూపు ఈ నుంచి ఐవరీ కోస్టు కూడా నాకౌట్‌కు వెళ్లింది. జర్మనీ ప్లేయర్ సేన్ రెండో నిమిషంలోనే గోల్ చేసి ఆ జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. కానీ ఈక్వెడార్ ప్లేయర్ నీల్సన్ ఆంగులో 9వ నిమిషంలో గోల్ చేసి స్కోరును సమం చేశాడు. సెకండ్ హాఫ్లో జర్మనీకి పెనాల్టీ వచ్చినా.. దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. అయితే ఆఖరి క్వార్టర్లో మ్యాచ్ అనూహ్యంగా మలుపు తిరిగింది. 77వ నిమిషంలో ఈక్వెడార్ ప్లేయర్ గొంజాలెజ్ ప్లాటా గోల్ చేసి ఆ జట్టుకు విజయాన్ని అందించాడు. అయితే మూడవ స్థానంలో ఉన్న బెస్ట్ 8 టీమ్స్ కూడా నాకౌట్ వెళ్తాయి. ఈక్వెడార్ ఆ కేటగిరీలో నాకౌట్‌కు వెళ్లింది.

## అమెరికాపై నెగ్గిన టర్కీ

ఫిఫా వరల్డ్ కప్‌లో టర్కీ తొలి విజయాన్ని నమోదు చేసింది. వాస్తవానికి టోర్నీ నుంచి ఎలిమినేట్ అయిన ఆ జట్టు .. లాస్ ఏంజిల్స్ స్టేడియంలో హోస్ట్ అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో 3–2 గోల్స్ తేడాతో నెగ్గింది. గ్రూప్ డీ మ్యాచ్‌లో మొత్తం అయిదు గోల్స్ నమోదు అయ్యాయి. ఈ మ్యాచ్‌లో అమెరికా ఓడినా.. ఆ గ్రూపులో మాత్రం ఆ దేశమే అగ్రస్థానంలో ఉన్నది. ఆట ప్రారంభమైన మూడు నిమిషాలకే అమెరికా ప్లేయర్ ఆస్టన్ ట్రస్టీ గోల్ కొట్టాడు. డీప్ కార్నర్ నుంచి సెబాస్టియన్ అందించిన పాస్ను లెఫ్ట్ ఫూట్తో ట్రస్టీ గోల్గా మలిచాడు. టోర్నీ నుంచి ఎలిమినేట్ అయినా.. అమెరికాతో మ్యాచ్‌లో మాత్రం టర్కీ పట్టుదలతో ఆడింది. ఇక టర్కీ ప్లేయర్ గులేర్ 10వ నిమిషంలో ఆ జట్టుకు తొలి గోల్ అందించాడు. అరగంట ఆట ముగిశాక.. టర్కీ ప్లేయర్ బారిస్ యిల్మాజ్ మరో గోల్ చేశాడు. దీంతో టర్కీ లీడింగ్లోకి వెళ్లింది. రెండో హాఫ్ 49వ నిమిషంలో అమెరికా ప్లేయర్ బెర్హాల్టర్ గోల్ చేసి ప్రేక్షకుల్లో ఉత్కంఠ రేపాడు. దాదాపు ఆట ముగిసే సమయం వరకు రెండు జట్లు 2–2 గోల్స్ తేడాతో సమంగా పోరాడాయి. కానీ 98వ నిమిషంలో టర్కీ ప్లేయర్ అందర్నీ స్టన్ చేశాడు. కాన్ అయాన్ గోల్ చేయడంతో కీలకమైన మూడు పాయింట్లు టర్కీ ఖాతాలోకి వెళ్లాయి. అమెరికా జట్టు ఈ టోర్నీలో చరిత్ర సృష్టిస్తోంది. ఫుట్బాల్ వరల్డ్కప్ ఈవెంట్లో ఇప్పటికే 8 గోల్స్ చేసింది. గతంలో 1930, 2002లో అత్యధికంగా ఏడు గోల్స్ మాత్రమే చేసింది.

# సైన్స్



## గెలాక్సీలకూ ఓ మ్యాప్


భూమికి సంబంధించిన మ్యాప్‌లు ఉన్నాయని మనకు తెలుసు. అయితే, గెలాక్సీలకూ ఒక మ్యాప్ ఉందనేది ఆశ్చర్యం కలిగించే వాస్తవం. మన గెలాక్సీలో ఉన్న పదార్థం ఎలా విస్తరించి ఉందో అర్థం చేసుకోవడమనే ఖగోళ శాస్త్ర లక్ష్యాన్ని అందుకోవడానికి ఇటీవల శాస్త్రవేత్తలు మన గెలాక్సీలోని వాయు నిర్మాణాలను అత్యంత స్పష్టంగా చూపించే ఒక విశాలమైన మ్యాప్‌ను రూపొందించారు. ఈ మ్యాప్‌లో విశ్వంలో కనిపించే సన్నని వాయు ప్రవాహాలను స్పష్టంగా గుర్తించారు. ఈ ప్రవాహాలను సాధారణంగా కాస్మిక్ గ్యాస్ ఫిలమెంట్స్ అని పిలుస్తారు. ఇవి విశ్వంలో పదార్థం కదిలే పొడవైన దారుల్లా కనిపిస్తాయి. శాస్త్రవేత్తలు వాటిని పదార్థపు నదులు లాగా పోలుస్తున్నారు. ఈ నిర్మాణాలు మన గెలాక్సీ అయిన 'మిల్కీ వే' (పాలపుంత)లో పదార్థం ఎలా ప్రవహిస్తున్నదో అర్థం చేసుకోవడానికి సహాయపడుతున్నాయి. ఈ ఫిలమెంట్లు ప్రధానంగా వాయు, ధూళి పదార్థంతో ఏర్పడిన పొడవైన నిర్మాణాలు. కొన్ని ఫిలమెంట్లు వందల కాంతి సంవత్సరాల పొడవు వరకు విస్తరించి ఉంటాయి. ఇవి సాధారణంగా గెలాక్సీ అంతటా సన్నని నాళాల్లా వ్యాపించి ఉంటాయి. ఈ ప్రాంతాల్లో వాయు ఘనత్వం ఇతర ప్రాంతాల కంటే ఎక్కువగా ఉండడం వల్ల కొత్త నక్షత్రాలు ఏర్పడే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఫిలమెంట్లు నక్షత్రాల జన్మస్థలాలకు దారితీసే మార్గాలుగా పేర్కొంటున్నారు. ఈ పరిశోధన ద్వారా గెలాక్సీలో పదార్థం ఎలా కూడి నక్షత్రాలుగా మారుతుందో శాస్త్రవేత్తలు మరింత స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు. ఈ మ్యాప్‌ను రూపొందించడానికి శాస్త్రవేత్తలు శక్తివంతమైన రేడియో టెలిస్కోపులు, ఇతర ఖగోళ పరిశీలనా పరికరాలను ఉపయోగించారు. ఈ పరికరాలు అంతరిక్షంలో ఉన్న హైడ్రోజన్ వాయువు నుంచి వచ్చే సంకేతాలను గుర్తిస్తాయి. ఆ సంకేతాలను విశ్లేషించడం ద్వారా వాయు నిర్మాణాల ఆకృతి, పరిమాణం, దిశలను గుర్తించవచ్చు. ఈ విధంగా గెలాక్సీలో వ్యాపించిన వాయు ప్రవాహాలను ఒక పెద్ద మ్యాప్ రూపంలో రూపొందించారు. ఈ పరిశోధన గెలాక్సీ నిర్మాణాన్ని అర్థం చేసుకోవడంలో ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. విశ్వంలో పదార్థం ఎలా కదులుతుందో, నక్షత్రాలు ఎలా పుడతాయో తెలుసుకోవడానికి ఈ కొత్త గెలాక్సీ మ్యాప్ ఖగోళ శాస్త్రానికి ఒక ముఖ్యమైన సమాచార వనరుగా నిలుస్తోంది.

## విశ్వంలో వింత గ్రహం



ఖగోళ పరిశోధనల్లో అప్పుడప్పుడు శాస్త్రవేత్తల అంచనాలను పూర్తిగా మార్చివేసే గ్రహాలు కనిపిస్తాయి. అలాంటి విచిత్రమైన ఉదాహరణగా ఇటీవల కనుగొన్న గ్రహం ఎల్‌టిటి 9779బి. ఈ గ్రహం తన ప్రవర్తనతో ఖగోళ శాస్త్రవేత్తలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సాధారణంగా గ్రహాలు తమపై పడే నక్షత్ర కాంతిలో కొంత భాగాన్ని మాత్రమే తిరిగి ప్రతిఫలిస్తాయి. అయితే ఈ గ్రహం తనపై పడే కాంతిలో దాదాపు 80 శాతం వరకు తిరిగి ప్రతిఫలిస్తోంది. అందువల్ల ఇది అంతరిక్షంలో ఒక భారీ అద్దంలా మెరుస్తున్నట్లు కనిపిస్తుంది. పోలిస్తే మన సౌర కుటుంబంలోని శుక్ర గ్రహం (వీనస్) సూర్యకాంతిలో సుమారు 75 శాతం మాత్రమే ప్రతిబింబిస్తుంది. అంటే ఈ కొత్త గ్రహం కాంతిని ప్రతిఫలించే సామర్థ్యం ఇంకా ఎక్కువగా ఉంది. ఈ గ్రహ కక్ష్య కూడా అసాధారణంగా ఉంది. ఇది తన తల్లినక్షత్రానికి చాలా దగ్గరగా తిరుగుతోంది. ఒక పూర్తి ప్రదక్షిణను పూర్తి చేయడానికి దీనికి ఒక రోజు కూడా పట్టదు. అంటే ఈ గ్రహం తన నక్షత్రం చుట్టూ అత్యంత వేగంగా తిరుగుతోంది. ఈ దగ్గర దూరం కారణంగా దాని పగటి భాగంలో ఉష్ణోగ్రతలు 2000 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి తీవ్ర వేడి పరిస్థితుల్లో సాధారణంగా మేఘాలు ఏర్పడటం చాలా కష్టం. సాధారణంగా వాతావరణంలోని పదార్థాలు వెంటనే ఆవిరైపోతాయి లేదా విచ్ఛిన్నమవుతాయి. కానీ ఈ గ్రహంలో ఆశ్చర్యకరంగా ప్రత్యేకమైన మేఘాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ మేఘాలు సాధారణ నీటి ఆవిరితో ఏర్పడినవి కావు. బదులుగా లోహాలు, సిలికేట్ పదార్థాలతో కూడిన సూక్ష్మ కణాలు వాతావరణంలో తేలుతూ ఉండవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు. టైటానియం లేదా గాజు వంటి పదార్థాలతో కూడిన సూక్ష్మ కణాలు వాతావరణం పైభాగంలో చేరి ఒక ప్రతిబింబించే పొరలా మారవచ్చు. ఈ పొర నక్షత్ర కాంతిని తిరిగి అంతరిక్షంలోకి పంపుతుంది.

## చంద్రయానానికి తహతహ



మనుషులు చివరిసారిగా చంద్రుడిపై అడుగుపెట్టిన తర్వాత దాదాపు ఐదు దశాబ్దాలు గడిచాయి. 1969లో జరిగిన అపోలో 11 మూన్‌లాండింగ్ మానవ చరిత్రలో ఒక గొప్ప మైలురాయి. ఆ తర్వాత కొన్ని చంద్రయానాలు జరిగినప్పటికీ, తరువాత మానవ చంద్రయాత్రలు నిలిచిపోయాయి. ఇప్పుడు మళ్లీ మనుషులను చంద్రుడి వైపు పంపే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' నాయకత్వం వహిస్తున్నది. ఈ లక్ష్యంతో వారు రూపొందిస్తున్న కొత్త అంతరిక్ష నౌక పేరు ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్. ఒరియన్ నౌకను భూమి కక్ష్యను దాటి దూర అంతరిక్ష ప్రయాణాలకు అనుకూలంగా రూపొందించారు. అంతరిక్షంలో ఉండే పరిస్థితులను అనుకరించే థర్మల్ వాక్యూమ్ టెస్ట్ అనే కఠిన పరీక్షను ఇది విజయవంతంగా పూర్తి చేసింది. ఒరియన్ నౌకలో ప్రధానంగా రెండు భాగాలు ఉంటాయి. మొదటిది క్రూ మాడ్యూల్, ఇందులో వ్యోమగాములు ప్రయాణిస్తారు. రెండవది సర్వీస్ మాడ్యూల్, ఇది శక్తి, ఆక్సిజన్, నీరు, ఇంధనాన్ని అందిస్తుంది. ఈ రెండు భాగాలను కలిపి ఒకే అంతరిక్ష నౌకగా సమన్వయం చేయడం ప్రస్తుతం జరుగుతున్న ముఖ్యమైన ప్రక్రియ. ఈ నౌకను ఉపయోగించే ముఖ్యమైన మిషన్ పేరు ఆర్టెమిస్ II. ఇది ఆర్టెమిస్ ప్రోగ్రామ్‌లో రెండవ దశ. ఈ మిషన్‌లో వ్యోమగాములు చంద్రుడి దగ్గరికి వెళ్లి, చంద్రుడి వెనుక భాగం చుట్టూ తిరిగి భూమికి తిరిగి వస్తారు. ఈ ప్రాంతాన్ని చంద్రుడి ఫార్ సైడ్ అంటారు, ఎందుకంటే అది భూమి నుంచి ప్రత్యక్షంగా కనిపించదు. ఈ ప్రయాణం ద్వారా దూర అంతరిక్షంలో మానవ ప్రయాణం ఎంతవరకు సాధ్యమో పరీక్షిస్తారు. ఈ నౌకను అంతరిక్షంలోకి పంపడానికి ఉపయోగించే భారీ రాకెట్ పేరు స్పేస్ లాంచ్ సిస్టమ్. ఆర్టెమిస్ IIను ఏప్రిల్ మాసంలో నిర్వహించించడానికి నాసా సన్నాహాలు చేస్తున్నది. అదేవిధంగా అర్టెమిస్ IIIని 2028లో నిర్వహించనుంది. ఆ తర్వాత, రెండేళ్ల కాలంలో అర్టెమిస్ IV, V ప్రాజెక్టులు ఉంటాయి.

## 'దేశాయి' బీడీ ఫ్యాక్టరీ తరలింపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

సంఘం రాష్ట్ర కార్యదర్శి సుతారి రాములు



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి డివిజన్ కేంద్రంలోని 'దేశాయి' బ్రదర్స్ లిమిటెడ్ బీడీ ఫ్యాక్టరీని కోరుట్లకు తరలించే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, మెట్‌పల్లిలోనే యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని 45 బ్రాంచీల ద్వారా సుమారు 2,500 మంది బీడీ కార్మికులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఫ్యాక్టరీని కోరుట్లకు తరలిస్తే కార్మికులు 10 నుంచి 35 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని, మహిళా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ తరలింపుతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతారని, జిల్లా కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకుని ఫ్యాక్టరీ తరలింపును నిలిపివేసి కార్మికులకు న్యాయంచేయాలని కోరారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎండి మౌలానా, జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత, ఉపాధ్యక్షుడు మునుగోరి హనుమంతు, కోశాధికారి ఎండి ముక్రం,ఎండి అలీ,ఎండి ఉస్మాన్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలు ఉధ్యమాలకు సిద్ధం కావాలి

సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సీతామహాలక్ష్మి




**ప్రజాపక్షం/మణుగూరు :** అంగన్‌వాడీ కార్యకర్తలు ఉధ్యమాలకు సిద్ధం కావాలని సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సీతా మహాలక్ష్మి అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మణుగూరు ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన అంగన్వాడీల సమావేశంలో మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు రూ.18,000 వేతనం వెంటనే అమలు చేయాలని, అర్హులైన ఆయాలకు వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. అంగన్వాడీ సిబ్బందిపై మోపుతున్న అదనపు పనిభారాన్ని తొలగించాలని, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన సేవలకు ఆటంకం కలగకుండా అంగన్వాడీ కేంద్రాల సాధారణ కార్యకలాపాలను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సరెంది పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, నాయకులు వేరుపుల మల్లికార్జున్ ,దుర్గ్యాలసుధాకర్, జక్కుల రాజబాబు, రాయల బిక్షం, తోట రమేష్, ఎడారి, ఎస్‌కే సర్వర్, బి సంపత్, రాములు, పోడం విజయ కుమారి, మడకం అరుణ కుమారీ, భూఖ్య విజయ కుమారి, కేఎంవి రాణి, చంద మంగమ్మ, ముంతాజ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయం ఉపసంహరించుకోవాలి

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి : ఎఐఎస్ఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/వరంగల్:** విద్యార్థులు లేరనే సాకుతో ప్రభుత్వ పాఠశాలలు మూసివేతకు రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ పట్టణంలోని శివనగర్ తమ్మెర భవన్ ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శరత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్భాటంగా ఫ్లెక్సీ పెట్టి, ఫోటో దిగి, బడిబాడ ప్రచారాన్ని నిర్వహిస్తే విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలలకు రారని, ప్రభుత్వ విద్య నిర్వీర్యం అయితే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుకు గురికావాల్సి వస్తుందని, ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలను నియంత్రించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఏదైతే విద్యార్థి వ్యతిరేక విధానాల అవలంబించిందో ఈ ప్రభుత్వం కూడా విద్యార్థి వ్యతిరేక విధానాల్ని అనుసరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 26 వేల పైచిలుకు పాఠశాలలను కుదించి నాలుగువేల పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలని ఆలోచనను విరమించుకోవాలన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించడంలో ప్రభుత్వాలు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ ద్వంద వైఖరిని ప్రదర్శిస్తున్నాయన్నారు. విద్యను సంతలో సరుకుగా మార్చేశాయనీ, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు మార్కెట్ కేంద్రాలుగా తలపిస్తు, విద్యను పూర్తిగా వ్యాపార పరం చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అడ్మిషన్స్ తీసుకుంటే డొనేషన్లు, బుక్స్‌కు, సపరేట్ యూనిఫామ్, సపరేట్ ఫీజులు వసూళ్ల దందాకు తెరలేపాయన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించాలని తల్లిదండ్రుల ఆశను ఆసరాగా మలుచుకుంటున్న కార్పొరేట్ ప్రవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు 25శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని నిబంధనలు ఉన్న ఆ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. జర్నలిస్ట్ పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికల రామకృష్ణ, నాయకులు వరప్రసాద్, గణేష్, రమేష్, రాకేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

విద్యాశాఖ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసాని లెనిన్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తోందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసాని లెనిన్ ఆరోపించారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా ఎఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశానికి ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆజాద్ అధ్యక్షత వహించగా లెనిన్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు లేని అన్ని ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ పాఠశాలలలో బుక్స్, యూనిఫామ్ తదితర వస్తువుల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ వేధిస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిరసనలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. విద్యాశాఖ అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషిచేయాలని కోరారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు మహంకాళి శ్రీవర్ధన్, ఆర్నకొండ ఆదిత్య, జాశ్వంత్, వెంకటేశ్వర్లు, రామగిరి రాజ్ కుమార్, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్యం రక్షణ

క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాలు నిరంతరం పరిశీలించాలి

బిఎల్ఒల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** ఓటర్ల జాబితా పక్కాగా ఉంటేనే ప్రజాస్వామ్యం రక్షణ సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అన్నారు. భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండల పరిధిలోని సిపిఐ మండల కార్యాలయం రజబ్ అలీ భవన్‌లో శుక్రవారం చుంచుపల్లి మండల స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన బిఎల్ఒలను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయో ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ, క్రమబద్ధీకరణపై బిఎల్ఓల విధులపై అవగాహన పెంచుకోవాలని, పోలింగ్ కేంద్రాల పరిధిలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను గుర్తించి కొత్త ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఓటర్ల జాబితా తప్పుల సవరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. సర్ ప్రక్రియలో పార్టీ బిఎల్ఎలు అప్రమత్తంగా ఉండాలని, బిఎల్ఒలకు సహకరిస్తూ సమగ్ర ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు సహకరించాలని సూచించారు. ఓటు నమోదు వ్యవస్థలో బిఎల్ఒల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. ఓటరు జాబితా సవరణలో ప్రతి వ్యక్తి బాధ్యతయుతంగా వ్యవహరించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కోరారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజలకు పూర్తి సహకారం అంధించేందుకు కృషిచేయాలని కోరారు. సమగ్ర ఓటరు జాబితా సవమరణకు ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బిఎల్ఓలు ఇంటింటికి వెళ్ళి ముందుకు ముద్రించిన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తారని, ఇంటి వద్ద ఎవరు లేని పక్షంతో రెండు, మూడు సార్లు సందర్శించేందుకు బిఎల్ఓలు కృషి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తమ విధులను పూర్తి బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళీ, నాయకులు జి.వీరస్వామి, నెరేళ్ల రమేష్, మహేష్, భూక్యా జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే సిపిఐ బలోపేతం

పార్టీ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** పోరాటాలతోనే సిపిఐ బలోపేతమవుతుందని, ఆ మేరకు జిల్లాలో పార్టీని నిర్మాణపరంగా మరింత బలోపేతం చేసేందుకు 28 నుండి మంచిర్యాలలో సిపిఐ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పార్టీ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 28,29,30 తేదీల్లో మూడు రోజుల పాటు మంచిర్యాలలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతుల కార్యక్రమానికి సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని వివరించారు. ఈ తరగతులలో రాజకీయాలపై నైపుణ్యత, అవగాహన గల ఉపాధ్యాయులు, మేధావులు దాదాపు ఎనిమిది మంది పాల్గొంటారని తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో సమకాలీన రాజకీయాలు, భవిష్యత్తు పోరాటాలు, మతోన్మాద రాజకీయాలను ఎదుర్కొనే వ్యూహాలు, దేశ స్వాతంత్ర్య పోరాటంలో సిపిఐ కీలక పాత్ర, ప్రజాసంఘాల నిర్మాణం, పార్టీ నిర్మాణం వంటి పలు ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా చర్చించి అవగాహన కల్పిస్తారని చెప్పారు. శిక్షణ తరగతులలో పార్టీ బలోపేతంపై దృష్టి సారించి, ప్రజాసంఘాలను నిర్మాణపరంగా పటిష్టం చేసేందుకు కార్యచరణ రూపొందించుకుంటామని ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఆదిలాబాద్ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ఆహ్వానితులు ప్రతిఒక్కరూ సకాలంలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. నిర్మల్, కొమురంభీం, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల ప్రతినిధులు తప్పకుండా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, సీనియర్ నాయకులు ఎస్.అరుణ్‌కుమార్, షేక్‌బాషా, బెజ్జంకి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



## బాధ్యతాయుతంగా ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి :** జూన్ 25 నుంచి జూలై 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏలు), కార్యకర్తలకు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జూలై 30న విడుదల కానున్న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా దృష్ట్యా ప్రతి బూత్ పరిధిలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా పనిచేయాలని ఆయన సూచించారు. ప్రస్తుతం బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు) ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలు సేకరిస్తున్న నేపథ్యంలో, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా బిఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కొత్తగా అర్హత పొందిన ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ప్రతి బూత్‌లో కాంగ్రెస్ నాయకులు, బూత్ కమిటీలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఓటర్ల జాబితాపై తలెత్తిన వివాదాల తరహా పరిస్థితులు తెలంగాణలో పునరా వృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

## మత్తు రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

### డిఎస్‌పి ప్రసన్న కుమార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మత్తు రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని డిఎస్‌పి ప్రసన్న కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిఅడిక్షన్ కేంద్రాన్ని పట్టణ సిఐ వెంకటయ్యతో కలిసి ఆయన సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న నలుగురు బాధితులను పరామర్శించి, వారికి పండ్లు పంపిణీ చేశారు. మత్తు అలవాట్లు నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా క్యారమ్స్, చెస్ వంటి ఇండోర్ గేమ్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై యుద్ధం ప్రకటించామని, పాత నేరస్థులపై నిరంతర నిఘా ఉంచామన్నారు. మద్యం తాగిన వారిని గుర్తించినట్లే, గంజాయి సేవించిన వారిని పట్టుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కిట్లను అందించిందని అన్నారు. వ్యసనాల బారిన పడిన యువతను మార్చడానికి డిఅడిక్షన్ కేంద్రం ఎంతో దోహదపడుతుందని, బాధితులు స్వచ్ఛందంగా చేరవచ్చని సూచించారు. మత్తు పదార్థాల సమాచారం కోసం ప్రజల డయల్ 100, 112 లేదా 1908 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని కోరారు. రాష్ట్ర ఈగల్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది, వైద్యులు ఉన్నారు.

## పెండింగ్ పనుల్లో వేగం పెంచండి

### అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** సింగన్నగూడెం 2బిహెచ్‌కె కాలనీలో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం 2బిహెచ్‌కె కాలనీని అదనపు కలెక్టర్ సందర్శించి, కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కాలనీలో నిర్మాణ పనుల పురోగతి, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారులు, డ్రైనేజీ తదితర అంశాలను పరిశీలించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాలనీలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ అలివేలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల మందపై వీధి కుక్కల దాడి

### 23 గొర్రెల మృతి...కన్నీరుమున్నీరైన గొర్రెల కాపరి

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన ఇట్టబోయిన యాదయ్యకు చెందిన గొర్రెల మందపై గురువారం అర్ధ రాత్రి సమయంలో వీధి కుక్కలు దాడి చేయడంతో సుమారు 23 గొర్రెలు మరణించడం జరిగింది. అర్ధరాత్రి గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేసి గొర్రెలను చంపడంతో గొర్రెల కాపరి యాదయ్య కన్నీరు మున్నీరుగా విలపించాడు. విషయం తెలుసుకున్న ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరి గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి రైతులకు 30 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు దశరథగుప్త, మాజీ ఎంపిపి వెంకటేశ్వర్లు, వేణుగోపాల్‌యాదవ్, సర్పంచ్‌లు రమేష్, నారాయణస్వామి, యాదగిరి తదితరులు ఉన్నారు.



# ఎలాంటి ఇబ్బందులు రావొద్దు

### సిఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి : స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఆదేశం

**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం నల్లగొండ జిల్లా పర్యటన ఆసాంతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సవ్యంగా సాగేలా ఏర్పాట్లు ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు,రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంతో పాటు,కనగల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్న రూ.13,006 కోట్ల హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) రోడ్ల శంకుస్థాపన పైలాన్‌ను పరిశీలించారు. ముందుగా ఎన్‌జీ కళాశాల మైదానంలో ముఖ్యమంత్రి హాజరుకానున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సభా వేదిక, ప్రజల కోసం చేసిన ఏర్పాట్లు, టెంట్లు, జర్మన్ హ్యాంగర్లు, లైటింగ్, సౌండ్, ఎల్‌ఈడీ స్క్రీన్లు, బ్యారికేడింగ్ వంటి ప్రతి అంశాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లు అన్నీ పకడ్బందీగా ఉండాలని, ఎక్కడా లోటు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి జిల్లాలో అడుగుపెట్టినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యటన సవ్యంగా



సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి మైదానానికి చేరుకున్న వెంట నే రెండువైపులా ఉండే ప్రజలకు అభివాదం చేసేలా గ్రౌండ్‌లో ఇదివరకే ఉన్న కాంక్రీట్ వేదికను సిద్ధం చేయాలని,అక్కడి నుంచి ప్రజలకు అభివాదం చేసేలా చర్యలు తీసుకోవాలని సూ చించారు. ఇందుకోసం ముఖ్యమంత్రి ర్యాంప్ లేదా వాహనం ద్వారా అక్కడికి వచ్చేలా ఏర్పా టు చేయాలని, గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎస్‌పిశరత్ చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆర్అండ్‌బీ హ్యామ్ రోడ్ల సీఈ వి. వెంకటేశ్వరరావు,రోడ్లు భవనాల సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ గణేష్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వాణి,సంబంధిత జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

## 28న సిఎం బహిరంగ సభ

### భారీ సంఖ్యలో తరలిరావాలని

### మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** 28న నల్లగొండలోని ఎన్‌జికళాశాల మైదానంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 28న కనగల్ మండల కేంద్రంలో రూ.13 వేల కోట్ల వ్యయంతో నిర్మించే ఆర్ అండ్ బి,హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం ఎన్‌జి కళాశాలలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులంతా తరలిరావాలని కోరారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు.28న జరిగే సీఎం బహిరంగ సభ చారిత్రాత్మకంగా నిలుస్తుందని, పార్టీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు సవరణ కార్యక్రమంపై ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి కనగల్ వద్ద హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్‌తో పాటు రూ.250 కోట్లతో మెడికల్ కళాశాల నుంచి దుప్పలపల్లి వరకు నిర్మించే హ్యామ్ రోడ్డుకు కూడా శంకుస్థాపన చేస్తారని తెలిపారు.ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ పాశం రామ్ రెడ్డి,డిప్యూటీ మేయర్ మహమ్మద్ అబ్దుల్ అమేర్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి శ్రీనివాస్,నల్లగొండ పీఏసీఎస్ చైర్మన్లు ఆలకుంట నాగరత్నం రాజు, పాశం సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

# వైటిపిఎస్‌లో ప్రైవేటీకరణ విరమించాలి


### స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

### సిపిఐ జిల్లా నేత బంటు వెంకటేశ్వర్లు

### వైటిపిఎస్ ఉద్యోగ జెఎసికి సిపిఐ సంపూర్ణ మద్దతు



**ప్రజాపక్షం/నల్లగొండ(దామరచర్ల) :** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ),యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఏహెచ్‌పీ) భాగాల ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకుని స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.శుక్రవారం దామరచర్ల మండలం వీర్లపాలెం వైటీపీఎస్ మెయిన్ గేటు వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యాదాద్రి పవర్ ప్లాంట్ స్టేజ్1, 2 యూనిట్లకు సంబంధించిఆపరేషన్,మెయింటెనెన్స్,మెకానికల్,ఎలక్ట్రికల్ పనులను ఉద్యోగుల కొరతను సాకుగా చూపిస్తూ రానున్న మూడేళ్ల కాలానికి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు టెండర్లు ఆహ్వానించడం సమంజసం కాదన్నారు. ఈ నెల 12 నుంచి 29 వరకు టెండర్ల గడువు ప్రకటించారని తెలిపారు.విద్యుత్ సమస్యతో సతమతమవుతున్న తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.35 వేల కోట్ల వ్యయంతో యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ప్రారంభించారని గుర్తుచేశారు.ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేసి మొత్తం 4 యూనిట్లను ప్రారంభించిందని, ఒక్కో యూనిట్ నుంచి 800 మెగావాట్ల చొప్పున నాలుగు యూనిట్ల ద్వారా 3200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించిందని చెప్పారు. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ ప్లాంటును ప్రైవేటుపరం చేయడం వల్ల స్థానిక నిరుద్యోగ యువత ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రైవేటీకరణను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్,సీనియర్ నాయకులు జమ్ముల కోటయ్య,గజ్జల లక్ష్మీ నరసింహా రెడ్డి,పెదపాక వెంకటేష్,పవన్,గాంధీ,కాశయ్య,రమేష్,సత్యానందం, సూర్యం,మహేష్ బాబు,రాము,రవి నాయక్, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.




## క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం

### మాజీ ఐపిఎస్ అధికారి జెడి లక్ష్మీనారాయణ

### సూర్యాపేటలో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' ప్రారంభం

**ప్రజాపక్షం /సూర్యాపేట టౌన్:** క్రమశిక్షణ సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని మాజీ ఐపిఎస్ అధికారి జెడి లక్ష్మీనారాయణ అన్నారు. దేశంలో ఐఐటీజేఈఈ, నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయగా హోటల్ శ్రీ గ్రాండ్ వేదికగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూర్యాపేటలో ఫౌండేషన్ కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకు వస్తున్న రెసోనెన్స్ విద్యాసంస్థలను అభినందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన అభ్యాసం, స్పష్టమైన అవగాహన, సరైన మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తు విజయాలకు కీలకమన్నారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే క్రమబద్ధమైన విద్యా శిక్షణ ద్వారా భవిష్యత్తు పోటీ పరీక్షలకు బలమైన పునాదిని ఏర్పరచుకోవచ్చని తెలిపారు. ఈ ఫౌండేషన్ కోర్సు ద్వారా విద్యార్థులకు వివిధ అంశాలలో సమగ్ర శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ప్రారంభ దశలోనే బలమైన పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు భావనాత్మక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోగలరని కోరారు. దీంతో ఇంటర్ అనంతరం ఐఐటీజేఈఈ, నీట్ వంటి పోటీ ప్రవేశ పరీక్షలలో సులభంగా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా 50 పైగా క్యాంపస్లతో విజయవంతంగా దూసుకు పోతుందన్నారు.

## మొహర్రం మతసామరస్యానికి ప్రతీక

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు:** మొహరం పండుగ మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మండల పరిధిలోని ఇడికూడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మొహరం పండుగ వేడుకల్లో పాల్గొన్న అనంతరం సవారెత్తి ప్రజలను ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పీర్ల పండుగ హిందు ముస్లింలు ఐక్యమత్యంగా ఉంటూ ఆనందోత్సవాల మధ్య జరుపుకునే పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్ద ఎండి ఘనీ ,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు , చండూరు ఏఎంసి డైరెక్టర్ నల్పరాజు రామలింగయ్య , కాంగ్రెస్ జిల్లా నాయకులు కడారి లక్ష్మణ్ యాదవ్ , సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు , మండల పార్టీ కార్యవర్గ సభ్యులు కర్నాటి వెంకటేశం , బండమీది వెంకన్న, సిహెచ్ ఊషయ్య , ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం నవీన్ , ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు ఇరిగి ప్రవీణ్ , స్వామి పాల్గొన్నారు.

## విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను దేశవ్యాప్తంగా వెలుగులోకి తేవడమే ఛాత్రోన్ కీ గూంజ్



**ప్రజాపక్షం/గుండాల:** యాద్రాది భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరి గుట్టలో శుక్రవారం భారత లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ రాజస్థాన్‌లోని కోటలో విద్యార్థులు, యువత సమస్యలను తెలుసుకొని వారి గొంతుకగా ప్రారంభించిన ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య వేలాది మంది విద్యార్థులు, యువతతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా యాదగిరి గుట్టలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరిగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను దేశ వ్యాప్తంగా వెలుగులోకి తీసుకురావడమే ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. నాణ్యమైన విద్య, పారదర్శకమైన పరీక్షల వ్యవస్థ, ఉద్యోగాల భర్తీ, యువతకు సమాన అవకాశాలు కల్పించడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు కట్టుబడి ఉందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని యువత ఆశయాలకు అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం రాజస్థాన్ కోటాలో రాహుల్ గాంధీ మాట్లాడిన అంశాలను ఎల్ఈడి స్క్రీన్స్‌లో వీక్షించారు. ఈకార్యక్రమంలో మహిళ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి, యూత్ కాంగ్రెస్ ఇంచార్జీ భవ్యశ్రీ, యూత్ కాంగ్రెస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఫైజర్, రణధీర, ఎన్ఎస్‌యూఐ నాయకులు, సోషల్ మీడియా సభ్యులు, విద్యార్థినాయకులు, నాయకులు పాల్గొన్నారు.

## కత్తితో ఛాతిపై పొడిచి హత్య

**ప్రజాపక్షం/అనంతగిరి:** కత్తితో ఛాతిపై పొడిచి హత్యచేసి ఆ విషయం ఆత్మహత్యగా చిత్రీకరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కోదాడ రూరల్ ఇన్‌ఛార్జి సిఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని లక్కవరం గ్రామానికి చెందిన కంకణాల గోపాలరావు (42) తనకు తాను ఇంట్లో రాత్రి 12 గంటల సమయంలో కత్తితో పొడుచుకుని ఆత్మహత్య ప్రయత్నం చేసినాడు అని, తర్వాత అతడిని చికిత్స కోసం కోదాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించే లోపు అదే రోజు రాత్రి తన కుమారుడు చనిపోయాడని తల్లి కంకణాల నర్సమ్మ తెలిపారు. అనంతరం జరిగినటువంటి కొన్ని సంఘటన సందర్భంగా కుమారుడి మరణంపై అనుమానం ఉన్నదని తల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనంతగిరి ఎఎస్ఐ లింగారెడ్డి కేసు నమోదు చేసి శవ పంచనామ నిర్వహింంచి మెడికల్ ఆఫీసర్‌తో పోస్టుమార్టం నిర్వహించారు. తర్వాత ఈ విషయమై పలు కోణాల్లో విచారణ జరపగా గోపాలరావు భార్య స్రవంతి హత్య చేసినట్లుగా పరిశోధనలో వెల్లడైందన్నారు. సిఐ రామకృష్ణారెడ్డి సిబ్బందిలో కలిసి స్రవంతిని అదుపులోకి తీసుకుని విచారించగా ఇతరులతో అక్రమ సంబంధాలు అంటగట్టి ప్రతిరోజు తాగి ఇంటికి వచ్చి శారీరకంగా వేధిస్తూ, ఉన్న కాస్త పొలాన్ని అమ్మకానికి పెట్టడం వంటి కారణాలతో తన భర్త అడ్డు తొలగించుకోవాలని ఆలోచనతో ఇంట్లో దాచుకున్న కత్తితో అతడి చాతిపై పొడిచి హత్య చేసినట్లుగా ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితురాలిని జ్యూడిషయల్ రిమాండ్‌కు తరలించినట్లుగా సిఐ తెలిపారు.


# ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. పార్టీకి యూత్ కాంగ్రెస్ నాయకులు చాలా ముఖ్యమన్నారు. శుక్రవారం కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యాలయం నందు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలన్నారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను పేదలకు కేటాయించడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజక వర్గానికి 175 కోట్లు ఖర్చు చేస్తుందని అన్నారు. ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నూతనంగా జరుగుతున్న ఎస్ఐఆర్ సర్వేలో కాంగ్రెస్ పార్టీ తరపున బిఎల్ఏల నియామకం జరిగిందని, ప్రతి బూత్‌లో కూడా ఏ ఒక్క ఓటు కూడా తీసివేయకుండా పనిచేయాలన్నారు. ఎస్ఐఆర్‌పై పార్టీ పరంగా వస్తున్న సమాచారాన్ని పార్టీ కార్యకర్తలకు అందించాలని, ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. యూత్ కాంగ్రెస్ పట్టణ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, గ్రామాల్లో కూడా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి పోస్టులకు యూత్ కాంగ్రెస్ నాయకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని తన తండ్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులను ఆదరించే వారిని, వారికి పార్టీలో ప్రాధాన్యత కల్పించారని తాను కూడా అదే బాటలో పయనిస్తాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫిఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎలిమినేటి సురేష్, పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, నాయకులు వీరన్న నాయక్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, అబ్దుల్ రహీం, కౌన్సిలర్‌లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, సునీల్ రెడ్డి, తన్వీర్ హుస్సేన్, పోలగాని బాలు గౌడ్, మహిళా నాయకులు వేములకొండ పద్మ, శ్రావ్యరెడ్డి, బొడ్డు సాయి, జవహర్ పాల్గొన్నారు.

## మహాసభలను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/దేవరకొండ :** జులై 18, 19 తేదిల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములుగు మండలంలో జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగానాయక్ కోరారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములుగు మండలంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు జులై 18, 19 తేదిల్లో జరుగుతున్నాయని ఈ మహాసభలకు నల్గొండ జిల్లా ప్రాంతంలో గిరిజన తండాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని మహాసభ విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు సోమ్లానాయక్, పాపానాయక్, గోపి, కసనా, మంగిలి తదితరులు పాల్గొన్నారు.

## 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

**ప్రజాపక్షం/నాంపల్లి :** మహిళా అభివృద్ధి ,శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్టు చింతపల్లి పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి వెల్లడించారు.అభ్యర్థి సంబంధిత అంగన్‌వాడీ కేంద్ర పరిధిలోని వార్డు, గ్రామపంచాయతీకి చెందిన స్థానికురాలై ఉండాలి.ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత కలిగి ఉండాలి.నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నాటికి వయసు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి.అర్హతగల మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తు, అవసరమైన ధ్రువపత్రాలను జత చేసి జులై 10 సాయంత్రం 5 గంటలలోపు వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలి.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత ముందుకు...

2కె పరుగులో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, కుడా చైర్మన్

**ప్రజాపక్షం/హనుమకొండ:** డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం యువత ముందుకు రావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రపంచ మాదరద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకోని సెంట్రల్ జోన్ పోలీసుల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కె పరుగును వరంగల్ పోలీస్ కమిషనర్ ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, కుడా చైర్మన్‌తో కలసి ప్రారంభించారు. ట్రై సిటి పరిధిలోని యువత విద్యార్థులు పాల్గోన్న ఈ పరుగు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుండి సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వరకు కోనసాగింది. ఈ పరుగులో ప్రతిభ కబరిచిన యువతకు ముఖ్య అతిధిల చేతుల మీదుగా పతకాలు, సర్టిఫికేట్లను అందజేశారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిధి వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల సంబంధించి ప్రస్తుత సమాజంలో పెద్ద సమస్యగా మారిందని, యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి పోవద్దని, ఒక్కసారి వాటిని వినియోగించడం ద్వారా యువత జీవితాలు అంధకారం మారుతాయని, ముఖ్యంగా మత్తు పదార్థాలను విక్రయాలు, వినియోగించడంలాంటి చర్యలకు పాల్పడి చిక్కుల్లో పడోద్దని, విద్యార్థులు కేవలం చదువులపైనే దృష్టి పెట్టాలని, అదే విధంగా యువత తమ ఉన్నంత లక్ష్య సాధనకై కృషి చేయాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ యువత చేడు వ్యసనాలను దూరంగా వుంటూ ఆరోగ్యంతో వుండాలని, మత్తు పదార్థాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగివుండటంతో పాటు, ఇతరులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణకై ఈగల్ ఫోర్స్ విభాగాన్ని చేయడమైనదని, ఎవరైన మాదకద్రవ్యాలు విక్రయించిన, వినియోగించిన తక్షణమే 1908 నంబర్‌కు సమాచారం అందించాలని, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు తెలిపారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్ వున్న యువత మత్తుకు దూరంగా వుండాలని, డ్రగ్స్‌కు బానిసలయ్య వారి కుటుంబాలు, ముఖ్యంగా తల్లులు అనుభవించే వేదన వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం ఈ పరుగులో పాల్గోన్న యువత, విద్యార్థుల మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సైనికుడిలా పనిచేస్తామని అంటు ప్రతిజ్ఞ చేయించడంతో పాటు ఈ కార్యక్రమానికి హజరయిన ముఖ్య అతిధిలు మాదకద్రవ్యాల నిర్మూలనకై "ఐయాం యాంటీ డ్రగ్స్ సోల్జర" సెల్ఫీ పాయింట్ ఫోటోలు దిగి యువతను స్ఫూర్తిగా నిలిచారు. ఈ కార్యక్రమములో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు, టిజీ ఎన్‌పిడిసిఎల్ యం.డి వరుణ్ రెడ్డి, వరంగల్, హన్మకొండ కలెక్టర్లు డా.సత్యశారద, చాహత్ బాజ్‌పాయి, కుడా చైర్మన్ వెంట్రామిరెడ్డి, డిసిపిలు దార కవిత, అంకిత్‌కుమార్, అడిషినల్ కలెక్టర్ సంధ్యతో పాటు అడిషినల్ డిసిపిలు, ఎసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.




## పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** 28న దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయి. చిన్నారులు నిండు ప్రాణానికి రెండు పోలియో చుక్కలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి,పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 34,728 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసేందుకు 296 బూతులు 14 మొబైల్ టీం లతో వ్యాక్సిన్ పర్యవేక్షణ వ్యాక్సిన్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు.0 నుండి 5 ఏళ్ల వయసు గల చిన్నారుల కు విధిగా రెండు పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత అందరి పైన ఉంది, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి.

**పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

ప్రతి ఒక్కరూ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ కోరారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో వ్యాక్సిన్ ఇస్తామని, జిల్లాలో ఉన్న 241 గ్రామ పంచాయతీలలో అంగన్వాడీ కేంద్రాలలో, పాఠశాలలలో ఆదివారం రోజు పోలియో చుక్కలు వేస్తామన్నారు. సోమవారం మంగళవారం లలో ఇంటింటికి తిరిగి మిగతా పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకొని మీ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు.

## లింగ్యాతండాలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహణ



**ప్రజాపక్షం/కురవి:** మహబుబాబాద్ జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు శుక్రవారం కురవి పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగ్యాతండాలో పోలీసులు కమ్యూనిటి కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 300 ఇళ్లు, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు, రిజిస్ట్రేషన్ లేని 15 వాహనాలను గుర్తించి వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు సిఐ అంజలి తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన 100 కిలోల నల్లబెల్లం, 50 లీటర్ల గుడుంబా. 50 కిలోల పటిక, 16 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదనంగా 500 లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులకు దొంగతనాలు, చైన్ స్నాచింగ్, రోడ్డు భద్రత, హెల్మెట్ వాడకం, ప్రమాదకరమైన డ్రైవింగ్, గంజాయి, సైబర్ నేరాలు, మైనర్లకు సిగరెట్ల అమ్మకాలపై నిషేదం, సిసి కెమెరాల ఏర్పాటు ఆవశ్యకత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి కార్యకలాపాలపై సమాచారం అందించిన వారికి 5వేల బహుమతి ఇవ్వబడునని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురవి ఎస్ఐ బొలగాని సతీష్, రూరల్ ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో చోరీ కేసు ఛేదన

నలుగురు నిందితులకు రిమాండ్

**ప్రజాపక్షం/గూడూరు:** గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో యూనియన్ బ్యాంక్ సమీపంలో ఇటివల జరిగిన చోరీ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు.ఈకేసులో ప్రమేయం ఉన్న నలుగురు నిందితులను చాకచక్యంగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు గూడూరు ఎస్సై బి గిరిధర్‌రెడ్డి తెలిపారు.అరెస్టు చేసిన నిందితులను శుక్రవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా వారికి న్యాయస్థానం రిమాండ్ విధించింది.అరెస్టు అయిన నిందితులు కుత్తాడి దుర్గ(29)కలువగట్టు బండాపురం గ్రామం దేవరపల్లి మండలం (పశ్చిమగోదావరి జిల్లా) యరచాని మహాలక్ష్మీ(20)భీమడోలు గ్రామం మండలం (పశ్చిమగోదావరి జిల్లా) ఉయ్యాల గోపయ్య(30)మైలవరం గ్రామం మండలం (ఎన్‌టీఆర్ జిల్లా)కసాని అనంత సతీష్ కుమార్ (26) బండాపురం గ్రామం దేవరపల్లి మండలం (పశ్చిమ గోదావరి జిల్లా)కేసును త్వరితగతిన ఛేదించిన నిందుతులను అరెస్టు చేసిన గూడూరు పోలీసుల పనితీరును స్థానికులు అభినందిస్తున్నారు.కేసుకు సంబందించచిన పూర్తి వివరాలను దర్యాపు అనంతరం వెల్లడిస్తామని ఎస్ఐ గిరిధర్‌రెడ్డి తెలిపారు.

## పత్తిపల్లిలో శుభకార్యాలకు హాజరైన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు మండలం పత్తిపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పలు శుభకార్యాలకు మంత్రి సీతక్క హాజరయ్యారు. సముద్రాల సురేష్ కుమార్తె వివాహానికి హాజరై నవ వధూవరులను ఆశీర్వదించారు. అలాగే జాటోత్ వెంకటస్వామి కుమార్తెకు శుభాకాంక్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు పోరిక రాజేందర్ వివాహంతో పాటు ఆయన నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న మంత్రి రిబ్బన్ కట్ చేసి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, ధారవత్ సారయ్య, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాయిని 'సర్' ఎన్యూమరేషన్ పూర్తి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యుల ఓటరు వివరాల ఎన్యూమరేషన్ ప్రక్రియను అధికారులు శుక్రవారం పూర్తి చేశారు. బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ ప్రక్రియలో అధికారులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి నమోదు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ఎంఆర్ఓ రవీందర్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ (ఎన్నికలు) విఠలేశ్వర్, ఆర్ఐ దశరథ్ రామ్ రెడ్డి , స్థానిక బీఎల్‌వో సరస్వతి పాల్గొని అవసరమైన వివరాలను నమోదు చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల మేరకు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఓటర్లందరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని సూచించారు.

## గంజాయి రహితంగా మారుద్దాం




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ అవగాహన ర్యాలీలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పాల్గొన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గణేష్ చౌక్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి, "డ్రగ్స్, గంజాయి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. అలాగే డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించే సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జి డ్రగ్స్ రవాణా, విక్రయాలపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటూ నిరంతరం నిఘా కొనసాగిస్తోందన్నారు. అయితే కేవలం పోలీసుల చర్యలతోనే కాకుండా ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహా సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరిస్తేనే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందన్నారు. అనుమానాస్పద డ్రగ్స్ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అలాగే తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌కు బానిసైన వారి పునరావాసం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. డ్రగ్స్ అలవాటు ఉన్నవారు భయపడకుండా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రీహాబిలిటేషన్ సెంటర్లలో చికిత్స పొందాలని సూచించారు. స్వయంగా పోలీసులను సంప్రదించి చికిత్సకు సిద్ధమయ్యే వారికి పునరావాసం కల్పించడంతో పాటు, చట్టపరమైన నిబంధనల మేరకు వారికి సంబంధించిన కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. డ్రగ్స్ బారిన పడిన వారిని నేరస్థులుగా కాకుండా సమాజంలో తిరిగి మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే పోలీస్ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు కూడా అలాంటి వారిని రీహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువెళ్లి చికిత్స అందేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, డీఎస్పీ సంపత్ రావు, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, స్థానిక నాయకులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి

రూ.75 కోట్లతో అత్యాధునిక హంగులతో నూతన బస్ స్టాండ్ నిర్మాణం

క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించిన కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ నగర ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.75 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వరంగల్ నూతన బస్ స్టాండ్ నిర్మాణ పనులను వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం ఆయన కుడా అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి నిర్మాణ స్థలాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం వరంగల్ నగర సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. వరంగల్ పాత బస్ స్టాండ్ స్థానంలో అన్ని రకాల ఆధునిక హంగులు, ప్రయాణికులకు అవసరమైన సకల సదుపాయాలతో ఈ నూతన బస్ స్టాండ్ కాంప్లెక్స్ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. గత కొంతకాలంగా వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన లేదా మందకొడిగా సాగుతున్న పనులను వేగవంతం చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా చూడాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనుల్లో మరింత వేగం పెంచాలని సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలను, అధికారులను ఆయన ఆదేశించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్ బేలు, వెయిటింగ్ హాళ్లు, అత్యాధునిక రవాణా వసతులను సకాలంలో పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా నూతన బస్ స్టాండ్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.వరంగల్ నగరాన్ని అద్భుతమైన ఐటీ, పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో మెరుగైన రవాణా వ్యవస్థ ఎంతో కీలకమని, ఇందు కోసం కుడా ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా వెంకట్రామ్ రెడ్డి వెల్లడించారు.



## డ్రగ్స్ రహిత తెలంగాణే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** డ్రగ్స్ రహిత తెలంగాణ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని రాజీవ్ గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. యువత డ్రగ్స్‌కు మత్తు పానీయాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా నిర్మించుకోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల యువకులు తమ ప్రాణాలను కోల్పోవడమే కాకుండా, కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధన కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్, భూపాలపల్లి టౌన్ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహణ

అదనపు కలెక్టర్, పాలకుర్తి నియోజకవర్గ ఇఆర్ఒ బెన్ షోలోమ్

**ప్రజాపక్షం/ తొర్రూరు :** ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్, పాలకుర్తి నియోజకవర్గ ఈఆర్ఓ బెన్ షోలోమ్ అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ బెన్ షోలోమ్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సవరణ జాబితా కార్యక్రమం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జూన్ 25 నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాలను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ప్రతి పౌరుని పేరు జాబితాలో నమోదు చేయడం తప్పులను సరి చేయడం, అనర్హుల పేర్లను తొలగించడం జరుగుతుందన్నారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తారని అన్నారు. ప్రతీ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందజేస్తారని తెలిపారు. ఓటర్లు ఫారాన్ని నింపి అవసరమైన పత్రాలతో పాటు బీఎల్ఓకు సమర్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఫారాన్ని సమర్పించే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు తదితర ప్రత్యేక వర్గాల ఓటర్లకు ప్రత్యేక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ప్రతీ అర్హులైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు అయ్యేలా చూసుకోవాలన్నారు. బీఎల్ఓలకు అవసరమైన సహకారం అందించి, వారు సూచించిన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ నర్సయ్య, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌రెడ్డి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, సూపర్‌వైజర్లు, జీపీఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.



## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి: డిఎస్‌పి




**ప్రజాపక్షం/తొర్రూరు:** యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ కృష్ణ కిశోర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని, గంజాయి రహిత సమా నిర్మాణమే లక్ష్యంగా శుక్రవారం పట్టణ కేంద్రంలో డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు హెల్మెట్‌లు ధరించి భారీ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్ వద్ద పోలీసులు మానవహారంగా ఏర్పడి మాదక ద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కృష్ణ కిశోర్ మాట్లాడుతూ యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యసనాల వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సమాజపరంగా తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి ఒక నిషేధిత మత్తు పదార్థమని, దానిని కలిగి ఉండటం, వినియోగించడం, రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు సీఐ గణేశ్, మరిపెడ సీఐ, వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఓ యువతా... మత్తువదిలి మంచిగా బతకాలి

డిఎస్‌పి నంబూరు తిరుపతిరావు




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్. ఓ యువతా మత్తువదిలి మంచిగ బతకాలని మహబూబాబాద్ డిఎస్పీ నంబూరు తిరుపతి రావు పిలుపునిచ్చారు. శుక్రవారంనాడు మహబూబాబాద్ సబ్ జైల్లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. జైలర్ మల్లెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిఎస్పీ నంబూరు తిరుపతి రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జైల్లోని ఖైదీలచే డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అనేవి యువతను నిర్వీర్యం చేస్తూ వారి భవిష్యత్తును అంధకారం చేస్తున్నాయన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు ఏరూపంలో వున్నా,, సేవించినా, ఇతరులకు అమ్మినా రవాణా చేసినా తీవ్ర నేరంగా పరిగణించ బడుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ బారిన పడ్డ యువత తీవ్ర నేరాలకు పాల్బడుతుండడంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని వాపోయారు. డ్రగ్స్ మహమ్మారిని తుదముట్టించేందుకు పోలీస్ శాఖ తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా గంజాయి సాగు, అమ్మకంతో పాటు ఉపయోగించే వారిపై నిరంతరం పోలీస్ దేగకన్ను ఉంటుందని హెచ్చరించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం సమాజంలో భాద్యత కలిగిన ప్రతి పౌరుడూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఎక్కడ డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించినా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఇందుకు ఐదువేల రూపాయల పారితోషకం కూడా ఉంటుందని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. నేర అవినీతి రహిత సమాజమే తెలంగాణ పోలీస్ లక్ష్యమని పేర్కొన్నారు. నాడు డ్రగ్స్ బారిన పడ్డ చైనా, మలేషియా దేశాల అభ్యర్థనతో ఐక్యరాజ్యసమితి తీర్మానం మేరకు 1988లో జూన్ 26 తేదీని అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంగా జరువుకుంటున్నామని తెలియజేశారు. అనంతరం గంజాయితో పాటు వివిధ నేరాలకు పాల్బడిన ఖైదీలకు ప్రత్యేకంగా సూచనలూ సలహాలతో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజు, జైలు సిబ్బంది మహ్మద్ ఖలీల్, ఎమ్మెనో లక్ష్మన్, మోటపోతుల వీరన్న, పోషిని జనార్ధన్, రామాంజనేయులు, నర్సింహారావుతో పాటు ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** అంతర్జాతీయ మత్తు పదార్థాలు అక్రమరవాణా నిరోధక దినోత్సవాన్నిపురస్కరించుకొని హసన్‌పర్తి మండల కేంద్రంలో శుక్రవారం సుజాత విద్యానికేతన్ హైస్కూల్ , హసన్‌పర్తి పోలీస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వల్ల కలిగేనష్టాలపై అవగాహన సదస్సు ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు దేవేందర్, సుజిత్‌రెడ్డిలు హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ వ్యాయామం, ఆరోగ్యకరమైన అలవాట్లతో జీవితం ముందుకు సాగాలని యువత, విద్యార్థులు సరదా కోసం అలవాటు చేసుకునే వ్యసనాలు వారి జీవితాలను, కటుంబాలను భవిష్యత్తు అంతా అంధకారం చేస్తుందని విద్యార్థులకు సూచించారు. అనంతరం రహదారిపై ఏర్పాటు చేసిన బహిరంగసభలో పోలీసులు విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని మత్తు పదార్థాలు వాడడం వలన సమాజనికి జరిగే నష్టం పైఅవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పోలీస్ సిబ్బంది, సుజాత విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం,పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రవితేజ తో ధమాకా లాంటి హిట్ ఇచ్చిన త్రినాధ రావు నక్కిన దర్శకత్వంలో హవిష్ హీరోగా తెరకెక్కిస్తున్న చిత్రం 'నేను రెడీ'. హర్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి బ్యానర్‌పై కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో హవిష్ సరసన కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది.

# రీల్



## 'నేను రెడీ' పోస్టర్ రిలీజ్

రవితేజ తో ధమాకా లాంటి హిట్ ఇచ్చిన త్రినాధ రావు నక్కిన దర్శకత్వంలో హవిష్ హీరోగా తెరకెక్కిస్తున్న చిత్రం 'నేను రెడీ'. హర్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి బ్యానర్‌పై కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో హవిష్ సరసన కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. కామెడీ, వినోదం, మాస్ అంశాల కలయికతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా చిత్ర బృందం ఒక కొత్త పోస్టర్ను విడుదల చేసింది. ఈ పోస్టర్లో హవిష్ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఒక వర్క్షాస్ సెట్టింగ్‌లో కూర్చుని ఉన్న హవిష్ తన ప్రజెన్స్ కట్టిపడేశాడు. అతని ట్రెండీ లుక్ అతని పాత్రపై ఆసక్తిని పెంచుతున్నాయి. అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామరస్ నటనతో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన నర్గీస్ ఫక్రి ఈ చిత్రంలోని ఒక ప్రత్యేక పాటతో తెలుగు తెరకు పరిచయం కానుంది. ఈ చిత్రంలో బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, మురళీ శర్మ, శ్రీలక్ష్మి, విటివి గణేష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.మిక్కీ జె మేయర్ సంగీతం సమకూరుస్తుండగా, నిజార్ షఫీ సినిమాటోగ్రఫీని, ప్రవీణ్ పూడి ఎడిటింగ్‌ను నిర్వహిస్తున్నారు. విక్రాంత్ శ్రీనివాస్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే అందించారు. త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటించనుంది. చిత్రానికి కథ, మాటలు: విక్రాంత్ శ్రీనివాస్, ఎడిటర్: ప్రవీణ్ పూడి, యాక్షన్: రామకృష్ణ.



## 'రాజా ది రాజా' మూవీ 'ఊహాలే' సాంగ్ రిలీజ్

రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న 'రాజా ది రాజా' చిత్రం మూవీ లవర్స్‌లో మంచి బజ్ను క్రియేట్ చేస్తోంది. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్టైనర్కు అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కె. శ్రీలతా రెడ్డి సమర్పిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా నిర్మాతలు సెకండ్ సింగిల్ ఊహలే రిలీజ్ చేశారు. మార్క్ కె రాబిన్ ఈ సాంగ్ ని బ్యూటీఫుల్ లవ్ సాంగ్ గా కంపోజ్ చేశారు. కృష్ణకాంత్ (కెకె) రాసిన హృదయాన్ని తాకే సాహిత్యం మరింత అందాన్ని తీసుకొచ్చింది.కార్తీక్, శ్వేతా మోహన్ తమ ప్లజెంట్ వోకల్స్ తో పాటలోని ప్రేమ భావాలను ఎంతో ఆహ్లాదకరంగా ఆవిష్కరించారు. ఈ చిత్రానికి రవికిరణ్ బోయిడపు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విజయ్ కుమార్ పసుపులేటి ఆర్ట్ డైరెకర్‌గా పనిచేస్తున్నారు.ఈ చిత్రంలో సాయి కుమార్, డాక్టర్ నరేష్ విజయకృష్ణ, అవసరాల శ్రీనివాస్, విష్ణు ఓయి, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, బద్రం, మైమ్ మధు, ఆనంద్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా 'రాజా ది రాజా' జూలై 17న విడుదల కానుంది.ఈ చిత్రానికి ఎడిటర్: సాయి బాబు తలారి, ఆర్ట్ డైరెక్టర్: విజయ్ కుమార్ పసుపులేటి.

## 'తెల్ల కాగితం'పై ప్రేమ 'చిలకా' సాంగ్



'కోర్ట్', 'బ్యాండ్ మేళం' సినిమాలతో దూసుకెళ్తున్న నటుడు హర్ష్ రోషన్ తాజాగా నటించిన చిత్రం తెల్ల కాగితం. హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా తెరకెక్కిన 'తెల్ల కాగితం' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మలపాటి నిర్మాణంలో రమేష్ బండ్రెడ్డి ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, ఇతర కంటెంట్ సినిమా మీద అంచనాల్ని పెంచేసింది. తాజాగా మ్యూజికల్ ప్రమోషనల్స్‌లో భాగంగా ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు.'చిలకా' అంటూ సాగే ఈ పాటకు పూర్ణా చారి సాహిత్యం, అనురాగ్ కులకర్ణి గాత్రం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇక విజయ్ బుల్గానిన్ బాణీ ఎంతో వినసొంపుగా ఉంది. లిరికల్ వీడియోని గమనిస్తే.. స్కూల్ వాతావరణం, హీరో హీరోయిన్ల మధ్య ఉండే ప్రేమ.. వాటిని తెరకెక్కించే తీరు ఎంతో హృద్యంగా కనిపిస్తున్నాయి. హర్ష్ రోషన్, నక్షత్రల మధ్య స్కూల్ డేస్లోని స్వచ్ఛమైన ప్రేమకు సంబంధించిన అందమైన క్షణాలు అందంగా బంధించినట్టు కనిపిస్తోంది. 'చిలకా' లిరికల్ వీడియోలో హర్ష్ రోషన్ వేసిన 'హుక్ స్టెప్' సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం ఖాయమన్నట్టుగా కనిపిస్తోంది. రచయిత నందు సవిరిగన కథను అందించారు. కథను రూపొందించడంతో పాటు, నందు స్క్రీన్‌ప్ల మరియు సంభాషణలను కూడా రాశారు; ఈ చిత్రం ద్వారా రమేష్ బండ్రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సినిమాటోగ్రాఫర్ కె.వి. గుహన్ కెమెరామెన్‌గా, కార్తీక శ్రీనివాస్ ఎడిటర్గా పని చేస్తున్నారు.

## మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ 'తత్వం'



ధినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'తత్వం'. ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె. ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్మాత వంశీ సీమకుర్తి మాట్లాడుతూ ట్రైలర్ అందరికి నచ్చింది. సినిమా కూడా చాలా బాగుంటుంది. దర్శకుడు అనుకున్నది అనుకున్నట్లుగా స్క్రీన్‌ప్లే ప్రజెంట్ చేశాడు అన్నారు. మరో నిర్మాత శ్వేత పసుపులేటి మాట్లాడుతూ తత్వం టైటిల్‌కు తగ్గట్టుగా చాలా డిఫరెంట్గా ఉంటుంది. ఓ కొత్త సినిమాను చూశామన్నఅనుభూతికి లోనవుతారు. దర్శకుడు ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డాడు. ఆయన కష్టానికి తగ్గ ప్రతిఫలం విజయం రూపంలో వస్తుందని నమ్ముతున్నాను అన్నారు.ఎగ్జిక్యూటివ్ నిర్మాత భరత్ మాట్లాడుతూ ఈ సినిమాలో అన్ని ఎలిమెంట్స్ కుదిరాయి.అర్జున్ కోలా ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నాడు. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ ఇది. దినేష్ తేజ్ వినగానే వెంటనే ఓకే చేశాడు. ఈ సినిమా కోసం అందరూ దిబెస్ట్ ఇచ్చారు.వంశీ అన్వేషణ తరహాలోనే అందరినీ కట్టిపడేసే సినిమా ఇది. ఈ సినిమాలో ఉంటే ట్విస్ట్ ఆడియెన్స్‌కు షాకింగ్గా ఉంటుందని అన్నారు. హీరో ధినేష్ తేజ్ మాట్లాడుతూ ఈ సినిమా నా కెరీర్కు ఇది టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుంది. అందరి సహకారంతో భవిష్యత్లో మరిన్ని మంచి సినిమాలు చేస్తాను. కంటెంట్ ఉన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తారు. సో.. అలాంటి బలమైన కంటెంట్తో రాబోతున్న తత్వంను ప్రేక్షకులు సక్సెస్ చేస్తారని నమ్ముతున్నాను అన్నారు.

## పల్లె అందాలను ఆవిష్కరించే సర్కారు బాయి



శ్రీరామ్ నిమ్మల, వర్షిక హీరో హీరోయన్స్ గా నటిస్తున్న సినిమా 'సర్కారు బాయి'. ఈ చిత్రాన్ని డెక్కన్ ఫిలింస్ సమర్పణలో ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు లారా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అప్పటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబిస్తూ నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటం వంటి అంశాలను దర్శకుడు లారా కళ్లకు కట్టినట్లు తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు మంచి స్పదన లభిస్తోంది. రెస్పాన్స్ వచ్చింది.ఈ పోస్టర్ లో తెలంగాణ పల్లె యువకుడిగా ఎంతో సహజంగా శ్రీరామ్ నిమ్మల కనిపిస్తున్నారు. సర్కారు బాయి సినిమా హీరోగా, నటుడిగా ఆయనకు మంచి పేరు తెస్తుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. హీరో శ్రీరామ్ నిమ్మల పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ మూవీ టీమ్ బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. ప్రస్తుతం సర్కారు బాయి సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ నెల 17వ తేదీ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. హీరో శ్రీరామ్ నిమ్మల, హీరోయిన్ వర్షిక, ముఖ్య నటీనటులు బాహుబలి ప్రభాకర్, నాగ మహేష్ లపై సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. జూలై నెలాఖరు వరకు ఈ భారీ షెడ్యూల్ కొనసాగనుంది. శ్రీరామ్ నిమ్మల, వర్షిక, బాహుబలి ప్రభాకర్, వివ రెడ్డి, నాగ మహేష్, దిల్ రమేష్, చలాకీ చంటి, చిట్టిబాబు, శివాని రెడ్డి, నుపూర్ ముఖర్జీ, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి డిఓపి అమర్.జి, మ్యూజిక్ కె. శివ, ఎడిటర్ బి.యన్.రెడ్డి, కాస్ట్యూమ్ డిజైనర్: కె. మాధురి

## 'గ్రాడియంటే' తో చేతులు కలిపిన శ్రావ్య ఫిలిమ్స్



ఉత్తమ చిత్రాల అవార్డు గ్రహీత, సామాజిక అంశాలపై తనదైన ముద్ర వేసిన దర్శకుడు పి. సునీల్ కుమార్ రెడ్డి తాజాగా తెరకెక్కించిన 'ఎల్‌జిబిటిఎ లీగల్ బ్యాటిల్' చిత్రం ఇప్పుడు దేశవ్యాప్తంగా మరింత విస్తృత ప్రేక్షకాదరణ పొందేందుకు సిద్ధమవుతోంది.జూన్ 19న ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో దేశ వ్యాప్తంగా విడుదలైన ఈ తెలుగు చిత్రం ప్రేక్షకులు, విమర్శకులు, ఎల్‌జిబిటి కమ్యూనిటీ నుంచి విశేష ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం విజయవంతంగా రెండో వారంలో ప్రదర్శితమవుతున్న ఈ చిత్రాన్ని పలు భారతీయ భాషల్లో డబ్ చేసి విడుదల చేయాలని గ్రాడియంటే ఇన్ఫోటైన్‌మెంట్ లిమిటెడ్ ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి సినిమాలకు సరైన వేదిక దొరికితే అవి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకోగలవు. ఈ భాగస్వామ్యం భవిష్యత్తులో మరిన్ని విలువైన, సామాజిక బాధ్యత కలిగిన చిత్రాలకు మార్గం సుగమం చేస్తుందని నమ్ముతున్నాను అని చెప్పారు.

## ఆరుగురు బంగ్లాదేశ్ జాతీయులు అరెస్టు

**కొచ్చి:** ఎరూర్ ప్రాతంలో అక్రమంగా నివసిస్తున్నారనే ఆరోపణపై ఆరుగురు బంగ్లాదేశ్ జాతీయులను కేరళ పోలీస్‌లు అరెస్టు చేశారు. ఇంటలిజెన్స్ ఏజెన్సీ నుండి అందిన సమాచారం మేరకు, పోలీస్‌లు గురువవారం ఎరూర్‌లోని కుట్టిపదం రోడ్డులో ఉన్న ఒక స్క్రాప్ షాపుపై దాడి చేశారని అధికారులు తెలిపారు. తనిఖీ సమయంలో, పోలీసులు స్క్రాప్ షాపులోని ఉద్యోగుల గుర్తింపు కార్డులు,ఇతర పత్రాలను తనిఖీ చేయగా, అవి నకిలీవని తేలింది. అరెస్ట్ అయిన వారిని రకీవ్ షాబా, ముహమ్మద్ సోహల్ ఫరాజ్, తారెక్, సోగిర్, మైధి హజీదా , ముహమ్మద్ అగిన్‌గా గుర్తించారు. విచారణలో, తాము బంగ్లాదేశ్ వాసులమని ,గత కొన్ని నెలలుగా కొచ్చిలో పనిచేస్తున్నామని నిందితులు అంగీకరించినట్లు సమాచారం. తరువాత వారిని హిల్ ప్యాలెస్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా, అక్కడ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు వారిని విచారించారు.భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ,ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారెనర్స్ యాక్ట్‌లోని వివిధ నిబంధనల కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. నిందితులు కేరళకు ఎలా చేరుకున్నారు, వారి ప్రయాణానికి ఎవరు సహకరించారు అనే విషయాలపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. రిమాండ్ విచారణలో భాగంగా అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరుపరుస్తామని అధికారులు తెలిపారు.

## వేలం వేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం మొత్తం 46 ప్లాట్లకు వేలంపాట నిర్వహిస్తుండగా, కార్మికులు వేలం ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీనితో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళన సందర్భంగా కార్మిక నాయకుడు గద్దల సంజీవ్ సమీపంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనతో పాటు రఘు, యశోద, దశరథం కూడా ట్యాంక్‌పైకి ఎక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా నినాదాలు చేశారు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమై చాకచక్యంగా వ్యవహరించి వారిని సురక్షితంగా కిందకు దించారు. దీనితో పెద్ద ప్రమాదం తప్పింది. ఆందోళన చేస్తున్న కార్మికులకు మద్దతుగా బిజెపి నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఘటన స్థలానికి చేరుకొని సంఘీభావం తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ అజంజాహి మిల్లును నమ్ముకుని జీవించిన 318 మంది కార్మికులకు అదే మిల్లు భూముల్లో ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వానికి ఆదాయం కోసం భూములను వేలం వేయడం సమంజసం కాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి వేలం ప్రక్రియను నిలిపివేసి, కార్మికులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు భారీ సంఖ్యలో పోలీసులు మోహరించగా, కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. అయితే పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కార్మిక సంఘాలు తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## హతమార్చింది ఒక్కడే

(మొదటి పేజీ తరువాయి)

మహమ్మద్ సోహైల్, బంగారం తాకట్టు పెట్టుకుని నగదు ఇచ్చిన జ్యువెలరీ వ్యాపారి హేమంత్ కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మహీంద్రా మరాజో కారు, రూ.3 లక్షల నగదు, హత్యకు ఉపయోగించిన కత్తి,మూడు సెల్‌ఫోన్లు, ఐదు తులాల కరిగించిన బంగారు ముద్ద,భూ,బ్యాంకు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. జూన్ 22న నల్లగొండ పట్టణంలోని తెలంగాణ కాలనీ, సాగర్ రోడ్డులో గల ఇంటి నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంట్లో హసీనా,ఆమె భర్త సుల్తాన్, కుమారుడు ముజమ్మిల్, కుమార్తె అఫ్సూరా మృతదేహాలను గుర్తించారు. ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించారు. నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు కుట్ర వెలుగులోకి వచ్చింది.

**అప్పుల బాధలు.. సహాయం చేయలేదన్న కోపం**

ప్రధాన నిందితుడు సయ్యద్ అస్లాం టాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తూ విలాసాలకు అలవాటు పడి అప్పుల్లో కూరుకుపోయాడు. ఏడాది క్రితం హసీనా వద్ద లక్ష రూపాయలు అప్పు తీసుకుని వడ్డీ చెల్లిస్తున్నాడు. ఇటీవల మరో లక్ష రూపాయలు అప్పుగా ఇవ్వాలని కోరగా హసీనా నిరాకరించింది. పాత అప్పు కూడా వెంటనే చెల్లించాలని ఒత్తిడి చేయడంతో అస్లాం, అతని భార్య తబస్సుం తీవ్ర అసహనానికి గురయ్యారు. అదే సమయంలో హసీనా తన సొంత కూతురు బుష్రాకు సహాయం చేయకుండా, సవతి పిల్లలైన ముజమ్మిల్, అఫ్సూరాలకే ఆస్తులు ఇస్తోందనే భావన కూడా కుట్రకు దారితీసినట్లు దర్యాప్తులో తేలింది.



**ముందే దొంగతనం యత్నం.. హత్యకు యూట్యూబ్‌లో పక్కా ప్లాన్**

ఈఏడాది ఫిబ్రవరి 28న అస్లాం, అతని స్నేహితుడు సోహైల్ కలిసి హసీనా ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి దొంగతనానికి ప్రయత్నించారు. అయితే విలువైన వస్తువులు దొరకకపోవడంతో కోపంతో ఇంటి గోడలకు కోడిగుడ్లు పగులగొట్టి వెళ్లిపోయారు. హసీనా వద్ద పెద్ద మొత్తంలో నగదు, బంగారం ఉందని తెలుసుకున్న అస్లాం ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం యూట్యూబ్‌లో హత్య తర్వాత పోలీసులకు చిక్కకుండా ఉండే మార్గాలపై వీడియోలు వీక్షిస్తూ పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు. జూన్ 19 రాత్రి అస్లాం తన కారులో నల్లగొండకు చేరుకుని ఇంటి సమీపంలో వేచి ఉన్నాడు. అర్ధరాత్రి ఇంటి ప్రహరీ గోడ దూకి లోపలికి ప్రవేశించి దాక్కున్నాడు. తెల్లవారుజామున హసీనా బయటకు రాగానే కత్తితో దాడి చేశాడు. ఆమె కేకలు విని వచ్చిన సుల్తాన్‌పై కూడా దాడి చేశాడు. అనంతరం ముజమ్మిల్ ప్రతిఘటించినా అతడిని హతమార్చాడు.

**సాక్ష్యం మిగలకూడదనే చిన్నారిని హత్య**

ఇంట్లో ఉన్న 12 ఏళ్ల అఫ్సూరా భయంతో మంచం కింద దాక్కుంది. తనను గుర్తించిందనే అనుమానంతో అస్లాం ఆమెను బయటకు లాగి హత్య చేశాడు. నలుగురూ చనిపోయారని నిర్ధారించుకున్న అనంతరం బంగారం, పత్రాలు తీసుకుని ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు పారిపోయాడు. హత్యల అనంతరం దొంగిలించిన బంగారు ఆభరణాలను తన స్నేహితుడు సోహైల్ సహాయంతో దిల్‌సుఖ్‌నగర్‌లోని జ్యువెలరీ వ్యాపారి హేమంత్ కుమార్ వద్ద తాకట్టు పెట్టాడు. దీనికి ప్రతిగా రూ.5.30 లక్షలు పొందినట్లు విచారణలో అంగీకరించాడు. వారి వద్ద ఉన్న రూ.3 లక్షల నగదు, ఐదు తులాల కరిగించిన బంగారు ముద్ద, మహీంద్రా మరాజో కారు, మూడు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులు, భూ, బ్యాంకు పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంచలన కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని మూడు రోజుల్లోనే ఛేదించిన నేర పరిశోధన, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతిభ కనబరిచిన నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి, రూరల్ ఎస్ఐ శివ ప్రసాద్, టూ టౌన్ ఎస్ఐ సైదాబాబు, నకిరేకల్ ఎస్ఐ వీర బాబు ఉన్నారు. అలాగే సీసీఎస్ బృందం సభ్యులైన విష్ణువర్ధన గిరి, నాగార్జున ప్రసాద్, పుష్పగిరి, వైదుపాషా, సాయి శివరాజ్‌లతో పాటు టౌన్ పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

## చురుగ్గా నైరుతి

(మొదటి పేజీ తరువాయి)

వర్షాలు కురిసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాబోయే వారం రోజుల పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, కర్ణాటక, తమిళనాడులో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో ఈనెల 27 నుంచి జూలై 3 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు రాష్ట్రవ్యాప్తంగా కురిసే అవకాశం ఉందన్నారు. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈనెల శుక్ర, గురువారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, మహబూబ్ నగర్ తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శని, ఆదివారం కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాల సూచన ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు కూడా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కొనసాగే అవకాశముందన్నారు. బుధవారం నుంచి శనివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగడంతో పాటు అక్కడక్కడ భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఇదే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు.

## విచారణ జరిపించాలి

(మొదటి పేజీ తరువాయి)

బయటపడిందని ప్రతిపక్ష పార్టీ విమర్శించింది. అయోధ్య అంశాన్ని తమ విభజన రాజకీయాలకు వాడుకున్న తర్వాత, బిజెపి–ఆర్ఎస్ఎస్ సాధారణ భక్తుల విరాళాలను దోచుకున్నాయని, వారి మనోభావాలను పూర్తిగా అపహాస్యం చేశాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ విమర్శించారు. ఒకవైపు కఠినమైన ఎఫ్‌సిఆర్‌ఎ నిబంధనల ద్వారా నమోదిత ట్రస్టులను నియంత్రించాలని బిజెపి కోరుకుంటోందని, మరోవైపు ఆర్ఎస్ఎస్ వంటి పూర్తిగా నమోదు కాని సంస్థలు దేశంలోని ఆలయాలను దోచుకోవడానికి స్వేచ్ఛను కలిగి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 'నిజమైన హిందువులమని చెప్పుకునే సంఘ్ పరివార్ డొల్లతనం మరింత బయటపడింది; ఎందుకంటే ప్రస్తుతం నమోదైన ఎఫ్ఐఆర్‌లో ఆలయ నిధుల బాధ్యత కలిగిన ట్రస్టీల పేర్లు కూడా లేవు. దానికి బదులుగా, ఈ భారీ కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన వారిని వదిలేసి, యుపి పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కేవలం కింది స్థాయి అధికారులను మాత్రమే గుర్తించింది అని వేణుగోపాల్ ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి నేతృత్వంలో జరిగే స్వతంత్ర విచారణ మాత్రమే ఈ ఆలయ దోపిడీ తీవ్రతను వెలికితీస్తుందని కాంగ్రెస్ నేత అన్నారు. రామమందిరం లో విరాళాలు, కానుకల విషయంలో భయంకరమైన దోపిడీ జరిగిందని సీనియర్ కాంగ్రెస్ నేత రాజీవ్ శుక్లా ఆరోపించారు. శ్రీరామునిపై విశ్వాసం ఉన్న ప్రజల నుండి ముఖ్యంగా గ్రామాలు, సమాజంలోని పేద వర్గాల నుండి సేకరించిన విరాళాలు దుర్వినియోగం అయ్యాయని, అసలైన బాధ్యులను వదిలేసి కింది స్థాయి ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. సీనియర్ అధికారుల కుమ్మక్కు లేకుండా, కేవలం కింది స్థాయి ఉద్యోగి సీసీటీవీ కెమెరాలను ఆపివేసి ఇంత భారీ మొత్తాన్ని దొంగిలించడం సాధ్యమేనా అనేది విచారణ జరపాల్సిన అంశమని ఆయన అన్నారు.

## సిట్‌తో సరిపెట్టొద్దు

(మొదటి పేజీ తరువాయి)

వెలుగులోకి వచ్చే వరకు విచారణ కొనసాగించాలని ఆయన అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కేసులో ట్రస్టు సీనియర్ పదాధికారులపై కూడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, విచారణ జరపాలన్నారు. సిట్ నివేదిక ఆధారంగా నమోదైన ఎఫ్ఐఆర్...ఈ వ్యవహారంలో బయటపడిన అంశాల్లో చిన్న భాగం మాత్రమేనని పేర్కొన్నారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామాలు చేయడం మాత్రమే సరిపోదని, ఈ వ్యవహారంలో వారి పాత్ర, బాధ్యత, ప్రమేయంపై కూడా సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. జవాబుదారీతనాన్ని ప్రదర్శించినట్లు నటిస్తూ కొంతమంది దిగువ స్థాయి సిబ్బందిపై మాత్రమే కేసులు నమోదు చేసి, ఆర్ఎస్ఎస్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)కి చెందిన సీనియర్ నాయకత్వాన్ని బాధ్యత నుంచి తప్పించడం...అసలు విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నమేనని విమర్శించారు. అయోధ్య జిల్లా కలెక్టర్‌కు సిట్ సమర్పించే నివేదికపై ప్రజలు నమ్మరని తెలిపారు. ఎందుకంటే జిల్లా కలెక్టర్ స్వయంగా రామమందిర ట్రస్టులో ఎక్స్ ఆఫిషియో సభ్యుడిగా ఉన్నందున, ఇటువంటి దర్యాప్తు వ్యవస్థ పూర్తిస్థాయి నిజాలను వెలికితీయలేదని స్పష్టం చేశారు. ట్రస్టు సీనియర్ పదాధికారులపై కూడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భక్తులు ఆలయానికి పెద్దఎత్తున బంగారం, వెండి, నగదు విరాళాలు ఇస్తున్నప్పటికీ వాటికి రసీదులు ఇవ్వడం లేదని...రోజురోజుకు కొత్త ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు బయటపడిన దానికంటే ఈ కుంభకోణం మరింత విస్తతంగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసాన్ని దుర్వినియోగం చేయడానికి, వారు సమర్పించిన కానుకలను దోచుకోవడానికి ఎవరికీ అవకాశం ఇవ్వకూడదని రాజా స్పష్టం చేశారు. మొత్తం వ్యవహారంపై స్వతంత్ర న్యాయ సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న వారు ఎంతటివారైనా... ఏ సంస్థకు చెందిన వారైనా చట్టం ముందు నిలబెట్టాలని ఆయన కోరారు. రామమందిరానికి భక్తులు విశ్వాసంతో సమర్పించిన విరాళాలు ఎలా దుర్వినియోగానికి గురయ్యాయో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. విరాళాల సేకరణ, నిర్వహణ, లెక్కల విషయంలో పారదర్శకత, జవాబుదారీతనం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రామమందిర నిర్మాణంలో కీలక పాత్ర పోషించినందున ఈ వ్యవహారంపై దేశానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని... అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ ఘటనపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలు హిందువుల విశ్వాసాలతో రాజకీయాలు చేస్తున్నాయని యోగి చేసిన వ్యాఖ్యలను రాజా తీవ్రంగా ఖండించారు. అసలు ప్రశ్న విరాళాల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరగాలనే అంశమని స్పష్టం చేశారు. న్యాయ విచారణకు ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com